తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ fb.com/vaartha
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
22-2-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 21 పేజీలు: 10+4 వెల: 6.50

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

మహాయుతిలో తారస్థాయికి చేరిన లుకలుకలు 5లో
ఎఫ్‌బిఐ కొత్త డైరెక్టర్‌గా కాశ్‌పటేల్ 5లో
ఎన్నికల ప్రక్రియలో విదేశీ జోక్యమా? 5లో

## రాష్ట్రంలో ఇక ప్రజలందరికి
# 25లక్షల ఆరోగ్యబీమా

### ఈ ఉచిత పథకం ఏప్రిల్ లేదా మే నుంచి అమలు
### 30 రకాల స్పెషాల్టీలతో కలిపి 3,257 రకాల చికిత్సలు
### కొత్త విధానంలో 6 గంటల్లోనే చికిత్స ఆరంభం
### ప్రతి కుటుంబం తరపున ప్రభుత్వం రూ.2,500 దాకా ప్రీమియం చెల్లింపు: సిఎం చంద్రబాబు



**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య సేవల విషయంలో ప్రజలకు పూర్తి స్థాయిలో అండగా ఉంటామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇందుకు వీలుగా ప్రభుత్వం రూ.25లక్షల ఆరోగ్యబీమాను అందుబాటులోకి తీసుకుని వస్తామని తెలిపారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు ఆలోచనా విధానాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రజలందరికీ త్వరలోనే ఉచిత ఆరోగ్య బీమా కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రజలందరికి బీమాకు వర్తింపచేసి, తద్వారా ఆరోగ్యబీమా(హెల్త్ ఇన్సురెన్స్)ను రూ.25లక్షల వరకు వైద్యసేవలు అందిస్తారు. ఈ విధానం అమలు కోసం పలు ప్రతిపాదనలను చేసారు. వీటిలో కీలక ప్రతిపాదనను అమలులోకి తీసుకుని వస్తారు. ఈ విధానం అమల్లోకి వస్తే చికిత్స కోసం ఎక్కువ సమయం ఇబ్బంది పడాల్సి ఉండదన్నారు. బీమా విధానంలో 6గంటల్లోనే చికిత్స ప్రారంభ అనుమతి లభిస్తుంది. చికిత్సకు ఆమోదం తెలిపేందుకు బీమా సంస్థ నిరాకరిస్తేవెంటనే అప్పీలు చేసుకునే వెసులు బాటును కల్పిస్తారు. ఈ విధానంలో ప్రభుత్వానికి ఎక్కువ అధికారాలు ఉంటాయి. ఎంపిక చేసిన బీమా కంపెనీ మూడేళ్ల పాటు సర్వీసును అందించాలి. ప్రతిఏడాది పని తీరును సమీక్షిస్తారు. ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్య సేవట్రస్టు అనుబంధ ఆసుపత్రులు బీమా విధానంలోనూ కొనసాగుతాయి. వైద్యమిత్రల సేవలనుకొనసా గిస్తారు. ఎంపిక చేసిన బీమా సంస్థలకు ప్రతి మూడునెలల కొకసారి ప్రభుత్వపరంగా ముందుగానే చెల్లింపులు చేస్తారు. దీనివల్ల బిల్లుల చెల్లింపుల సమస్యలు తలెత్తవు. రోగులకు చికిత్స వివరాలు అందిన తర్వాత బీమా సంస్థలు సాధ్యమైనంత త్వరగా చెల్లింపులు చేసేలా నిర్దేశిత గడువును కూడా టెండరు డాక్యుమెంట్‌లో పొందుపరుస్తున్నారు. ప్రస్తుతం 30రకాల స్పెషాల్టీలతో కలిపి 3వేల 257రకాల చికిత్సలు అందు బాటులో ఉన్నాయి. వీటిని అలాగే కొనసాగిస్తారు. ప్రధానమంత్రి జన ఆరోగ్యయోజన కింద అందే 19వందల49రకాల చికిత్సలూ ఇందులో ఉన్నాయి. బీమా ప్రీమియం కింద ప్రభుత్వం చెల్లించే మొత్తం కంటే తక్కువగా ఖర్చు అయితే అందులో నిర్వహణ వ్యయ మొత్తాన్ని కంపెనీలు మినహాయించుకుని మిగిలిన దానిని వెనక్కి ఇచ్చేయాలి. ఎక్కువైతే మాత్రం బీమా కంపెనీ భరించాలన్న విధంగా ప్రతిపాదనలు సిద్ధమ >>2

# మిర్చిపై కేంద్రంతో చర్చలు

### గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు
### 15శాతం వృద్ధిరేటు లక్ష్యంగా ప్రణాళికలు
### గత పాలకుల నిర్వాకంతో ఆర్థికవ్యవస్థ అస్తవ్యస్తం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు అడుగులు వేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు గాడిన పడుతున్నాయి, వృద్ధి రేటు మొదలైందన్నారు. మిర్చిరైతులకు గిట్టుబాటు ధర కల్పించే దిశలో కేంద్రంతో చర్చలు జరుపుతున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణాలకు కేంద్రం నుంచి నిధులు విడుదల అంశంలో మంచి సహకారం లభిస్తుందన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల24న జరుగుతున్నాయి. ఈ నెల28న అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు. ఈ క్రమంలో బడ్జెట్ అంశాలతో పాటు, వివిధ విషయాలపై సీఎం చంద్రబాబు వర్చువల్‌గాను, మౌఖికంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ప్రజలు నన్ను నమ్మారు. నేను వస్తే అభివృద్ధి జరుగుతుందనే విశ్వాసం వారిదన్నారు. వారికి ఎన్నికల సందర్భంలో ఇచ్చిన సందర్భంగా ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తామన్నారు. బడ్జెట్‌లో ఇందుకు అనుగుణంగా కేటాయింపులు జరగాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసే రీతిలో నిధులు కేటాయింపు ఉంటుం దన్నారు. మంచి అభివృద్ధి కార్యక్రమాలు అమలుతోనే సంపద వస్తుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించి ఆదాయం పెరుగుతుంది. పిల్లల భవిష్యత్ బాగుంటుందని ఓట్లు వేసి గెలిపించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని 15శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. 2047 నాటికి 42 వేల డాలర్ల తలసరి ఆదాయం లక్ష్యంగా నిర్ధేశించుకున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. వ్యవస్థలు భ్రష్టుపట్టాయి. మూడు రాజధానుల పేరుతో అమరావతిని సమాధి చేశారు. ఏపీ జీవనాడి పోలవరాన్ని గోదావరిలో కలిపేశారు. గత పాలనలో ఎవ్వరికీ స్వేచ్ఛ లేదు. ఇక్కడ పుట్టి పెరిగిన వారు కూడా రాష్ట్రానికి రావాలన్నా, పెట్టుబడులు పెట్టాలన్నా భయపడే పరిస్థితి తీసుకొచ్చారు. విపత్కర పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు తీసుకెళ్లే బాధ్యత ప్రజలు మాకు అప్పగించారని ముఖ్యమంత్రి అన్నారు. అభివృద్ధివల్ల సంపద వస్తుంది. సంపద వల్ల ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. ప్రభుత్వ ఆదాయం పెరిగితే దాన్ని సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించి పేదరికం రూపుమాపవచ్చు. ఇది నేను నమ్మిన ఆర్థిక సిద్ధాంతం. 1995లో నేను ఐటీ అంటే అందరూ నవ్వారు. ఐటీ తీసుకొస్తే తిండిపెడుతుందా అని చాలామంది ఎగతాళి చేశారు. నేడు ఐటీ మనిషిని ఎక్కడికో తీసుకెళుతోంది. 1991లో వచ్చిన ఆర్థిక సంస్కరణలు, 1992లో వచ్చిన ఇంటర్నెట్ విప్లవాన్ని నేను మనసావాచా నమ్మి ఆచరణలో పెట్టాను. నేను తెచ్చిన విజన్ 2020తో నేడు దేశంలోనే తలసరి ఆదాయంలో తెలంగాణ ముందుంది. ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారు ఎక్కువ తలసరి ఆదాయం సంపాదిస్తున్నారు. రెండోతరం ఆర్థిక సంస్కరణలకు నేను నాంది పలికాను. విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చి రాష్ట్రానికి వెలుగులు ఇచ్చినేను ఓడిపోయాను. ఆ విషయంలో నేను రాజీపడి ఉంటే ఓడిపోయేవాడిని కాదేమో.

## కెఆర్ఎంబి ప్రత్యేక
# సమావేశం వాయిదా

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణానదీ యాజమాన్య బోర్డు అత్యవసరంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం ఈ నెల 24కు వాయిదా పడింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో మిగిలిన కాలానికి రెండు రాష్ట్రాలకునీటి వాటాలు, ఇతర అంశాలపై చర్చించేందుకు ఇవాళ కేఆర్ఎంబీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ నీటిపారుదల ముఖ్య కార్యదర్శితో కృష్ణాబోర్డు ఛైర్మన్ అతుల్ జైన్ మధ్యాహ్నం సమావేశం కావాల్సి ఉంది. అయితే తనకు ముందు గానే నిర్ణయించిన ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నందువల్ల ఇవాళ్టి సమావేశానికి హాజరు కాలేకపోతున్నానని, సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేయాలని ఏపీ స్పెషల్ సీఎస్ బోర్డుకు విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రత్యేక సమావేశాన్ని కేఆర్ఎంబీ సోమవారానికి వాయిదా వేసింది. సోమవారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు హైదరాబాద్‌లో జలసౌధలో సమావేశం జరగనుంది.



శుక్రవారం విజయవాడలో ఏపీ,తమిళనాడు రాష్ట్రాల చేనేత, జౌళిశాఖల మంత్రులు ఎస్.సవిత, ఆర్.గాంధీ సమక్షంలో ఆప్కో, కో ఆప్టెక్స్ మధ్య చేనేత వస్త్రాల అమ్మకాలపై ఒప్పందం దృశ్యం

# కో ఆప్టెక్స్‌తో ఆప్కో కీలక ఒప్పందం

### తమిళనాడు, ఎపి మంత్రుల సమక్షంలో ఎంఒయు
### రూ.9.20 కోట్ల వస్త్రాల విక్రయాలు లక్ష్యం

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని చేనేత కార్మికులకు 365 రోజులు పని కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం మరో కీలక ముందుకు వేసింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడుకు చెందిన ఆప్కో,కోఆప్టెక్స్ ఏజెన్సీలు తమషోరూమ్‌ల్లో రెండురాష్ట్రాల చేనేత వస్త్రాలు విక్రయించుకునేలా >>2

# తెలంగాణ డిజి అంజనీకుమార్ ఎపికి మార్పు

### 24 గంటల్లోగా రిపోర్ట్ చేయాలని కేంద్రహోంశాఖ ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి21:** తెలంగాణలో ఉన్న ముగ్గురు ఐపిఎస్ అధికారులకు కేంద్రం షాక్ ఇచ్చింది. తెలంగాణలో రోడ్ సేఫ్టీ డీజీగా కొనసాగుతున్న అంజనీకుమార్‌ను వెంటనే రిలీవ్ చేయాలని కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఏపీ కేడర్ ఐపిఎస్ అధికారిగా ఉన్న అంజనీకుమార్‌తో పాటు అభిలాష్ బిస్త్, అభిషేక్ మహంతి సైతం ఏపీకి కేటాయించబడిన అధికారులు. అయితే వారు ఏపికి వెళ్లకుండా తెలంగాణలోనే ఉండిపోయారు. ప్రస్తుతం కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా మహంతి విధులు నిర్వహిస్తున్నారు. తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా బిస్త్ పని చేస్తున్నారు. అయితే ఈ ముగ్గురిని ఏపీ కేడర్‌లో 24గంటల్లోగా రిపోర్ట్ చేయాలని కేంద్ర హోం శాఖ ఆదేశించింది.

# టమాటా కొనుగోళ్లు చేపట్టిన ప్రభుత్వం

### మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** టమాటాకు గిట్టుబాటు ధరను కల్పించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ మార్కెటింగ్ అధికారులతో వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. టమాటా రైతులకు సరైన గిట్టుబాటుధర వచ్చేలా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ పథకం మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం (ఎంఐఎస్)లో ఎన్ఎఫ్ఇడి, ఎన్‌సిసిఎఫ్ ద్వారా రాష్ట్రంలో ఉన్న టమాటాలను అన్ని ఆపరేషన్‌ల ఖర్చులను వారే భరించే విధంగా, టమాటా కొరత ఉన్న ఇతర రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో విక్రయించడానికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. దీంతో కిలో టమాటా ధర సుమారు 10 నుండి 15 రూపాయల వరకు రైతులకు అందుతుందన్నారు. రైతులను ఆదుకొనేందుకుగాను తీసుకునే చర్యలలో భాగంగా, టమాటాధర చాలా తక్కువగా పలుకుతున్న అనంతపురంజిల్లా నుండి ప్రభుత్వమే టమాటాను సుమారు కిలో 8 రూపా యలకు కొనుగోలు చేసి రాష్ట్రంలో ఉన్న అన్ని రైతు బజార్లకు సరఫరా చేస్తున్నారు. ఈరోజు 1000 క్వింటాళ్ల టమాటాను అనంతపురం, కర్నూలు, విజయనగరం, అనకాపల్లిజిల్లాల నుండి సేకరించారు. వీటిలో విజయనగరం, అనకాపల్లిజిల్లాల నుండి సేకరించిన టమాటాలను విశాఖపట్టణం, రాజమండ్రి జిల్లాల్లోని రైత బజార్లలోనూ అనంతపురం, కర్నూలుజిల్లాల్లో సేకరించిన టమాటాలను విజయవాడ, గుంటూరుజిల్లాల రైతుబజార్లలో అమ్మకం చేపట్టినట్లు మంత్రి తెలిపారు.



ఆక్రమిత భూముల్లో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి ఎస్టేట్

# భూమి ఆక్రమించిన ఎమ్మెల్యేకు నోటీసులు

### నేడు జాయింట్ కలెక్టర్ కోర్టులో విచారణ

**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** ఉమ్మడి కడప జిల్లాలో 100 ఎకరాలు ఆక్రమించిన అన్నమయ్య జిల్లా వైసీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డికి జాయింట్ కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. శనివారం జాయింట్ కలెక్టర్ కోర్టులో హాజరు కావాలని తాఖీదులు పంపారు. ఈ వ్యవహారం సంచలనంగా మారింది. ఈ అక్రమ వ్యవహారంలో ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ కూడా చేసినట్లు బయటపడింది. వివరాలలోకి వెళితే రాజంపేట మండలం మందపల్లె, ఆకేపాడు గ్రామ రెవెన్యూ పొలంలో ఈ ఆక్రమణ జరిగినట్లు రాజంపేట టీడీపీ గ్రామీణ అధ్యక్షుడు గన్నే సుబ్బనర్సయ్యనాయుడు జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. మందపల్లె సర్వే నెంబర్ 815/1లో 3.79ఎకరాలు, సర్వే నెంబర్ 814/4లో 4ఎకరాలు, ఆకేపాడు సర్వే నెంబర్ 56/8లో 5.68ఎకరాలు, 56-1లో 5ఎకరాలు, 56-9లో 2.35ఎకరాలు, 56-1లో ఒకటిన్నర ఎకరా, మందపల్లె సర్వే నెంబర్ 816-2లో 4.31ఎకరాలు, 814-3లో 4ఎకరాలు, 815-2లో 5ఎకరాలు, 814-1లో ఎకరా భూమి ఆక్రమించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పైన పేర్కొన్న భూముల విస్తీర్ణం 39.58 ఎకరాలుగా పేర్కొన్నారు. అంతేకాకుండా రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో జిరాయితీ పట్టా, అనువంశికంగా వచ్చినట్లు ఆన్‌లైన్ చేశారు. అంతేకాకుండా తిరుమలతిరుపతి దేవస్థానానికి ఆకేపాడు సర్వేనెంబర్ 56-1లో 1.50ఎకరాలు రిజిష్టర్ కూడ చేసి ఉన్నారు. ఇకపోతే పైన పేర్కొన్న సర్వే నెంబర్‌లలో అమర్‌నాథ్ రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి జ్యోతమ్మ, సోదరుడు అనిల్‌కుమార్ రెడ్డి, ఆయన భార్య సుజన పేర్లతో రాజంపేట సబ్ రిజిస్ట్రార్ 1761-2023, 1768, 1769, 1770, 1771, 1772, 1773, 1774, 1775, 2346 డాక్యుమెంట్లుగా >>2



VIJAYAWADA: MITHRA AUTO AGENCY: 8886063544 | VARUN MOTORS: 9885701729 | ENIKEPADU: VARUN MOTORS: 9885104222 | KANURU: SANTOSH AUTO: 7799787944 | ELURU: NOVELTY REDDY & REDDY MOTORS: 9533290285 | BHIMAVARAM: NOVELTY REDDY & REDDY MOTORS: 9948828555 | GUNTUR: JAYALAKSHMI AUTOMOTIVES: 7396669031 | NELLORE: VISHNU CARS: 7995088876 | BHARGAVI AUTOMOBILES: 9848357778 | ONGOLE: JAYALAKSHMI AUTOMOTIVES: 9949033433 | ANDHRA PRABHA COLONY: MITHRA AUTO AGENCY: 7337540033.



ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలిలో శుక్రవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్‌గాంధీ

# కో ఆప్టెక్స్‌తో ఆప్కో కీలక ఒప్పందం

>> ఒప్పందం కుదిరింది. ఈ ఏడాది రూ.9.20 కోట్ల మేర వస్త్రాలు విక్రయాలు చేయాలని ఆప్కో, కో ఆప్టెక్స్ నిర్ణయించాయి. ఈ మేరకు విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్ లో శుక్రవారం జరిగిన బయ్యర్, సెల్లార్ మీట్ లో రెండు రాష్ట్రాల చేనేత, జౌళి శాఖల మంత్రులు ఎస్.సవిత, ఆర్.గాంధీ సమక్షంలో ఆప్కో, కో ఆప్టెక్స్ మధ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్రంలోని చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధితో పాటు చేనేత ఉత్పత్తులకు విస్తృతమైన మార్కెట్ సదుపాయం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ నగరాల్లో ఆప్కో ఆధ్వర్యంలో చేనేత ఎక్స్ పోలు, ఎగ్జిబిషన్లు నిర్వహిస్తూ వస్తోంది. చేనేత కార్మికులకు నేటి తరం అభిరుచులకు అనుగుణంగా డిజైన్లు, దుస్తుల తయారీపై శిక్షణ ఇస్తూ, తయారైన చేనేత వస్త్రాలకు మరింత మార్కెట్ సదుపాయం కల్పించాలన్న ఆశయంతో ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల చేనేత సంస్థలతో కూడా ఒప్పందాలు కుదుర్చుకోవాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని చేనేత వస్త్రాలకు మార్కెట్ విస్తరణలో భాగంగా తమిళనాడుకు చెందిన కో ఆప్టెక్స్ తో ఆప్కో ఒప్పందం చేసుకుంది. ఏపీ, తమిళనాడుకు చెందిన చేనేత,జౌళిశాఖ మంత్రులు సవిత, గాంధీ సమక్షంలో ఆప్కో ఎండీ పావనమూర్తి, కో ఆప్టెక్స్ ఎండీ దీపక్ జాకబ్ ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఇరు రాష్ట్రాలకు చేనేత సంస్థలు రూ.9.20 కోట్ల మేర ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ ఒప్పందంతో తమిళనాడుకు చెందిన చేనేత వస్త్రాలను ఆప్కో సహా ఇతర వ్యాపార సంస్థల్లో విక్రయిస్తారు. ఏపీకి చెందిన చేనేత వస్త్రాలను కో ఆప్టెక్స్ షోరూమ్ లతో పాటు తమిళనాడు వ్యాప్తంగా ఉన్న పలు వస్త్ర దుకాణాల్లో విక్రయించనున్నారు. కో ఆప్టెక్స్, ఆప్కో మధ్య రూ.20 లక్షలు, ట్రిచీ, మదురై, తిరుచెన్ గోడ్ సర్కిల్, అరబిందో టైక్స్ టైల్స్ మధ్య రూ.1.25కోట్లు, సాలెమ్ సర్కిల్, శ్రీ సుదర్శన్ సిల్క్ మధ్య రూ.కోటి, ఈరోడ్ సర్కిల్, బళభద్ర నర్సింహామూర్తి సంస్థ మధ్య రూ.50 లక్షల మేర ఒప్పందం కుదిరాయి.వాటితో మరిన్ని ఏపీ, తమిళనాడుకు చెందిన సంస్థల మధ్య ఒప్పందాలు కుదిరియి. త్వరలో మిగిలిన రాష్ట్రాలకు చెందిన చేనేత సంస్థలతోనూ ఒప్పందం చేసుకోడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆప్కో, కో ఆప్టెక్స్ ఒప్పందంతో ఏపీకి చెందిన చేనేత కార్మికులకు ఎంతో లబ్ధి కలుగనుంది. నేతన్నల దగ్గర తయారవుతున్న ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం లభిస్తోంది. కో ఆప్టెక్స్ కు చెందిన చేనేత వస్త్రాలు డబుల్ క్లాత్ బెడ్‌షీట్‌లు (కింగ్ సైజు), టర్కీ టవల్స్ (బ్లీచ్డ్ మరియు డైడ్), డోర్‌మ్యాట్‌లు, ఆరని సిల్క్ చీరలు, పళని టై, డై చీరలను ఆప్కో షో రూమ్ ల్లో విక్రయిస్తారు. ఏపీకి చెందిన మంగళగిరి కాటన్, జరీ చీరలు, రాజమండ్రి కాటన్ చీరలు, బందర్ కాటన్ చీరలు,వెంకటగిరి కాటన్ చీరలు, మాధవరం కాటన్ చీరలు, సిల్క్ చీరతో పాటు ఇతర చేనేత వస్త్రాలను కో ఆప్టెక్స్ షోరూమ్ ల్లో విక్రయిస్తారు. ఏపీతో పాటు తమిళనాడు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న కో ఆప్టెక్స్ షో రూమ్ లో రాష్ట్రానికి చేనేత వస్త్రాలను విక్రయించుకునే సౌలభ్యం కలుగుతుంది. దీనివల్ల ఉత్పత్తవుతున్న సరకును ఎప్పటికప్పుడు అమ్మకం కావడం వల్ల నేతన్నలకు ఆర్థికంగా ఎంతో లబ్ధి కలుగుతుంది. చేనేతలకు 365 రోజుల పాటు పని కల్పించాలన్న ఉద్దేశం కూడా నెరవేరబోతోంది.

**తమిళనాడు బయ్యర్‌సెల్లార్ మీట్ ను ప్రారంభించిన ఏపీ మంత్రి సవిత..**


విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్ లో తమిళనాడు ప్రభుత్వం నిర్వహించిన బయ్యర్, సెల్లార్ మీట్ ను మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ లో తమిళనాడు ప్రభుత్వం కో ఆప్టెక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆ రాష్ట్ర మంత్రి ఆర్.గాంధీతో కలిసి పరిశీలించారు. చీరలు, ఇతర చేనేత వస్త్రాలను నాణ్యతను, ధరలను మంత్రి సవిత అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తమిళనాడుకు చెందిన చేనేత, జౌళి శాఖ కార్యదర్శి వి.అమృతవల్లి, డైరెక్టర్ మేఘాశ్వీరి రవికుమార్, ఏపీ చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులు, చేనేత సొసైటీలు, పలు వాణిజ్య సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 25లక్షల ఆరోగ్యబీమా

>> య్యాయి. ప్రతి కుటుంబం తరపున ప్రభుత్వం చెల్లించాల్సిన ప్రీమియం 2,500 వరకు ఉండొచ్చని అంచనా. జాతీయ స్థాయిలో పిలిచే టెండర్ల ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ బీమా కం పెనీలు పోటీపడతాయి. తమిళనాడు, ఝార్ఖండ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వ బీమా సంస్థల ద్వారా అక్కడి వారికి వైద్య సేవలు అందుతున్నాయి. డబ్ల్యూహెచ్‌వో అధ్యయన ఫలితాలు, వివిధ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న ఉత్తమ పద్ధతులను ప్రభుత్వం సమీక్షించింది. రాష్ట్ర ప్రజలందరికీ ఉచిత ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింపచేసేలా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. వీటిపై త్వరలో ఉన్నత స్థాయిలో జరిగే సమీక్ష సమావేశంలో చర్చించి అధికారిక నిర్ణయాన్ని తీసుకోనున్నారుఆరోగ్యబీమాను. షరతులతో నిమిత్తం లేకుండా: దీనికి అనుగుణంగా ఉమ్మడి శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు ఒక యూనిట్, గుంటూరు నుంచి రాయలసీమ జిల్లాల వరకు మరో యూనిట్‌గా గుర్తించి టెండరు పిలువబోతున్నారు. ఎన్టీఆర్ వైద్య సేవట్రస్టు కింద ఏడాదికి 25 లక్షల విలువైన చికిత్సలను ఉచితంగా ప్రస్తుతం అందిస్తున్నారు. కొత్త బీమా విధానంలో వార్షిక పరిమితి, ఇతర షరతులతో నిమిత్తం లేకుండా ప్రజలందరికీ ఉచితంగా బీమా సౌకర్యాన్ని కల్పించేందుకు వీలుగా టెండరు డాక్యుమెంట్ సిద్ధమైంది. ప్రతి కుటుంబానికి ఇప్పుడున్న 25లక్షల వార్షిక పరిమితి వైద్య సేవలు అలాగే కొనసాగుతాయి. అయితే ఏడాదికి రెండున్నర లక్షల రూపాయల వైద్య సేవలు ఉచితంగా అందించేలా టెండరు పిలుస్తారు. ఆపైన చికిత్సకు అయ్యే ఖర్చును ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు భరిస్తుంది. ప్రస్తుతం ఏడాదికి రెండున్నర లక్షల్లోపు వ్యయమయ్యే చికిత్సలు పొందేవారి సంఖ్య రాష్ట్రంలో 97 శాతం ఉంది. సీఎం చంద్రబాబు సమక్షంలో నిర్ణయం జరిగిన అనంతరం ఈ ఏడాది ఏప్రిల్ లేదా మే నుంచి బీమా విధానం అమల్లోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రజలందరికీ ఉచిత ఆరోగ్య బీమా కల్పనపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ప్రధానంగా చర్చ జరగనుంది. ఆ మేరకు ప్రతిపాదనల్లో కొన్ని మార్పులు చేర్పులు చేయనున్నారు. ప్రస్తుతం వార్షిక ఆదాయం 5 లక్షలలోపు ఉన్న వారికి ట్రస్టు ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయి. ఈ పరిధిలో కోటీ 43 లక్షల కుటుంబాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు కలిపి ఎనిమిదిన్నర లక్షల మంది ఉన్నారు. బీమా పథకం కింద ఏడాదికి ఒక్కో ఉద్యోగి, పెన్షనర్ సుమారు 7వేల వరకు చెల్లిస్తున్నారు. జర్నలిస్టులు కూడా ప్రీమియం చెల్లిస్తున్నారు. ప్రీమియం చెల్లించే జాబితాలో ఉన్న వారికి మినహాయించి, మిగిలిన వారందరికీ బీమా విధానాన్ని వర్తింపచేసేందుకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు.నిర్దేశించిన రెండు యూనిట్లకు కలిపి ఒక టెండరు పిలుస్తారు. తక్కువ మొత్తాన్ని కోట్‌చేసి, ఎల్1గా ప్రైవేట్ కంపెనీ వస్తే.. అదే ధరకు సేవలు అందించేందుకు వీలుగా ప్రభుత్వ రంగ సంస్థను ఆహ్వానిస్తారు. దీనికి ప్రభుత్వ రంగ సంస్థ ఆమోదం తెలిపితే మరో యూనిట్ బాధ్యత అప్పగిస్తారు. ఒకవేళ ప్రభుత్వ రంగ సంస్థే ఎల్1గా వస్తే రెండు యూనిట్ల బాధ్యతను అప్పగిస్తారు. ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా సేవలు కొనసాగించేలా చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ప్రస్తుతం ట్రస్టు ద్వారా రోగి చికిత్సకు ముందస్తు అనుమతి లభించేందుకు 24 గంటల వరకు సమయం పడుతోంది. ఆరోగ్య బీమా అమలులోకి వస్తే ఈ పరిస్దితి మారుతుంది.

# భూమి ఆక్రమించిన ఎమ్మెల్యేకు నోటీసులు

>> రిజిస్ట్రేషన్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇవన్నీ ప్రభుత్వ భూములు అని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఎలా రిజిష్టర్ చేశారని ఫిర్యాదులో ప్రస్తావించారు. ఇది కాకుండా ఆకేపాటి ఎస్టేట్‌లో మరో 60ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో మొత్తం డాక్యుమెంట్లను అందజేశారు. అమర్‌నాథ్ రెడ్డి కుటుంబ సభ్యుల భూముల ఆక్రమణపై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు రాజంపేట సబ్‌కలెక్టర్ నైదియా దేవి, రాజంపేట తహసీల్దార్ పీర్ మున్నీ ప్రాథమిక సమాచారాన్ని జిల్లా కలెక్టర్‌కు పంపారు. ఈ ఫిర్యాదుపై అమర్‌నాథ్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులకు, ఫిర్యాదు దారులకు ఇప్పటికే రెండుసార్లు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ నెల 17న అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ జేసీ కోర్టులో హాజరు కావాలని నోటీసులు పంపారు. అంతేకాకుండా నోటీసులో ఆక్రమణలకు సంబంధించి సమగ్ర సమాచారంతో రావాలని రాజంపేట తహసీల్దార్‌ను కూడ ఆదేశించారు. ఆక్రమిత భూములుగా ఫిర్యాదులో పేర్కొన్నందువల్ల అడంగల్, పాత ఫసలి 10(1) ఆర్ఓఆర్-1 రిజిష్టర్ 1బి రిజిష్టర్, ఎఫ్‌ఎంబీలు తీసుకురావాలని ఆదేశించారు. ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డి కుటుంబ సభ్యుల పేర్లతో పరస్పరం ఒకరికి ఒకరు విక్రయం చేసుకున్నట్లు డాక్యుమెంట్లను చూస్తే తెలుస్తోంది. ఈ వ్యవహారం రాజంపేట నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ భూముల్లో ఎస్టేట్ కట్టడం అందులో ప్రభుత్వ నిధులు పెద్దఎత్తున ఖర్చు చేసి రోడ్ల నిర్మాణం చేపట్టడం కూడ వివాదాస్పదంగా మారింది. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ కోర్టులో ఏం జరుగుతుందో వేచి చూడాల్సి ఉంది.



శుక్రవారం రాష్ట్రపతి ముర్మును కలిసిన ఢిల్లీ సిఎం రేఖా గుప్తా

# రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిలను కలిసిన ఢిల్లీ సీఎం


**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** ఢిల్లీనూతన ముఖ్యమంత్రిగాప్రమాణస్వీకారం చేసిన రేఖాగుప్తా శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మునుమర్యాదపూర్వకంగా కలిసారు. అదేవిధంగా ఆమె ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను కూడా కలిసారు. ఇరువురు రాజ్యాంగ నేతలకు ఆమె పుష్పగుచ్చాలిచ్చి తనను తాను పరిచయం చేసుకన్నారు. ముందు రాష్ట్రపతిని కలిసిన రేఖాగుప్తా వైస్‌ప్రెసిడెంట్ ఎన్‌క్లేవ్‌లో ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌ను కలిసారు. ఇద్దరితోను కొద్దిసేపు సీఎం ఇష్టాగోష్టి జరిపారు. ఈ ఫోటోలను రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి కార్యాలయాలు తమతమ సోషల్ మీడియాలో పోస్టు చేసాయి.

# మార్చి 5న గోదావరి బోర్డు సమావేశం

**విజయవాడ,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** గోదావరి నదీ యాజమాన్య బోర్డు 17వ సర్వసభ్య సమావేశం మార్చి 5న నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని జలసౌధలోగోదావరి బోర్డు ఛైర్మన్ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. రెండు రాష్ట్రాలకు చెందిన జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు దీనికి హాజరుకానున్నారు.

# చైనాలో మరో ప్రాణాంతకవైరస్

## హెచ్‌కెయు5-కోవ్-2గా గుర్తింపు



**బీజింగ్, ఫిబ్రవరి 21:** చైనాలో కొవిడ్ తరహాలోనే ఉన్న మరో కొత్తవైరస్‌ను శాస్త్రవేత్తలు గుర్తించారు. జంతువులనుంచి మానవులకు సంక్రమించే ముప్పు ఉందని కూడా హెచ్చరిస్తున్నారు. గబ్బిలాల్లో గుర్తించిన ఈకొత్త వైరస్‌ను హెచ్‌కెయు5-కోవ్-2గా వెల్లడించారు. కొవిడ్19కి కారణమైన సార్స్‌కోవ్-2ను పోలి ఉన్నట్లు తమ పరిశీలనలో గుర్తించామని హాంకాంగ్‌కుచెందిన సౌత్‌చైనా మార్నింగ్‌పోస్టు తన కథనంలో ప్రస్తావించింది. గబ్బిలాల్లో కరోనా వైరస్‌లపై విస్తృతస్థాయిలో పరిశోధనలు చేసి బ్యాట్ ఉమన్‌గా పేరొందిన ప్రఖ్యాత వైరాలజిస్టు ఝుంగ్‌లీ ఈ పరిశోదన బృందానికి సారథ్యం వహించారు. ఇందులో గ్యాంగ్‌ఝౌ ప్రయోగశాల, గ్యాంగ్‌ఝౌ అకాడమీ ఆఫ్ సైన్సెస్,వుహాన్ యూనివర్సిటీతోపాటు వుహాన్ వైరాలజీ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు భాగస్వాములుగా ఉన్నారు. ఈ పరిశోధనకు సంబంధించిన పరిశోధనా పత్రి సెల్‌జర్నల్‌లోసమీక్షకు పోస్టుచేసారు. ఈ వైరస్ మెర్బెకోవైరస్‌తోపాటు ప్రాణాంతక మెర్స్‌కోవ్(మిడిల్ ఈస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్) ఉపరకానికి చెందినదని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇది హెచ్‌కెయు5 కరోనా వైరస్‌సంతతికి చెందినదేనని, ఈవైరస్ తొఉలత హాంకాంగ్‌లోనిజపనీస్ పిపస్ట్రెల రకం గబ్బిలాల్లో గుర్తించినట్లు చైనా పరిశోధకులు వెల్ల డించారు. ఇపుడు చేస్తున్న అధ్యయనాల ప్రకారం హెచ్‌కెయు5-కోవ్-2 నేరుగా లేదా మాధ్యమ జీవుల సాయంతోమనుషులకు వ్యాపించే అవకాశం ఎక్కువని అన్నారు. అయితే కొవిడ్‌తోపోలిస్తే ఈవైరస్ సామర్థ్యం తక్కువేనని చెప్పారు.

# పవార్‌కు గ్లాసులో నీళ్లుపోసి అందించిన ప్రధానిమోడీ!





**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** దేశరాజధాని ఢిల్లీలో జరుగుతున్న 98వ అఖిలభారత మరాఠి సాహిత్య సమ్మేళనంలో ఆసక్తికర సంఘటనలు జరిగాయి. విజ్ఞాన్‌భవన్ వేదికగా జరుగుతున్న సభలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ఎన్సీపీ ఎస్పీ అధినేత శరద్ పవార్‌నడుమ ఆసక్తికర సన్నివేశాలు జరిగాయి. పవార్‌కుర్చీలో కూర్చోడానికి మోడీసాయం చేయడంతోపాటు తన చేతితో స్వయంగా గ్లాసులో నీళ్లనింపి పవార్‌కు అందించారు. దీనితో అక్కడున్నవారంతా చప్పట్లతో హర్షం వ్యక్తంచేసారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌కూడా ఈకార్యక్రమంలోపాల్గొన్నారు. మరాఠి భాషకు కొన్నినెలలక్రితం కేంద్రం శాస్త్రీయభాషా హోదా కల్పించింది. ఈ క్రమంలోసుమారు 71 ఏళ్లతర్వాతఢిల్లీ వేదికగా రెండోసారి ఈ సదస్సు నిర్వహించారు. తొలిసారి జవహర్‌లాల్ నెహ్రూ ఢిల్లీలో మరాఠా సదస్సును నిర్వ హించారు. పవార్ ఈ సందర్భంగా మోడీని ప్రశం సించారు. కార్యక్రమానికి ఆహ్వానిస్తే కాదనకుండా అంగీకరించారన్నారు.మరాఠికి ఉన్నతభాష హోదా ఇవ్వడంతో ప్రధానిమోడీ పాత్ర కీలకం అన్నారు. తనప్రసంగంముగించి వచ్చి కుర్చీలో కూర్చునే క్రమంలో ఈ అరుదైన సందర్భాలు కనిపించాయి.

## వారం - వర్జ్యం

తేది : 22-02-2025, శనివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
నవమి మ.1.20
జ్యేష్ఠ సా.5.39
వర్జ్యం : రా.2.00-3.40
దు.ఉ.6.39 - 8.14
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. వస్తులాభం.

**వృషభం:** భాగస్వామ్య వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఇతరుల విషయాలలో జోక్యం వద్దు.

**మిథునం:** పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఖర్చులు అధికమవుతాయి.

**కర్కాటకం:** సన్నిహితుల ద్వారా విలువైన సమాచారం అందుకొంటారు. గృహం కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి.

**సింహం:** వృత్తి, వ్యాపారాలలో పురోగతి సాధిస్తారు. అనుకోని విధంగా ధన, వస్తు లాభాలు పొందుతారు.

**కన్య :** కొత్త వస్తువులు, ఆభరణాలు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. ఔషధ సేవనం. ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు చాలా అవసరం.

**తుల :** శ్రమాధికం. బంధువులతో ఏర్పడిన తగాదాలు పరిష్కరించుకొంటారు. దూర ప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకొంటారు.

**వృశ్చికం:** సోదరుల నుండి కొన్ని విషయాలు తెలుసుకుంటారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**ధనుస్సు:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కొంటారు. అనుకోని విధంగా ఖర్చులు ఎదురవుతాయి.

**మకరం:** ఉద్యోగాలలో ఆకస్మిక బదలీలు ఆశ్చర్యపరుస్తాయి. సేవకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**కుంభం:** ఋణబాధలు తీరి ఊరట చెందుతారు. మిత్రులను కలిసి కష్ట సుఖాలను పంచుకొంటారు.

**మీనం :** దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆనందం కలుగుతుంది. వాహనాలు కొనుగోలు చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రభుత్వాన్నే కూల్చేసినోణ్ణి... నన్ను తేలిగ్గా తీసుకోవద్దు: షిండే హెచ్చరికలు

**ముంబయి, ఫిబ్రవరి 21:** మహారాష్ట్రలోని అధికార మహాయుతికూటమిలో విభేదాలు తీవ్రం అయ్యాయని ఊహాగానాలు వినిపిస్తున్న వేళ డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్‌షిండే కీలక వ్యాఖ్యలు మరోసారి దుమారంరేపాయి. తనను తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు. సీఎం దేవేంద్రఫడ్నవిస్ సమావేశాలకు ఇటీవల దూరంగా ఉంటున్న షిండే 2022లో ప్రభుత్వాన్ని పడగొట్టిన విషయాన్ని తాజాగా ప్రస్తావించారు. షిండే హయాంలో ఆమోదించిన ఒకప్రాజెక్టునుప్రభుత్వం నిలిపివేసిన నేపథ్యంలో సేవసేన నేత పైవ్యాఖ్యలుచేసారు. నేను ఒక సాధారణ పార్టీ కార్యకర్తను. అంతేకాదు బాబాసాహెబ్ అడుగుజాడల్లో నడిచిన వ్యక్తిని. ప్రతిఒక్కరూ అర్థంచేసుకోవాలి.

2022లో అందరూ నన్ను తేలిగ్గా తీసుకున్నపుడు నాడు అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని పడగొట్టా అని మీడియాతోనే ఏక్‌నాథ్‌షిండేఅన్నారు. తర్వాత విధానసభలోచేసిన మొదటిప్రసంగంలో ఫడ్నవిస్‌కు 200 కంటే ఎక్కువసీట్లు వస్తాయని చెప్పానని 232 సీట్లువచ్చాయన్నారు. అందుకే తనను తేలిగ్గా తీసుకోవద్దని ఇది ఎవరిని ఉద్దేశించి చెపుతున్నాననో వారు అర్థంచేసుకుంటారని భావిస్తున్నట్లు షిండే అన్నారు. సీఎం ఫడ్నవిస్ సమావేశాలకు షిండే హాజరుకాకపోవడం, షిండేవర్గం ఎమ్మెల్యేలకు భద్రతను తొలగించడం, సచివాలయంలో వైద్యసహాయ కేంద్రాలు ఇద్దరు వేరువేరుగా ఏర్పాటుచేసుకోవడం వంటి సంఘటనలు వీరిమధ్య దూరాన్ని పెంచాయని తెలుస్తోంది. అభివృద్ధిని అడ్డుకునేవారితో నాపోరాటం నిరంతరం కొనసాగుతుందన్నారు.

# మిర్చి రైతులను ఆదుకోవాలని కోరాం

## కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**మిర్చికి రూ.11,600కు పైగా ధర ఇవ్వాలి, మిర్చి ఎగుమతులపైనా చర్చ**

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలోని మిర్చి రైతులను ఆదుకోవాలని కోరినట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజ్ఞప్తితో ఏపీ మిర్చి రైతుల సమస్యలపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి చర్యలు చేపట్టినట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతెలిపారు. శుక్రవారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం రామ్మోహన్ నాయుడు కీలక ప్రకటన చేశారు. మిర్చి రైతుల సమస్యలను సీఎం చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారని, మిర్చి ఎగుమతులు పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. మిర్చి రైతుల సమస్యలపై శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సుదీర్ఘ సమావేశం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు సమావేశంలో పాల్గొన్నారని తెలిపారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ద్వారా రైతులను ఆదుకునే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశానికి



కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

హాజరైన రామ్మోహన్ నాయుడు అనంతరం మీడియాతో మాట్లాడుతూ మిర్చికి రూ.11,600 కు పైగా ధర ఇవ్వాలని కోరామన్నారు. మిర్చి ఎగుమతులపైనా చర్చిం చామన్నారు. ఎగుమతి దారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారని వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధర కల్పించి ద్వారా మిర్చి రైతులను ఆదుకోవాలని కోరగా, సమస్య చెప్పిన వెంటనే శివరాజ్‌సింగ్ స్పందించారని తెలిపారు. మార్కెట్ ధర, ఉత్పత్తి ఖర్చుల మధ్య వ్యత్యాసం ఇస్తామని చెప్పారన్నారు. మిర్చి రైతులు కష్టాల్లో ఉన్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు.మిర్చి ఉత్పత్తి వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం లెక్కిస్తే రూ. 11,600 వచ్చిందని.. అంతకంటే ఎక్కువ మొత్తంలో రైతులకు అందేలా చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. గతంలో మాదిరిగా ఇప్పుడు మిర్చి ఎగుమతులు జరగడం లేదన్నారు. మిర్చి ఎగుమతులు పెంచడం గురించి కూడా ఇవాళ్టి సమావేశంలో చర్చించామన్నారు. రాష్ట్రంలో మిర్చి రైతులు, ఎగుమతిదారులతో సదస్సు పెట్టాలని నిర్ణయించామని తెలిపారు. సదస్సు ద్వారా వచ్చిన సలహాలు, సూచనల ఆధారంగా మిర్చి ఎగుమతులు పెంచడంపై దృష్టి పెడతామన్నారు. మిర్చి రైతుల ఆదాయం ఎలా పెంచాలన్నదే అందరం ఆలోచిస్తున్నామని చెప్పారు. చంద్రబాబు నాయుడు నేరుగా ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తెచ్చారన్నారు. రైతుల కష్టం తెలిసిన వ్యక్తి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అని నిన్న ఢిల్లీలో లేనప్పటికీ మధ్యప్రదేశ్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏపీ సీఎంతో మాట్లాడారని తెలిపారు. ఈరోజు ఢిల్లీ వచ్చిన వెంటనే అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించారన్నారు. మార్కెట్ రేటుకు, రైతుల పెట్టుబడి వ్యయానికి మధ్య ఉన్న గ్యాప్‌ను కేంద్రం నుంచి నిధులు తెచ్చి ఆదుకోవాలని చూస్తున్నామన్నారు. ఉత్పత్తి వ్యయాన్ని రూ. 11,600 కంటే ఎక్కువగా నిర్ణయించాలని ఐసీఏఆర్‌ను కోరినట్లు చెప్పారు. మిర్చి ఎక్స్‌పోర్ట్స్ గతంలో జరిగినట్లు ఇప్పుడు జరగడం లేదని అన్నారు. మిర్చి పంట సేకరణను అత్యవసరంగా చేయిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. మార్కెట్ ఇంటర్వెన్షన్స్ స్కీం కింద 75 వరకు పొడిగిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారన్నారు. ఏపీలో మిర్చికి మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద క్వింటాల్‌కు రూ.11600 లేదా ఉత్పత్తి వ్యయం జోడించి రూ.12,000 పైచిలుకు ధరను అందించాలని అడిగామన్నారు. ధర విషయంలో ఐసీఏఆర్ అధికారులకు కేంద్రమంత్రి ఆదేశాలిచ్చారని.. ఎగుమతులను స్థిరీకరించే అంశంపైన సమావేశంలో చర్చకు వచ్చిందన్నారు. ఎగుమతుల సమస్యను పరిష్కరించడానికి ఎగుమతి దారులతో సమావేశం కావాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. మిర్చి రైతుల విషయంలో వీలైనంత త్వరగా కేంద్రం నిర్ణయం తీసుకోవాలని కోరామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# భారతీయ భాషలమధ్య శతృత్వం లేనేలేదు: మరాఠీ సాహిత్యసమ్మేళన్‌లో ప్రధానిమోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** జాతీయ విద్యావిధానం కింద హిందీని బలవంతంగారుద్దేప్రయత్నం జరుగుతున్నదంటూ తమిళనాడు, కేంద్ర ప్రభుత్వాల మధ్య మాటలయుద్ధంజరుగుతున్న క్రమంలోప్రధానమంత్రి నరేంద్రమోడీ కీలక వ్యాఖ్యలు చేసారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం జరిగిన 98వ అఖిల భారతీయ మరాఠి సాహిత్య సమ్మేళన్‌లోప్రధాని మాట్లాడుతూ భారత భాషలమధ్య ఎప్పుడూ శతృత్వంలేదని స్పష్టంచేసారు. భారతీయ భాషలన్నీ ఒకదానికకటి సుసంపన్నం చేసుకున్నాయి. భాషాప్రతిపదికగా విభజనలు తెచ్చేప్రయత్నాలు జరిగినా భారత దేశ ఉమ్మడిభాషా వారసత్వం తగిన సమాధానం ఇచ్చింది. ఇలాంటి అపోహలకు దూరంగా ఉంటూ అన్నిభాషల సమున్నతికి పాటుపడటం ఒక సామాజిక బాధ్యతగా మనం గుర్తించాలని ఆదిశగానే ఈరోజు మరాఠి భాషతోసహా దేశంలోని అన్నిప్రధానభాషల్లోను మనం విద్యను ప్రమోట్‌చేస్తున్నట్లు ప్రధాని చెప్పారు. మహారాష్ట్ర యువత మరాఠీలోనే ఉన్నతవిద్య, ఇంజనీరింగ్, వైద్య విద్యలు చదువుతున్నారరన్నారు లిటరేచర్ అనేది సమాజానికి అద్దంలాంటిదని సమాజానికి ఒక నిర్దేశకత్వంచూపుతుందని వివరించారు. లిటరరీ సదస్సులు సంస్థలు ఈదిశగా కీలకపాత్ర పోషిస్తున్నాయని ప్రశంసించారు. భారతదేశంప్రపంచంలోని అతిపెద్ద భాషా వైవిధ్యం కలిగి ఉందని భాషా వైవిధ్యం మన ఐక్యతకు ప్రాథమిక ఆధారమని మోడీ అన్నారు. జాతీయ విద్యావిధానంతో త్రిభాషా సూత్రాన్ని విధించేప్రయత్నంలో తమపై హిందీని రుదే ప్రయత్నం చేస్తున్నారంటూ తమిళనాడు సీఎం ఎంకె స్టాలిన్, డిప్యూటి సిఎం ఉదయనిధి విమర్శ లుచేస్తున్న క్రమంలో ప్రధాని వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

# పూర్తిస్థాయిలో ఖర్చుకాని ఎస్ఎస్ఎ నిధులు

**గత ఏడాది రూ. 1913 కోట్లకి పీఏబీ ఆమోదం**

**ఈ ఏడాది రూ. 1600 కోట్లకే ప్రతిపాదనలు పంపాలని సూచన**

**తెలంగాణలో పూర్తిస్థాయిలో ఖర్చు చేయక పోవడంతోనే ప్రతిపాదనల తగ్గింపు?**

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** పాఠశాల విద్య శాఖలో అమలవుతున్న సమగ్ర శిక్ష పథకం కింద కేంద్రం ఇస్తున్న నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు పెట్టకపోవడంతో.. ఈ ఏడాది కేటాయించాల్సిన నిధుల్లో కోత పెట్టినట్టు తెలుస్తోంది. గత ఏడాది 2024-25 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్ఏ కింద రాష్ట్రానికి రూ.2347.50 కోట్లు కావాలని పాఠశాల విద్య కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. ప్రతిపాదనలను పరిశీలించిన అందులో రూ. 1913 కోట్లకు ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు(పీఏబీ)లో కేంద్రం ఆమోదం తెలిపింది. అందులో రూ. 1148.34 కోట్లు కేంద్రం వాటా కాగా.. రాష్ట్ర వాటా రూ. 765.56 కోట్లుగా పేర్కొంది. అయితే పీఏబీలో కేంద్రం ఆమోదం తెలిపిన మొత్తాన్ని కూడా రాష్ట్రంలో ఖర్చు చేయకపోవడంతో.. ఈ ఏడాది రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులకి సంబంధించి రూ. 1600 కోట్ల వరకే ప్రతిపాదనలను సమర్పించాలని కేంద్రం సూచించినట్టు తెలుస్తోంది. అందుకే గతేడాది పీఏబీ ఆమోదించిన బడ్జెట్ కంటే ఈ ఏడాది ప్రతిపాదనల్లోనే కోత పెట్టినట్టు తెలుస్తోంది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఎస్ఎస్ఏ పథకాన్ని నిర్వహిస్తున్నారు. నాలుగు ఇన్‌స్టాల్‌మెంట్లలో పథకానికి సంబంధించిన నిధులను కేంద్రం మంజూరు చేస్తూ ఉంటుంది. ఈ పథకంలో కేంద్రం 60 వాటా శాతం కాగా.. రాష్ట్ర ప్రభుత్వం వాటా 40 శాతం ఉంటుంది. ఈ పథకంలో భాగంగా ప్రధానంగా పాఠశాల విద్యలో మౌలికవసతుల కల్పన, నాణ్యమైన బోధనకు వీలు కల్పించేందుకు ఈ పథకం ద్వారా నిధులను ఖర్చు చేస్తారు. కేజీబీవీలు, టీచర్ల ట్రైనింగ్స్, యూనిఫారాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు సహా మౌలిక వసతుల కోసం ఈ పథకం ద్వారా నిధులను ఖర్చుచేస్తారు. 2024-25 విద్యాసంవత్సరానికి రాష్ట్రానికి పీఏబీ రూ. 1,913కోట్లకు ఆమోదం లభించింది. అందులో కేంద్రం వాటా రూ. 1,148.34 కోట్లు కాగా.. రాష్ట్రవాటా రూ. 765.56కోట్లు. కేంద్రం ఇవ్వాల్సిన నిధులను నాలుగు ఇన్‌స్టాల్‌మెంట్లల్లో విడుదల చేస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం సైతం నాలుగు ఇన్‌స్టాల్‌మెంట్లల్లో నిధులను కలిపి విడుదల చేస్తుంది. 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు కేంద్రం మూడు ఇన్‌స్టాల్‌మెంట్ల నిధులను విడుదల చేసింది. వాటిలో రెండు ఇన్‌స్టాల్‌మెంట్ నిధులను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేసింది. మూడో ఇన్‌స్టాల్‌మెంట్ కింద కేంద్రం రూ. 242 కోట్లను విడుదల చేయగా.. రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 161 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా ఇప్పటికీ విడుదల చేయనట్టు తెలిసింది. మూడో ఇన్‌స్టాల్‌మెంట్ నిధులు ఖర్చు కాకపోవడంతో నాలుగో ఇన్‌స్టాల్‌మెంట్ నిధులు రావడం ప్రశ్నార్థకంగా మారాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్చి నెల మాత్రమే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో నాలుగో ఇన్‌స్టాల్‌మెంట్‌తోపాటు నాన్ రికరింగ్ నిధుల విడుదలపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికే ఇచ్చిన నిధులు ఖర్చుచేయకపోవడంతో నాలుగో ఇన్‌స్టాల్‌మెంట్ నిధుల విడుదలపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో 2025-26 విద్యాసంవత్సరంలో పీఏబీలో రూ. 300కోట్లకు కోతపడే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. పీఏబీ సమావేశాలు ప్రస్తుతం కొనసాగుతున్నాయి.

# పిఎంజెవికె కింద రాష్ట్రానికి రూ.600 కోట్లు కేటాయించండి

## కేంద్రానికి రాష్ట్ర మైనార్టీసంక్షేమశాఖ మంత్రి ఫరూక్ లేఖ

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** మైనారిటీల సామాజిక ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడానికి ఉద్దేశించిన ప్రధానమంత్రి జన్‌వికాస్ కార్యక్రమ్ కు కేంద్రం వాటాగా ఆంధ్రప్రదేశ్‌కు రూ.600 కోట్లు కేటాయించాలని మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కోరారు. ఈ మేరకు ఆయన కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు గురువారం లేఖ రాశారు. 2025-26 లో ఈ పథకం కింద రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.1000 కోట్లతో ప్రతిపాదనలు నివేదించాం. ఈ పథకం కింద రాష్ట్రవాటా రూ.400 కోట్లు విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్దంగా ఉంది. కేంద్రం వాటాగా రూ.600 కోట్లు కేటాయించాలి అని లేఖలో పేర్కొన్నారు . అన్యాక్రాంతమైన వక్ఫ్‌భూముల స్వాధీనానికి ప్రణాళికాబద్దంగా ముందుకు వెళుతున్నట్లు ఫరూక్ వెల్లడించారు. ఇక మైనారిటీ మంత్రిత్వ శాఖ పేషీ లో మంత్రి ఫరూక్ ను వక్ఫ్ బోర్డు సభ్యులు డాక్టర్ ఆఫీయా, షేక్ ఖాజా తో పాటు పలువురు ముస్లిం మైనారిటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వక్ఫ్ బోర్డు కు సంబంధించిన పలు అంశాలు, వక్ఫ్ బోర్డు ద్వారా చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక అమలుకు సంబంధించి బోర్డు సభ్యులతో మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ మరియు పరిరక్షణ, మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకోవడం, ఉన్న భూములను పరిరక్షించుకోవడం పై ఒక ప్రణాళికబద్ధమైన కార్యాచరణ సిద్ధం చేసి మైనారిటీ మంత్రిత్వ శాఖ నేతృత్వంలో చర్యలు చేపట్టడం జరుగుతున్నదని మంత్రి అన్నారు. అధికారంలోకి వచ్చిన 8 నెలల కాలంలో మైనార్టీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో భాగంగా ప్రభుత్వం బడ్జెట్లో మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధుల కేటాయింపు చేయడం జరిగిందన్నారు. 20252026 ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో కూడా మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం నిధుల కేటాయింపులో అధిక ప్రాధాన్యత ఇవ్వబోతున్నదని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. రంజాన్ మాసం లో ప్రత్యేక వసతులు కల్పించాలనికోరిన ఎంహెచ్ పిఎస్‌రంజాన్ మాసంలో మసీదులు, ఈద్గాలు, దర్గాల వద్ద ప్రత్యేక వసతులు కల్పించాలని రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను ఎంహెచ్ పిఎస్ నాయకులు కోరారు మంత్రి పేషీ లో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షుబ్లీ తదితరులు మంత్రిని కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చెయ్యాలని, టిడిపి ప్రభుత్వ హయాంలో అన్ని మసీదులకు మరమ్మత్తుల కొరకు ప్రతి ఏటా ఇచ్చే రూ.25వేలు మంజూరు చెయ్యాలని, శిక్ష అనుభవిస్తున్న ముస్లిం ఖైదీలకు సహారీ, ఇఫ్తార్ ఏర్పాటు కొరకు జైళ్ల శాఖకు ఆదేశించాలని, ప్రభుత్వం తరపున రంజాన్ ఉత్సవాలు (జష్నే రంజాన్) నిర్వహించాలని కోరారు. వచ్చే బడ్జెట్ లో మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేకంగా రూ.3296 కోట్లు మంజూరు చెయ్యాలని మంత్రిని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ పిఎస్ ఉలేమా వింగ్ అధ్యక్షులు మోలానా అబ్దుల్ రషీద్, నాయకులు సగీర్, ఖాజా, అర్షద్, భాష తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సవిత సమక్షంలోఎస్పీఏవీతో ఏపీహెచ్డీసీ ఒప్పందం

# సాంస్కృతిక వారసత్వాలకు చిహ్నంగా లేపాక్షి : మంత్రి సవిత

**సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్మాణాలు**

**రాష్ట్ర వ్యాప్తంగా అన్ని షోరూమ్‌ల్లోనూ మరమ్మతులు**

**ఎస్పీఎవితో ఏపి హెచ్‌డిసి ఒప్పందం, మంత్రి సమక్షంలో ఎంవోయూపై సంతకాలు**

**విజయవాడ.ఫిబ్రవరి21,ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగుదనం, సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపట్టేలా లేపాక్షి నిర్మాణాలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా విజయవాడకు చెందిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(ఎస్పీఏవీ)తో ఏపీ హ్యాండీ క్రాఫ్ట్స్ డవలప్ మెంట్ కార్పొరేషన్(ఏపీహెచ్డీసీ) ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత సమక్షంలో ఏపీ హ్యాండీక్రాఫ్ట్స్ ఎండీ విశ్వ, ఎస్పీఏవీ డైరెక్టర్ ఎస్.రమేష్ శుక్రవారం ఎంవోయూపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న లేపాక్షి షో రూమ్ లను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాల సంస్కృతీ సంప్రదాయాలను ఉట్టిపట్టేలా ఆకర్షణీయంగా నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న లేపాక్షి షోరూమ్‌లకు మరమ్మతులు చేపట్టి, ఆకర్షణీయమైన ఆకృతుల్లో నిర్మాణాలు చేపట్టనున్నారు. షో రూమ్ ల బయట, లోపల కూడా మరమ్మతులు చేపట్టనున్నారు. వినియోగదారులను ఆకట్టుకునేలా షోరూమ్ లను రూపొందించడం వల్ల వివిధ కళా రూపాల అమ్మకాలు పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. అదే సమయంలో ఏపీలోని పలు ప్రాంతాల సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించే వీలు కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో భాగంగా స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(ఎస్పీఏవీ)తో ఏపీ హ్యాండీక్రాఫ్ట్స్ డవలప్ మెంట్ కార్పొరేషన్ (ఏపీహెచ్డీసీ) ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి సవిత సమక్షంలో ఎంవో యూపై ఏపీ హ్యాండీ క్రాఫ్ట్స్ ఎండీ విశ్వ, ఎస్పీఏవీ డైరెక్టర్ ఎస్.రమేష్ ఎంవో యూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం మూడేళ్లు అమలులో ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఏపీహెచ్డీసీ, ఎస్పీఏవీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాజ్‌భవన్‌లో అరుణాచల్‌ప్రదేశ్, మిజోరాం ఆవిర్భావ వేడుకలు



అరుణాచల్‌ప్రదేశ్ మిజోరాం ఆవిర్భావ వేడుకల సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలను వీక్షిస్తున్న రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నశీర్

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రాంతాలు వారిగా అభిరుచులు, సాధారణ జీవన విధానంలో భిన్నంగా ఉన్నట్లు కన్పించిన భారతీయ సాంస్కృతిక వికాసం ఏకత్వాన్ని ప్రబోదిస్తుందని ఏపీ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నశీర్ వ్యాఖ్యానించారు. కళలు, వివిధ సాంస్కృతిక జీవన ప్రక్రియలు పురాతన నాగరీక జీవన విధానాన్ని తెలియ జేస్తాయన్నారు. అరుణాచల్‌ప్రదేశ్ మిజోరాం ఆవిర్భావ వేడుకలను విజయవాడలోని రాజ్‌భవన్‌లో నిర్వహించారు. ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ పాల్గొని ప్రసంగించారు. అరుణాచల్‌ప్రదేశ్ సూర్యుడు ఉదయించు భూమిగా పర్వతాలు సరస్సులు సంస్కృతికి ప్రసిద్ధి. బహుభాషా గిరిజన ప్రాంతాల్లో ఒకటిగా నిలిచింది. 1987 లో రాష్ట్ర హోదా పొందిన మిజోరాంలో ప్రజలు తమ సంస్కృతి, విలువలను కాపాడుకునేందుకు అత్యంత ప్రాధాన్యమిస్తారు అని గవర్నర్ పేర్కొన్నారు. ఇవి మన భారతీయ సాంస్కృతిక, సహజీవన విధానాలకు నిర్వచనాలుగా నిలిచే ప్రదేశాలన్నారు. విజయవాడలో చదువు కుంటున్న ఆ రాష్ట్రాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు.

# మెరుగైన ప్రభుత్వ వైద్యసేవలు, పటిష్టమైన పాలనకు 30సూత్రాల అజెండా

**- సిఎం ఆలోచనల మేరకు రూపొందించిన మంత్రి సత్యకుమార్ యాదవ్**



**సచివాలయం,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త :** ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్యసేవలు, వైద్య, ఆరోగ్య శాఖ పర్యవేక్షణ, పరిపాలనను పటిష్టం చేసే లక్ష్యంతో మంత్రి సత్యకుమార్ యాదవ్ 30అంశాలతో కూడిన ఏజెండాను రూపొందించారు. ఆయా అంశాలపై నిర్ధిష్ట కాలపరిమితుల మేరకు నిరంతరం ప్రయాస, పనితీరు, ఫలితాల సమీక్షలుజరపాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబును మంత్రి ఆదేశించారు. గత ఏడాది జూన్‌లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఆరోగ్యశాఖకు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్వహించిన వివిధ సమీక్షా సమావేశాల్లో ఇచ్చిన ఆదేశాలు, ఆలోచనలు, వైద్యసేవలు, మంత్రిత్వ శాఖ పనితీరుపై మంత్రి సత్యకుమార్ యాదవ్‌చేసిన సమీక్షల్లో వెల్లడైన అంశాల ఆధారంగా మంత్రి ఈ ఎజెండాను రూపొందించారు. ఆరోగ్యరంగానికి సంబంధించి స్వర్ణాంధ్రప్రదేశ్-2047 విజన్ పత్రంలోని లక్ష్యాల్ని, మార్గాల్ని ప్రజలకు తెలిపి లక్ష్య సాధన ప్రయత్నంలో సంబంధిత అందర్నీ భాగస్వాములను చేయడం. ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు త్వరిత గతిన నిర్ణయాల్ని తీసుకునేందుకు అవసరమైన వికేంద్రీకరణ వైద్యసేవల్లో కృత్రియ మేధ పూర్తి వినియోగ అవకాశాల్ని గుర్తించి ఆ మేరకు చర్యల్ని చేపట్టడం డిజిటల వైద్యసేవల్ని విస్తృతం చేయడం. వైద్యులు, ఇతర సిబ్బంది ఖాళీలను భర్తి చేయడానికి చర్యలు. వివిధ పథకాల కింద కేంద్ర ప్రభుత్వ సాయాన్ని రాబట్టడం. వివిధ విభాగాధిపతులు, వైద్యులు, అధికారుల పనితీరును నిష్పక్షపాతంగా ఫలితాల ప్రాతిపదికన మదింపుచేయడం వివిధ స్థాయిల్లో జవాబుదారీతనం కోసం పటిష్టచర్యలు, పర్యవేక్షణ అవినీతిని అరికట్టడానికి పటిష్ట చర్యలు, విభాగాధిపతులు, వివిధ పథకాల నోడల్ అధికారులు పథకాల అమలు, పనితీరుపై నెలవారీ నివేదికల్ని అందించడం వాటిని సమీక్షించడం. ప్రజల్లో సరైన శుభ్రత, ఆరోగ్యపు అలవాట్లను పెంచడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం. రాష్ట్రం, దేశ విదేశాల్లో ఆరోగ్య సేవలు తీరును మదింపు చేసి సేవల నాణ్యత, తీరు పెంచడానికి మంత్రిత్వ శాఖకు సలహాలిచ్చేందుకు వైద్య, ఆరోగ్య రంగ నిష్ణాతులతో సలహా/సంప్రదింపుల కమిటీ ఏర్పాటు. ఆగష్టు నెలలో విడుదల చేసిన 30సూత్రాల ప్రణాళిక మేరకు ప్రభుత్వాసుపత్రుల్లో ప్రగతిని నిరంతరం సమీక్షించడం అన్ని (175) అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్పెషాలిటి ఆస్పత్రుల ఏర్పాటు, హైబ్రిడ్ విధానంలో రూ.25లక్షల బీమాను డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా త్వరలో ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.

# మినుము సాగుపై దృష్టి పెట్టాలి

**వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు**

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో మినుము సాగు, ఉత్పత్తి పెంపుపై ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పనిచేయాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు సూచించారు. ఏడు జిల్లాలకు సంబంధించి గురువారం విజయవాడలో జరిగిన జాతీయ ఆహార పోషక భద్రత మిషన్ సదస్సులో మాట్లాడారు. అధిక దిగుబడినిచ్చే వంగడాల రూపకల్పనకు ప్రాధాన్యమివ్వాలన్నారు.

# యువ శాస్త్రవేత్తల కోసం యువికా 2025కు ఆహ్వానం

**శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 21 ప్రభాతవార్త**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో యువ శాస్త్రవేత్తలను తీర్చిదిద్దేందుకు ఈ ఏడాది కూడా యువికా కార్యక్రమం ప్రారంభిస్తోంది. యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం యువికా 2025 కోసం ఉత్సాహవంతులైన యువతీ యువకులను ఇస్రో దరఖాస్తులు చేసుకోవాలని ఆహ్వానించింది. ఈ నెల 24 నుంచి మార్చి 23 దాకా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఇస్రో ప్రకటించింది. ఈ కార్యక్రమంలో అంతరిక్ష విజ్ఞానంపై యువతీ యువకులకు శిక్షణ ఇస్తారు. రెండురోజులు పాటు రెసిడెన్షియల్ ప్రోగ్రాం కూడా ఉంటుంది. దేశంలోని కొన్ని ఇస్రో ప్రధాన కార్యాలయాల్లో కూడా ఎంపిక చేయబడిన విద్యార్థుల పర్యటన ఉంటుంది. రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన ఆన్‌లైన్ వివరాలు కూడా ఇస్రో పేర్కొంది. గతంలో కూడా యువికా కార్యక్రమం కింద అనేకమంది ప్రతిభావంతులైన విద్యార్థినీ విద్యార్థులు వెలుగులోకి వచ్చారు. ఈసారి ఈ అవకాశాన్ని ముఖ్యంగా స్టుడెంట్లు సద్వినియోగం చేసుకోవాలని ఇస్రో శాస్త్రవేత్తలు పిలుపు నిచ్చారు.

# మాజీ సిఎం వైఎస్ జగన్‌కు కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలి

**- ప్రధానికి వైఎస్సార్సీ లోక్ సభ పక్ష నేత మిథున్ రెడ్డి లేఖ**

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు వైయస్సార్సీపీ లోక్ సభ పక్ష నేత మిథున్ రెడ్డి లేఖ రాసారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలని లేఖల్లో విజ్ఞప్తిచేసారు. రాష్ట్ర ప్రభుత్వం జగన్ పర్యటనలు సందర్భంలో ఎటువంటి భద్రత కల్పించడం లేదన్నారు. జగన్ పర్యటనలో తీవ్రమైన భద్రత వైఫల్యం తలెత్తింది. జెడ్ ప్లస్ సెక్యూరిటీ కేటగిరి లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్కు వెంటనే కేంద్ర బలగాలతో రక్షణ కల్పించండి, ఇటీవల వైఎస్ జగన్ నివాసం వద్ద కొన్ని ఘటనలు జరిగాయి .ఇవి భారీ ఎత్తున పన్నిన కుట్రలో భాగంగా జరుగుతున్న ఘటనలు.

వైఎస్ జగన్ ప్రాణాలకు ముప్పు తెచ్చే విధంగా భద్రత వైఫల్యం కనిపిస్తోంది కూటమి ప్రభుత్వం విధానాల వల్ల మాజీ ముఖ్యమంత్రి ప్రాణాలకు ముప్పు తెస్తున్నారు. ప్రజాస్వామ్య విధానాలకు తూట్లు పొడిచేలా ప్రమాదకర ధోరణికి తెరలేపుతోందన్నారు. ప్రభుత్వం ఉద్దేశం పూర్వకంగా జగన్ విషయంలో సున్నిత పరిస్థితులను సృష్టించడం ద్వారా ఆయనకు ఇబ్బంది కలిగించాలని చూస్తోందని మిధున్‌రెడ్డి తన లేఖలో స్పష్టంచేసారు. జగన్‌కు భద్రతను పెంచాలని కోరారు.

# రైళ్లలో నేరాల నివారణకు సమన్వయంతో పనిచేద్దాం

**- క్రైమ్ సమీక్షా సమావేశంలో రైల్వే ఐజీ మోహన్‌రావు**



సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే ఐజీ మోహన్‌రావు

**గుంతకల్లు రైల్వే.ఫిబ్రవరి 21,ప్రభాతవార** రైళ్లలో ప్రయాణికుల రక్షణ, భద్రత్రాలకై ప్రతిఒక్కరు సమన్వయంతో కలిసి పనిచేయాలని రైల్వే ఐజీ మోహన్‌రావు అన్నారు. రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు దక్షిణ మద్య రైల్వే గుంతకల్లు డివిజనల్ ప్రధాన కేంద్రంలో నిర్వహించిన రైల్వే అంతర్ రాష్ట్ర జీఆర్‌పి అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన రైల్వే ఎస్‌పి రాహుల్ మీనా, డిఎస్ఆర్‌పి హర్షిత, మురళీధర్‌లతో కలిసి డివిజన్ పరిధిలో క్రైం రికార్డ్స్ బ్యూరో నివేదికను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో పెరిగే రైళ్లు, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్‌పిఎఫ్, డివిజన్ పరిధిలోని కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలలోని జీఆర్‌పి పోలీసు అధికారులతో ఆయా రాష్ట్రాలలో జరిగే నేరాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా రాష్ట్రాల జిఆర్‌పి, రైల్వే రక్షక దళంతో కలిసి నేరాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు అజయ్‌కుమార్, రామాంజనేయులు, అశోక్ కుమార్, శ్రీనాథ్ రెడ్డి, మౌలా, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, రైల్వే ఎస్‌పి కార్యాలయ సిబ్బంది అధిక సంఖ్యలో జీఆర్‌పి పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నై మ్యూజియంలోని అమరావతి బౌద్ధ శిల్ప సంపదను ఎపికి బదలీచేయండి

**- అఖిల భారత పంచాయతీ పరిషత్తు జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు**

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** చెన్నై ఎగ్మూర్ మ్యూజియంలోని అమరావతి బౌద్ధ శిల్ప సంపదను రాజధాని అమరావతికి బదిలీ చేయాలంటూ అఖిల భారత పంచాయతీ పరిషత్తు జాతీయ ఉపాధ్యక్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కోరారు. ఈ మేరకు విజ్ఞప్తి లేఖను ఈమెయిల్ ద్వారా తమిళనాడు సీఎంకు పంపారు. 1797లో బ్రిటిషు ప్రభుత్వ పురావస్తుశాఖ గుంటూరు జిల్లాలోని అమరావతి, దాని సమీప ప్రాంతాల నుంచి 400కు పైగా పురాతన చిహ్నాలు, రాజవంశాలకు చెందిన శిల్పాలను వెలికి తీసింది. వాటిని ఎగ్మూర్ మ్యూజియంలో భద్రపరిచింది. ఇప్పుడు అమరావతిలో సాంస్కృతిక వారసత్వాన్ని పునరుద్ధరించడానికి, పురాతన ప్రాంతీయ సంస్కృతిని భావితరాలకు అందించడానికి కృషి జరుగుతోంది. ఆ పురాతన సంపదను అమరావతికి బదిలీ చేయడానికి అనుమతించాలి అని ఆ లేఖలో కోరారు.

# ఎపి విజ్ఞప్తితో కేఆర్ఎంబి ప్రత్యేక సమావేశం వాయిదా

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణానదీ యాజమాన్య బోర్డు అత్యవసరంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం ఈ నెల 24కు వాయిదా పడింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో మిగిలిన కాలానికి రెండు రాష్ట్రాలకునీటి వాటాలు, ఇతర అంశాలపై చర్చించేందుకు ఇవాళ కేఆర్ఎంబీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ నీటిపారుదల ముఖ్య కార్యదర్శితో కృష్ణాబోర్డు ఛైర్మన్ అతుల్ జైన్ మధ్యాహ్నం సమావేశం కావాల్సి ఉంది. అయితే తనకు ముందుగానే నిర్ణయించిన ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నందువల్ల ఇవాళ్టి సమావేశానికి హాజరు కాలేకపోతున్నానని, సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేయాలని ఏపీ స్పెషల్ సీఎస్ బోర్డుకు విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రత్యేక సమావేశాన్ని కేఆర్ఎంబీ సోమవారానికి వాయిదా వేసింది. సోమవారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు హైదరాబాద్‌లో జలసౌధలో సమావేశం జరగనుంది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు కృష్ణా బోర్డు సమాచారం పంపించింది.

# ధ్వజారోహణంతో శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**(శ్రీకాళహస్తి, ప్రభాతవార్త)**



పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగు బంగారంగా వరాలిస్తూ పూజలందుకున్న దివ్య క్షేత్రం శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలు ఆదివారం భక్తుడు కన్నప్ప ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఏర్పాట్లకు సంబంధించి స్థానిక శాసనసభ్యుడు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. గతంలో కన్నా భిన్నంగా భక్తుల మనోభావాలకు అనుగుణంగా విజయవంతంగా నిర్వహించుటకు విధి నిర్వహణకు కొత్త అయినా ఇఓ ఏర్పాట్లు సమీక్షించారు.. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలను బడ్జెట్‌తో ముడిపెట్టక నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఏర్పాట్లును చేపట్టారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా మహాశివరాత్రి రోజు భక్తులకు సుదర్శనంతో సంతృప్తి పరచుటకు చర్యలు తీసుకుంటామని ఇఓ వివరించారు. సాధారణంగా ఏ ఆలయంలో అయినా బ్రహ్మోత్సవాలు అంటే పది రోజుల పాటు నిర్వహించటం జరుగుతోందని అయితే శ్రీకాళహస్తీశ్వరాలయంలో 13రోజుల పాటు నిర్వహించటం సంప్రదాయమని వివరించారు. మొదటి ఉత్సవాన్ని భక్తజన వల్లభుడు భోళాశంకరుడు వాయులింగేశ్వరుడు 'భక్తకన్నప్ప' ధ్వజారోహణానికి ఇవ్వటం గమనించదగ్గ విషయం అన్నారు. స్థానిక నాయకులు, భక్తుల సూచనల మేరకు ఏర్పాట్లు చేసామన్నారు. గత ఏడాది లక్ష మంది భక్తులు వచ్చినట్లు అంచనా కట్టారని ఈ ఏడాది రెండులక్షలు పైగా వస్తారని అంచనా వేసి ఈ మేరకు ఏర్పాట్లు చేసామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు సాదాసీదాగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమయ్యాయి.

ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ ఐదు వేల మంది భక్తులకు అన్నదానంలో అవకాశం కల్పించుటకు చర్యలు తీసుకున్నామని శివరాత్రి జనజాగరణ రోజు పదివేల మందికి అన్నదానం నిర్వహించుటకు ఏర్పాట్లు చేసామన్నారు. వచ్చే యాత్రికులకు బస సదుపాయం కల్పించామన్నారు. వారికి కనీస సదుపాయాలు చేపట్టామన్నారు. తాత్కాలిక స్నానఘట్టాలను సువర్ణముఖి నదిలో ఏర్పాటు చేసామన్నారు. మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ ఏడాది ఉత్సవాల్ని ఎలాంటి వివాదాలు, విమర్శలకు అవకాశం లేకుండా నిర్వహించుటకు అందరు సహకరించాలన్నారు. తిరుపతి జల్లా శ్రీకాళహస్తీశ్వ రాలయంలో ఆదివారం సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పరణ జరిగింది. మొదటి పూజలు భోళాశంకరుడు తన భక్తుడు తిన్నడు అనే భక్తకన్నప్పకు ప్రసాదించారు. ఈ నేపథ్యంలో సాయంత్రం భక్తకన్నప్ప కొండపై శాస్త్రోక్తంగా పూజలుజరిపి ధ్వజారోహణ కార్యక్రమాల్ని జరిపారు. భక్తకన్నప్ప విగ్రహాన్ని కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు ముస్తాబు చేసి కొండపైకి తీసుకెళ్ళారు. అక్కడి ఆలయం వద్ద ప్రతిష్ఠించి ఆలయప్రధానార్చకులు డాక్టర్ ఎస్ఎంకె స్వామినాధన్ గురుకుల్ కలశస్థాపన చేయగా వేదపండితులు వేదమంత్రాల్ని పఠిస్తుండగా శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అనంతరం ధ్వజస్థంభంపై వస్త్రాన్ని అధిరోహించారు. ఈ కార్యక్రమాల్లో హర హర మహాదేవ శంభోశంకరా అంటూ నినాదాలు చేస్తూ ధ్వజారోహణ జరిపారు. ఈ పూజలతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. అనంతరం భక్తకన్నప్పను పట్టణంలో ఊరేగింపు జరిపారు. ఈ కార్యక్రమాల్లో శాసనసభ్యుని మాతృమూర్తి బొజ్జలబృందమ్మ, మాజీ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కోలా.ఆనంద్, మాజీ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మిన్నల్‌రవి, మల్లీశ్వరమ్మ, సుమతి, ఆలయ ఇఓ బాపిరెడ్డి, డెప్యూటీ ఈఓ ఎన్ఆర్.కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శనం, ఉత్సవాల ఇన్‌చార్జి లోకేష్, ప్రోటోకాల్ ఇన్‌చార్జి నాగభూషణం, ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్‌గురుకుల్, అభిషేక గురుకుల్ వరదగురుకుల్, పౌరోహితులు అర్ధగిరిలు పర్యవేక్షించారు. తదితరులు హాజరయ్యారు. సోమవారం ఉదయం ఆలయంలో శ్రీకాళహస్తీశ్వరుని ధ్వజారోహణ జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

# జోన్ల వారీగా మధ్యాహ్న భోజనం కొత్త మెనూ అమలు

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం కొత్త మెనూను ప్రయోగాత్మకంగా అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే పథకం అమలు కోసంనాలుగు జోన్ల వారీగా దీన్ని రూపొందించారు. ఆయా ప్రాంతాల్లోని స్థానిక వంటలు విద్యార్థుల అభిరుచులు, పోషకాలను పరిగణనలోకి తీసుకొని కొత్త మెనూను విద్యాశాఖ రూపొందించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మధ్యాహ్న భోజనం మెనూ మార్చేందుకు వంట ఏజెన్సీలతో రాష్ట్ర స్థాయి కార్యాశాల నిర్వహించింది. విద్యార్థులు ఆసక్తిగా తినేలా, పోషకాలు ఉన్న మెనూ ఎంపిక చేసింది. దీన్ని ఈ విద్యా సంవత్సరం ముగింపు వరకు ప్రయోగాత్మకంగా అమలు చేయాలని విద్యాశాఖ సూచించింది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలు జోన్ 1 లో ఉండగా కాకినాడు తూర్పుగోదావరి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు పశ్చిమగోదావరి కృష్ణా , ఎన్టీఆర్ జిల్లాలు జోన్ 2 గా పేర్కొంది. గుంటూరు పల్నాడు బాపట్ల ప్రకాశం, నెల్లూరు జోన్ 3 లో ఉండగా రాయలసీమలోని జిల్లాలు నాలుగో జోన్‌లో ఉన్నాయి.

# వల్లభనేని వంశీ కస్టడీ హెల్త్ పిటిషన్లపై తీర్పు వాయిదా

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** వల్లభనేని వంశీ కస్టడీ హెల్త్ పిటిషన్లపై తీర్పును విజయవాడ ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు వాయిదా వేసింది, సోమవారం తీర్పు వెలువరించనున్న ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు. వంశీ బెయిల్ పిటిషన్‌పై ఇప్పటికే విచారణ వాయిదా పడింది. ఈ కేసుల్లో కౌంటర్ దాఖలు చేసేందుకు పోలీసులు గడువు కోరడంతో విచారణ మంగళవారానికి వాయిదా వేసిన ఎస్సీ, ఎస్టీ కోర్టు. గుడివాడ తెలుగుదేశం పార్టీ కార్యాలయం కేసులో ఒక వ్యక్తిని వంశీ కిడ్నాప్ చేసిన బ్లాక్‌మెయిల్ చేసారన్నది ఆరోపణ. ఈ కేసులో ఆయనపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసారు. మరి కొన్ని సెక్షన్లు ఆపాదించారు. ఈ కేసులో అరెస్టయి విజయవాడ సబ్‌జైల్‌లో వంశీ ఉన్నారు. తన అనారోగ్య కారణంగా జైలులో మెరుగైన సదుపాయాలు కల్పించాలని కోర్టులో ఫిర్యాదు చేసారు. వంశీని 10 రోజుల కస్టడీకి అప్పగించాలని పోలీసులు కోర్టులో ఫిటిషన్ దాఖలు చేసారు.

# లోకాయుక్త ఆదేశాలతో వైద్యులను తొలగించిన రాష్ట్రప్రభుత్వం

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 55 మంది ప్రభుత్వ వైద్యులనువిధుల నుంచి తొలగించింది అదేశాలతో విధులకు డుమ్మా కొట్టిన వైద్యులనుప్రభుత్వం టెర్మినేట్ చేసింది. లోకాయుక్తకు ఈ మేరకు చర్యలు తీసుకున్నట్టు వైద్య, ఆరోగ్య శాఖ నివేదిక పంపింది. తొలగింపునకు గురైన వైద్యుల్లో అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన మాజీ సర్పంచ్ జంపన శ్రీనివాస్ గౌడ్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతి, సెలవు లేకుండా ఏడాదికి పైగా వైద్యులు గైర్హాజరవుతున్నారని, వైద్యులు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని ఆయన ఫిర్యాదు చేశారు. దాంతో లోకాయుత ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించింది. ఈ అంశంపై తక్షణం స్పందించాలని, సంబంధిత నివేదికను పంపించాలని ఆదేశించింది. ఈ ఆదేశాలల్లో భాగంగానే ఎస్వీ మెడికల్ కళాశాలలో 9 మంది వైద్యులు తొలగించారు. ఎం. వెంకట రావు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పీడియాట్రిక్,. వి.సరస్వతి. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్థోపెడిక్, బి.కిరణ్ కుమార్. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్థోపెడిక్, కె. మధురిమ నాయుడు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్థోపెడిక్,. పి .నలిని. అసిస్టెంట్ ప్రొఫెసర్ పీడియాట్రిక్, బి. చంద్రశేఖర్. అసిస్టెంట్ ప్రొఫెసర్ న్యూరాలజీ, కె .లావణ్య. అసిస్టెంట్ ప్రొఫెసర్ జనరల్ మెడిసిన్. ఏ. కార్తీక్.అసిస్టెంట్ ప్రొఫెసర్ రేడియో డయాగ్నసిస్. ఈ. శ్రీకాంత్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కార్డియాలజీలను ప్రభుత్వం ఉద్యోగాలనుంచి తీసివేసింది.

వార్త

బలహీనతకి పరిష్కారం దాని గురించి చింతించడం కాదు, బలం పెంచుకోవడం గురించి ఆలోచించడం.

-జార్జి ఎలియట్

# 'సహకారా'నికి తూట్లు పొడవొద్దు

**దేశంలో యాభైరెండు శాతంపైగా రైతులు అప్పుల ఊబిలో మగ్గిపోతున్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. సహకారవ్యవస్థ దిగజారే కొద్దీ ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు ఏదో ఒక రూపేణ ఈవ్యవస్థలోకి ప్రవేశించక తప్పదు. ఇప్పటికే ప్రైవేట్‌వడ్డీ వ్యాపారులు ఫైనాన్స్,మైక్రోఫైనాన్స్ పేర్లతో గ్రామగ్రామానికి విస్తరించారు. ఇష్టానుసారంగా వడ్డీలు వసూలుచేస్తున్నారు. రానురాను మరింత పెరిగేవరిస్థితులు కన్పిస్తున్నాయి. ఏదిఏమైనా ఎంతో పవిత్ర ఆశయంతో పెద్దలు ప్రవేశపెట్టిన ఈ సహకార రంగానికి తూట్లు పొడవడం ఏమాత్రం సమంజసం కాదు.**

దామెర్ల సాయిబాబ

'అప్పిచ్చువాడు వైద్యుడు, ఎప్పుడు ఎడతెగక పారు ఏరును ద్విజుడున్, చొప్పడిన ఊరనుండుము, చొప్పడ కున్నట్టిఊరు చొరకుము సుమతీ' అంటూ కొత్త ప్రదేశాల్లో స్థిరపడాలనుకునేవారికి సుమతీ శతకకారుడు కొన్నిసూచనలు ఇచ్చారు. అందులోనూ మొట్టమొదటిది అన్నిం టికంటే ముఖ్యమైనది అప్పు. ఆ అప్పుకు ఎంతటి ప్రాధా న్యత ఇచ్చారో ఆనాటి పెద్దలు.ఆరోగ్యం, నీరుకంటే అప్పిచ్చు వారికే అగ్రతాంబూలం ఇచ్చారు. ఇది కొత్తగా వచ్చిందికాదు, కొత్తగా చెప్పేది కాదు. ఎంతో అనుభవంతో కాచివడబోసి వెల్లడించిన సుమతీశతకం ఇది. పూర్వీకుల నుంచి గ్రామీణ రంగంలో రైతులను ఆదుకునేందుకు అప్పులు అందించే వ్యవస్థ ఏదోఒక రూపంలో కొనసాగుతూనే ఉంది. రాజుల కాలం కానీ, ఆ తర్వాత కానీ ఆ గ్రామాల అవసరాలను బట్టి రైతులకు రుణసహాయం అందించేవారు. ఆనాడు లాభాపేక్ష ఉండేది కాదు. రైతులకు అప్పులు ఇచ్చేవారి మధ్య అవినాభావ సంబంధాలు ఉండేవి. ఎంతో మానవతా విలువలు ఉండేవి. ఒకరినొకరు ఆదుకోవాలనే తపన,ఆరాటం ఉండేది. కానీ దిగజారిపోతున్న మానవ విలువలతో పాటు ఆ వ్యవస్థ కూడా లాభాపేక్ష ధ్యేయంగా మారి అధిక వడ్డీలు, అపరాధవడ్డీలు అంటూ అమాయకులను దోపిడీ చేయడం ఆరంభించింది. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని 'నాగు'లంటూ పంటకాలానికి బస్తాకు రెట్టింపు వసూలు చేసేవిధానం కూడా చోటు చేసుకుంది. ఈ నాగులు, అపరాధ వడ్డీలు చెల్లించలేక ఎన్నో కుటుంబాలు వీధినపడ్డాయి. దీని నుంచే వెట్టిచాకిరి ఆవిర్భవించిందని చెప్పొచ్చు. ఈ దోపిడీని వ్యతిరేకించిన వారిలో కొందరు యువకులు ఆనాటి బ్రిటిష్ పాలకులు కూడా ఎదురొడ్డి నిలిచారు. పోరాట బాటపట్టారు. ఒక దశలో బ్రిటిష్ ప్రభుత్వానికి ఇదొక సమస్యగా రూపాంతరం చెందింది. అప్పుల భారం భరించలేక, వ్యవసాయానికే మంగళం పాడే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో అటు వడ్డీ వ్యాపారులను కట్టడి చేయలేక, ఇటు రైతులను ఆదుకోలేక ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం సతమతమైంది. ఎన్నో కమిటీలు, సుదీర్ఘ అధ్యయనం అనంతరం గ్రామీణ పరిస్థితులను అర్థం చేసుకున్న బ్రిటిష్ పాలకులు 1904లో సహకార వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. 1911 మార్చి17వ తేదీన గుంటూరులో జిల్లాస్థాయి సహకార బ్యాంకు ఆవిర్భవించింది. ఆ తర్వాత అయ్యదేవర కాళేశ్వర రావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య లాంటి పెద్దలు కలిసి విజయవాడ కోఆపరేటివ్ బ్యాంకును స్థాపించారు. అందులోనుంచి విడిపోయిన పట్టాభి సీతారామయ్య భూములను తనఖా పెట్టుకొని దీర్ఘకాలిక రుణాలు ఇచ్చే భూ తనఖా బ్యాంకులను భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా కృష్ణజిల్లా గుడ్ల వల్లేరులో 1925 అక్టోబరు 31వ తేదీన శ్రీకారం చుట్టడంతో గ్రామీణరంగంలో రుణవసతులు కల్పించడంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అందరి రైతులకు కాకపోయినా కొందరికి కొంతమేరకు ఊరట లభించింది. ఈ వ్యవస్థను నీరుకార్చేందుకు కొందరు భూస్వాములు వడ్డీవ్యాపారస్తులు ఎవరి వంతు వారు కృషి చేశారు. అయినా రైతుల విశ్వాసం చూరగొంటూ అంచెలంచెలుగా ఎదిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 1964లో సహకార చట్టం వచ్చింది. రైతుల కష్టాన్ని వడ్డీ, చక్రవడ్డీ రూపంలో దోచుకుంటున్న కొందరి వ్యాపారులకు పెత్తందారులకు ఇది ఇబ్బంది కలిగించినా రైతులకు మాత్రం వరప్రసాదంగా పరిణమించింది. వడ్డీ వ్యాపారస్తులకు సంబంధించిన వ్యక్తులు డబ్బులు వసూలు చేయడంలో ఎంత కర్కశంగా వ్యవహరించేవారో ఇప్పటికీ కథలుకథలుగా చెప్పుకుంటారు. వారికి వాయిదాల ప్రకారం డబ్బు చెల్లించకపోతే

## ఒక్క మాట

డబ్బు కట్టేవరకు ఇంట్లో పొయ్యి వెలిగించకుండా నీళ్లుపోసే వారట. అంటే తమకు డబ్బు చెల్లించకుండా ఆ ఇంట్లో ఎవరూ ఆకలి తీర్చుకునే అవకాశం లేకుండా చేసేవారు. వంటపాత్రలను ఎత్తుకెళ్లేవారు. వ్యవసాయ పశువులను తోలుకుపోయేవారు. ఇంటి ముందు తలుపులు తీసుకువెళ్లడం, వ్యవసాయ పనిముట్లు జప్తు చేసుకువెళ్లడం లాంటివి చేసి సమాజంలో అవమానపరిచేందుకు ఎన్ని మార్గాలు ఉన్నాయో అన్ని అమలు చేసేవారు. మొత్తం మీద ఈ సహకార వ్యవస్థతో గ్రామీణరంగంలో ఆ బాధలు తప్పిపోయాయని రైతులు ఆనందించారు. మరొకపక్క రైతుల అవసరాలను బట్టి రుణసహాయం అందిస్తూ వారి ఆదరాభిమానాలు అందుకుంటూ సహకార రంగం శాఖోపశాఖలుగా విస్తరించింది. అంచెలంచెలుగా ఎదిగి కోట్ల రూపాయలు అప్పులిచ్చే స్థాయికి చేరుకున్నది. మరెన్నో సహకార సంఘాలు ఆవిర్భవించి దేశానికి ఆదర్శంగా నిలిచాయి. కరీంనగర్ జిల్లా ముల్కనూరులో ఏర్పాటైన సొసైటీ కార్యకలాపాలను చూసేందుకు మనదేశం నుంచే కాదు బ్రిటన్ లాంటి దేశాల నుంచి కూడా నిపుణులు వచ్చి అధ్యయనం చేసివెళ్లేవారంటే అర్థం చేసుకోవచ్చు. కానీ ఈ వ్యవస్థలో రాజకీయాలు ప్రవేశించడంతో క్షీణదశ ఆరంభమైందని చెప్పొచ్చు. గత రెండు, మూడు దశాబ్దాలుగా పరిస్థితి రానురాను దిగజారిపోతున్నది. అప్పులు వసూలు చేయడంలో పాత వడ్డీవ్యాపారులు వ్యవహరించిన తీరు కొన్నిచోట్ల అధికారులు పాల్పడుతుండడంతో రైతుల విశ్వాసాన్ని కోల్పోతున్నారు. గతవారంలో తెలంగాణలో ఓ బక్క రైతు అప్పుకట్టలేదని ఆయన ఇంటి ముందు తలుపులు తీసుకువెళ్లారు. ఆ తలుపులతో ఆయన కట్టాల్సిన లక్షలాది రూపాయలు అప్పులో వందోవంతు కూడా తీరదని తెలుసు. కేవలం ఆ రైతును అవమానపరిచేందుకే ఇలాంటి పాత పద్ధతులను అవలంబిస్తున్నారు. రైతుల పరిస్థితి వేదనాభరితంగా మారుతున్నది. అధికారులు పాల్పడుతున్న ఇలాంటి చర్యల పట్ల తెలంగాణ వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు మొన్న బహిరంగంగానే తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. అయినా కొందరు అధికారుల్లో మార్పురావడం లేదు.పోనీ ఇంత నిర్దాక్షిణ్యంగా రైతుల నుంచి వసూలుచేసి సహకార వ్యవస్థ పురోభివృద్ధికి ఉపయోగపడుతున్నాయంటే అదీ లేదు. సహకార సంఘాల ఆర్థికపరిస్థితి అంతకంతకు దిగజారిపోతున్నది. నష్టాలఊబిలో కూరుకుపోతున్నాయి. కొన్ని సహకార సంఘాలు తమ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. సహకార చట్టంలో ఎన్నిసార్లు మార్పులు చేశారో చెప్పలేం. సకాలంలో ఎన్నికలు జరపడం లేదు. వాయిదాల మీద వాయిదాలు వేసుకుంటున్నారు. ప్రస్తుతం కూడాఅదే పద్ధతి అవలంబిస్తున్నారు. రాజకీయాల అవసరాల కోసం వీరూవారు అనితేడాలేకుండా అందరూ అన్నివిధాలుగా ఈ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడే కాదు ముఖ్యమంత్రులు మారినప్పుడు వారి అధీష్టాలమేరకు నిబంధనలు మారుస్తున్నారు. భూమున్న రైతులేకాదు, భూమి లేని వారు కూడా కేవలం పదిరూపాయలు ఫీజు చెల్లించి సభ్యులుగా చేరవచ్చునన్న సవరణ తెచ్చారు. ఆ తర్వాత మళ్లీదాన్ని సవరించారు. ఎన్నికల్లో ఓట్లకోసం ఇష్టానుసారంగా సభ్యత్వాన్ని పెంచారు. 'ఒకరి కోసంఅందరు, అందరి కోసం కొందరు నిలిచి' అన్న సహకారస్ఫూర్తికి ప్రమాదం వాటిల్లే పరిస్థితులు ఏర్పడ్డాయి. సహకారవ్యవస్థ రాజకీయ పునరావాసంగా రూపాంతరం చెందింది. ఆదాయ వ్యయాలు నిమిత్తం లేకుండా అవసరాలకు మించి ఉద్యోగులను నియమించడంతో సహకార సంఘాలకు మోయలేని భారంగా పరిణమించింది. ఇక అవకతవకలకు అంతేలేకుండాపోయింది. రైతులకు తెలియకుండా రైతుల పేరుపై అప్పులు తీసుకొని భోంచేసిన ఉదంతాలు ఎన్నో బయటకు వచ్చాయి. విచారణ పేరుతో ఏళ్లతరబడి కాలంగడుపుతున్నారు. 'కావడి ఎన్ని వంకలు తిరిగినా చివరకు ఇంటికి చేరాల్సిందేనన్నట్లు' ఈ భారమంతా రైతులు మోయాల్సివస్తుందనే వాస్తవాన్ని పాలకులు పట్టించుకోవడంలేదు. దేశంలో వ్యవసాయరంగం కుదేలైపోతుండడానికి కారణాల్లో రైతులకు సకాలంలో అప్పులు దొరక్కపోవడం. దీంతోవారు ప్రైవేట్ వ్యాపారులపై ఆధారపడక తప్పడం లేదు. దేశంలో యాభై రెండు శాతం పైగా రైతులు అప్పులఊబిలో మగ్గిపోతున్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడిస్తు న్నాయి. సహకార వ్యవస్థ దిగజారే కొద్దీ ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు ఏదోఒక రూపేణ ఈ వ్యవస్థలోకి ప్రవేశించక తప్పదు. ఇప్పటికే ప్రైవేట్‌వడ్డీ వ్యాపారులు ఫైనాన్స్, మైక్రోఫైనాన్ పేర్లతో గ్రామగ్రామానికి విస్తరించారు. ఇష్టానుసారంగా వడ్డీలువసూలు చేస్తున్నారు.రానురాను మరింత పెరిగేపరిస్థితులు కన్పిస్తున్నాయి.ఏదిఏమైనా ఎంతో పవిత్ర ఆశయంతో పెద్దలు ప్రవేశపెట్టిన ఈ సహకార రంగానికి తూట్లు పొడవడం ఏమాత్రం సమంజసం కాదు. ●

# వణకుతున్న ఊళ్లు!

జలం జీవనాధారం. నీరు ఎక్కడ ఉంటే అక్కడ జీవం ఉంటుంది. అందుకే 'ఎప్పుడు ఎడతెగక పారు ఏరు...' చోటును ఎంపిక చేసుకొని ఉండమన్నారు సుమతీశతకకారుడు. వేసవికాలం వస్తున్నదంటే మంచినీటికి కటకటలాడాల్సిన పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలని ప్రజలు ఆందోళన చెందడం సర్వసాధారణమైపోతున్నది. పాలకుల అసమర్థత, కొందరు అధికారుల అవినీతి, అవగాహనరాహిత్యం, ముందుచూపు లేకపోవడం, ప్రకృతి సహాయనిరాకరణ తోడుకావడంతో తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది ప్రజలు గుక్కెడు మంచినీటికి పడరాని పాట్లుపడక తప్పడం లేదు. దాహం తీర్చుకునేందుకు అందుబాటులో ఉన్న కలుషిత నీటిని తాగి రోగాలబారిన పడుతున్నారు.దాదాపు ముప్పై ఆరు రకాల రోగాలు కేవలం జలకాలుష్యం వల్లనే వస్తున్నట్లు వైద్యనిపుణులు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు మంచినీటి సమస్య దేశవ్యాప్తంగానే తీవ్రంగా ఉన్నట్లు చొప్పొచ్చు. స్వాతంత్య్రం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటిపోయినా అది సాధించాం, ఇది సాధించామని గొప్పలు చెప్పుకుంటున్నా ఇప్పటికీ ప్రజలందరికీ కనీసం అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన నీరు అందించలేని దురదృష్టపు పరిస్థితుల్లో ఉన్నాం. అలాని మంచినీటి కోసం ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని చెప్పడం లేదు.గత ఏడున్నర దశాబ్దాల్లో కేవలం మంచినీటి కోసమే లక్షలాది కోట్లు వెచ్చించారు, వెచ్చిస్తూనే ఉన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది అధికారులు పనిచేస్తూనే ఉన్నారు. కానీ వ్యయం చేస్తున్న నిధులు ఏమేరకు కిందిస్థాయికి వెళ్లి ప్రజల అవసరాలు తీరుస్తున్నాయనేదే ప్రశ్న. కరవుల్లోనే కాదు వర్షాలు సమృద్ధిగా కురిసిన సంవత్సరాల్లో అన్నింటిలో మంచినీటి సమస్య తీవ్రంగానే ఉంటుంది. బోరుబావులపై ఆధారపడాల్సిన పరిస్థితులు అంతకంతకు పెరిగిపోతున్నాయి. యేటా తెలుగు రాష్ట్రాల్లోనే పరిశీలించినా వేలాది బోరుబావులు కొత్తగా పుట్టుకొస్తున్నాయి. భూగర్భజలాల వినియోగం ఊహించని రీతిలో పెరిగిపోతున్నది. అదే స్థాయిలో నీటి వృధాకూడా పెరుగుతున్నది. ప్రధానంగా వ్యవసాయరంగంలో ఉచిత విద్యుత్ కూడా ఈ నీటి వృధాను పెంచుతున్నదనే చెప్పొచ్చు. తగ్గిపోతున్న భూగర్భజలాల భర్తీకి అవసరం మేరకు ప్రయత్నాలు జరగకపోవడంతో దేశంలోని అనేక రాష్ట్రాల నీటి మట్టాలు పడిపోతున్నాయి. తెలంగాణలో ఇంకా ఎండాకాలం మొదలుకాకుండానే నీటి మట్టాలు భారీగా తగ్గడం ఆందోళన కలిగిస్తున్నది. డిసెంబరులో 6.7 మీటర్ల లోతుగా ఉన్న రాష్ట్ర భూగర్భ సగటు జలమట్టం జనవరిలో 7.46 లోతుకు తగ్గిపోయింది. ఈ స్థాయిలో ఇప్పుడే భూగర్భజలాలు అడుగంటితే ఏప్రిల్, మే నాటికి పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతులతోపాటు సామాన్య ప్రజలు కూడా ఆందోళన చెందుతున్నారు. అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఆ మాటకొస్తే దేశవ్యాప్తంగా కూడా ఈసారి భూగర్భజలాల పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో పంటల దిగుబడిపై ఆ ప్రభావం పడుతుందనివ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా భారత్‌లో యేటా దాదాపు 250 ఘనపు కిలోమీటర్ల మేర భూగర్భజలాలు వినియోగిస్తున్నారు. దీనిపై ఏవో నామమాత్రపు నిబంధనలున్నా పట్టించుకోకపోవడంతో వినియోగం అంతకంతకు పెరిగిపోతున్నది. వాస్తవంగా దేశంలో ఆరువేల ఐదువందల డెబ్బైరెండు భూగర్భజలాల బ్లాకులు ఉండగా వాటిలో మూడోవంతు బ్లాకులు అవసరానికి మించి భూగర్భజలాలు వాడుతున్నారు. బోరుబావుల సంఖ్య యాభైయేళ్లలో 120 రెట్లకుపైగా పెరిగి దాదాపు మూడున్నర కోట్లకు పైగా బోరుబావులు చేరుకున్నాయి. దీంతో సన్నకారు, చిన్నకారు, మధ్యతరగతి రైతులు కొంతమేరకు లాభపడిన మాట వాస్తవమే అయినా నానాటికీ బోరుబావుల మీద ఆధారపడే పరిస్థితి పెరిగితే ఇది అనేక అనర్థాలకు దారితీస్తుంది. దేశంలో భూగర్భజలాల వినియోగం మూడింతలు పెరగడం, నీటి నియమాలు నీరుగారిపోతున్నాయనేందుకు సజీవ సాక్ష్యాలుగా పేర్కొనవచ్చు. పంజాబ్‌లో డెబ్బైఐదు శాతం, రాజస్థాన్‌లో అరవైశాతం, కర్ణాటక, తమిళనాడులో నలభై శాతం అధికంగా భూగర్భ జలాలు వాడుకుంటున్నట్లు సమాచారం. దేశ రాజధాని ఢిల్లీతోసహా పంజాబ్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లో యేటా యాభైనాలుగు లక్షలకోట్ల లీటర్లకుపైగా భూగర్భ జలాలు తోడేస్తున్నారు. దేశంలో మూడోవంతు జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో భూగర్భజలాలు తాగుయోగ్యమైనవి కావని కేంద్రం ఏనాడో ప్రకటించింది. పాతాళంలోకి దిగ జారిపోతున్న జలాలను పైకి తోడడానికి అటు విద్యుత్ కానీ, ఇటు డీజిల్ కానీ వినియోగం పెరిగిపోతుంది. మంచి నీటికొరతను ఆసరాగా చేసుకొని కొందరు దళారులు మంచినీటి వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా నీటి వ్యాపారం వేల కోట్లల్లోకి చేరుకున్నది. వేసవి వస్తున్నదంటే తెలుగు రాష్ట్రాల్లో కూడా అనేక ప్రాంతాలు ముఖ్యంగా నగరాలు, పట్టణాలు, గ్రామాలే కాదు శివారు పల్లెలకు కూడా నీటివ్యాపారం విస్తరించింది. ఏ కోణంలో చూసినా మంచినీటి పరిస్థితి రానురాను ప్రశ్నార్థకంగా మారుతున్నది. భూగర్భజలాల మట్టాలు తగ్గిపోవడం మానవాళికి ఏమాత్రం క్షేమం కాదు. మరొక పక్క కోట్లాది ఎకరాలకు సరిపోయే వేలాది టిఎంసిల నీటిని దేశంలో వివిధ నదుల ద్వారా పొంగిపొర్లి సముద్రం పాలవుతున్నది. ప్రజల్లో అవగాహన లోపించడం ఫలితంగానే భూగర్భజలాల సమస్య రానురాను తీవ్ర రూపం దాలుస్తున్నది. ఈ సమస్యను పరిష్కరించేందుకు రాజకీయాలకు అతీతంగా నేతలు యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాలి.

క్షమించడం, క్షమాపణ పొందడం ఒకే నాణేనికి రెండువైపులు. వాటి మధ్య సమన్వయం సాధించడమే ముఖ్యమైన కర్తవ్యం.



ఇ. గిబ్బన్

నీ తోటి మనుషులతో నీవే ఎక్కువ తెలివైనవాడిగా, ఎక్కువ చదువుకున్న వాడిగా ఎప్పుడూ వ్యవహరించకు.



విలియం రోజర్

# న్యాయస్థానాల్లో తీవ్రజాప్యాన్ని అరికట్టాలి!

బి. మధు

ఈ మధ్యకాలంలో ఎక్కడ చూసిన ఉమ్మడి కుటుంబాల ఆస్తుల విషయంలో అన్నదమ్ముల మధ్య వచ్చే పొరపచ్చలు, ఘర్షణ వాతావరణం, బహిరంగ కొట్లాటలు, ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ, పరస్పర దాడులు చేసుకుంటూ తమది న్యాయం అంటే తమది న్యాయం అంటూ చివరకు పోలీస్ స్టేషన్‌కు, కోర్టుకువెళ్లడం వంటివి సంభవించడం ఒక సర్వ సాధారణ విషయంగా మారిపోవడం ఈ సమాజానికి సంబంధించి ఏ మాత్రం ఆరోగ్యకరమైన పరిణామం కాదు. ముఖ్యంగా ఈ ఉమ్మడి ఆస్తుల విషయంలో ఎవరికి చెందాల్సిన ఆస్తులు వారికే చెందకుండా అంతా ఆస్తిని తాము ఒక్కరమే అనుభవించాలనే దురాశతో, దుర్బుద్ధితో తమకువచ్చే ఆస్తులు చాలక తన సొంత అన్నదమ్ముల, తోబుట్టువుల ఆస్తులను కూడా దొడ్డిదారిలో కాజేయాలని చూస్తుండటం,హస్తగతం చేసుకోవాలని ప్రయత్నం చేయడం అందుకోసం ఎలాంటి నీతిమాలిన చర్యలకు పాల్పడటానికి కూడా వెనుకంజ వేయకపోవడం వంటి అనైతిక పోకడల మూలాన ఆస్తుల వ్యవహారాలు ముదిరిపాకాన పడిఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటూ, దుమ్మెత్తి పోసుకుంటూఅంతిమంగా న్యాయం కోసం ఏ పోలీస్ స్టేషన్ లేదా న్యాయ వ్యవస్థ గడపనో తొక్కడం వంటి చర్యలు అనేకం. ప్రస్తుతం మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తున్నాయి అనే మాట పచ్చి యధార్థం.అయితే ఎక్కువ భాగం ఇలాంటి కేసులలో తమ తల్లిదండ్రులను నయనో భయానో లొంగదీసుకొని లేదా వారిని పక్కదోవ పట్టించి మరీ ఉమ్మడి కుటుంబంలోని కొంతమంది నయవంచకుల వంటి అన్నదమ్ములు తమ సొంత అన్న లేదా తమ్ముడి ఆస్తులను చట్టంలోని లొసుగులను ఆధారంగా చేసుకొని ఆస్తులను అప్పనంగా కొట్టేసేందుకు ఎన్నో కుట్రలు, కుతంత్రాలు పన్నుతుండటం, అందుకోసం నీతి,నియమాలకు సైతం తిలోదకాలు ఇచ్చి డబ్బు వ్యామోహం మెండుగా గల కొంతమంది లాయర్లను ఆసరాగా పెట్టుకొని మరీ అందరికి చెందాల్సిన ఆస్తులు తమకే చెందేలా ఆస్తులను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కూడా ఏ మాత్రం వెనుకంజ వేయడం లేదు. అంటే నేటి సమాజంలో ఎలాంటి అత్యంత దురదృష్టకరమైన, ఆందోళనకరమైన పరిస్థితులు పొడచూపుతున్నాయో మనకు బాగా విశదమవుతున్నది .అందుకోసం మోసపురితమైన,దగాకోరు పంథాలో తల్లిదండ్రుల నుంచి ఆస్తుల రిజిస్ట్రేషన్ పత్రాల పై సంతకాలు తీసుకొని తమకు చెందని ఆస్తులను కూడా కొంతమంది రిజిస్ట్రేషన్ ఆఫీసు అధికారులను,అక్కడ పని చేసే సిబ్బందిని మభ్యపెట్టి వారికి కాసుల ఆశ చూపి తమ పేర లిఖించుకొని ఆన్‌లైన్ చేసుకుంటున్నారు. అంటే మన వ్యవస్థ ఎంతగా భ్రష్టు పట్టిందో, ఏస్థాయిలో దిగజారిపోయిందో మనం ఇట్టే ఊహించవచ్చు. ఏదిఏమైన ఇప్పటికైనా ఉమ్మడి కుటుంబంలోని సభ్యులు తమ ఆస్తుల విషయంలో నిద్రాణావస్థ నుంచి మేల్కొని తమ ఆస్తులు మరొకరి పాలు కాకుండా,అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించడంతోపాటు, ఒకవేళ తమకు అన్యాయం జరిగిన త్వరితగతిన తమ తల్లిదండ్రులను సంప్రదించి జరిగిన దారుణ మోసాన్ని వారికి బట్టబయలు చేసివారిని (ఎంఆర్‌ఓ) మండల రెవెన్యూ అధికారి,తహశీల్దారు వంటి ఆఫీసర్ల వద్దకు తీసుకెళ్లి తక్షణమే వారు దొడ్డిదారిన రిజిస్ట్రేషన్ చేసిన భూమిని బ్లాక్ చేయించే విషయంపై అవగాహన పెంచుకొని తమ విలువైన ఆస్తులను అత్యంత సురక్షితంగా కాపాడుకోవాలి. కాబట్టి ఉమ్మడి ఆస్తుల పరిరక్షణే ప్రదాన ధ్యేయంగా ప్రతి ఒక్క ఉమ్మడి కుటుంబ సభ్యులు భావించి తదనుగుణంగా తమ గురుతర బాధ్యతను సక్రమంగా నిర్వర్తించకపోతే మాత్రం చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందాన అమూల్యమైన జీవితాలు అధోగతి పాలు కావడం తథ్యం. ●

## ప్రజావాక్కు



### ఉరుము ఉరిమి ఉక్రెయిన్ మీద పడింది

అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ రాకతో ప్రపంచ దేశాల భౌగోళిక రాజకీయ సంబంధాలు పెద్ద కుదుపుకి లోనవుతున్నాయి.ఒక్కోచోట పిడుగులు, ఒక్కోచోట కుంభవృష్టి. అమెరికాతన ప్రయోజనాల్ని సాధించుకోడానికి ఏ దిశగా, ఎంత వేగంగా ప్రయత్నిస్తుందో చెప్పడం కష్టమోతుంది. తాజాగా ఆ దేశం వ్యూహం రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని తీవ్రంగా ప్రభావితం చేయనుంది. అదీ తను ఇందాకా పక్షంవహించిన ఉక్రెయిన్ ఆశలకు విరుద్ధంగా. రష్యా, ఉక్రెయిన్ నడుమ యుద్ధం మూడేళ్లుగా కొనసాగుతోంది. బలమైన రష్యాతో, బలహీనమైన ఉక్రెయిన్ తలపడడానికిముఖ్యకారణం తన వెనుకబలంగా నిలిచిన అమెరికా, యూరోప్ దన్ను చూసుకునే.వారి నుండి అందుతున్న ఆర్థిక, సైనిక, ఆయుధ సాయంతోనే.

-డా.డి.వి.జి. శంకరరావు, విజయనగరం

### వైద్య సౌకర్యం కల్పించాలి

ఈఎస్‌ఐ వైద్య సౌకర్యం కల్పించాలి.నూతనంగా తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీఎస్టీబీసీ మైనారిటీ గురుకులాలలో ఇటీవలకాలంలో 9210 నూతనంగా డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, పిజిటి, టీజీటీ, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్స్ వివిధ సొసైటీలలో జాయిన్ కావడం జరిగింది. రాష్ట్రంలో మొత్తం 20 వేలమంది గురుకుల సిబ్బందికి ఈఎస్‌ఐ వైద్య సదుపాయం కల్పించాలి. గురుకులాలలో నిత్యం విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తూ వివిధ అనారోగ్య సమస్యలతో ఉన్నవారికి ఈఎస్‌ఐ ఆరోగ్య కార్డు ఇచ్చి ఉద్యోగితోపాటుగా వారి కుటుంబ సభ్యులకు వారి తల్లిదండ్రులకు ఉచిత ఈఎస్‌ఐ వైద్య సదుపాయం కల్పించాలి.

-రాపాక రవీందం, జనగాం

### లోక్‌అదాలత్ నిర్వహణ

ప్రతి జిల్లాలో న్యాయసేవల సాధికార సంస్థ నిర్ణీత కాలంలో లోక్ అదాలత్ నిర్వహణ జరుగుతోంది. చట్టం అనుమతించే రాజీమార్గం ఉన్న కేసుకు సత్వర న్యాయం లభిస్తుంది.ఎందరో పేద కుటుంబాలువారికి జరిగిన అన్యాయాలకు ఆర్థిక స్తోమత లేనప్పుడు మొదట పత్రాలతో సంబంధిత అధికారులు లేదా పర్యవేక్షకులను సంప్రదిస్తే దానివిధానం తెలియజేస్తారు.దీనివల్లపరిష్కారం ఏ ఖర్చు లేకుండా పొందవచ్చు. వస్తుంది.

-బొల్లోజు మేఘనాధం, విశాఖపట్నం

### జరిగిన నష్టం రాబట్టాలి!

ఎపి ఫైబర్ నెట్ ఛైర్మన్ జీవీ రెడ్డి ఆ సంస్థలో పని చేస్తున్న ముగ్గురు ఉన్నతాధికారులపనితీరు పూర్తిగా లోపభూయిష్టంగా, బాధ్యతారహితంగా ఉండటంతో తొలగించాలని తీసుకున్న నిర్ణయం అభినందనీయం. తొలగించడమే కాకుండా, వారి బాధ్యతారాహిత్యం వలన సంస్థకు జరిగిన నష్టం వారి నుంచి రాబట్టాలి. ఒక్కఫైబర్ నెట్‌మాత్రమే కాదు, ప్రతి శాఖలో, ప్రభుత్వ సంస్థల్లో అన్ని స్థాయిల్లో ఇదే పరిస్థితి నెలకొంది. పాలకులు ప్రజలకు జవాబుదారీ. మంత్రులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు పని చేయని అధికారులను గుర్తించితక్షణమే తొలగించాలి. అవినీతికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి!

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### పెరిగిన టారిఫ్

డోనాల్డ్ ట్రంప్ మహాశయుడు అమెరికా అధ్యక్షుడిగా రెండవసారి ఎన్నికయిన తరువాత అనేక పరిశోధనలు చేస్తున్నారు. మన టారిఫ్ తో సమానంగా వారి టారిఫ్‌ను పెంచడం ఈ విషయాన్ని ఖరాఖండిగా మన ప్రధాని మోడి గారితోనే నిష్కర్మగా నిర్మోహమాటంగా చెప్పానని ట్రంప్ చెప్పారు. భారత దేశానికి డబ్బుఅవసరం ఏ మాత్రంలేదని చెప్పారు. ఎందుకంటే భారత్ ధనిక దేశమట. పన్నుల రూపేణా అధికంగా సంపాదిస్తోందట.ధనిక దేశమే అయితే కోటిలక్షల కోట్లు అప్పు చేయడమెందుకో. కొంతమంది ఐ.పి.ఎస్. 95 స్కీములో రిటైరయిన వారు రెండు దశాబ్దాల పైగా తమకొచ్చే వెయ్యిరూపాయల ఫించన్ను పెంచమని మొత్తుకుంటుంటే తమ ప్రభుత్వం దగ్గర డబ్బు లేదని బీద అరుపులు అరుస్తోంది.కోట్లాది మంది భారతీయులు ఇంకా దారిద్రరేఖ దిగువున నివసిస్తున్నారు. మరి భారత్ ధనిక దేశం ఏలా అయిందో ట్రంప్ విడమరచి చెప్పాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### మాతృభాషలోనే విద్యాబోధన


విద్యాహక్కు చట్టం 2005 ప్రకారం మాతృభాషలోనే విద్యాబోధన చేయాలి.ప్రతి తరగతికి ఒక గదిఉండాలి. అన్ని పాఠశాలలకు ర్యాంకింగ్స్ ఇవ్వాలి. ఉపాధ్యాయులను బోధనే తర కార్యక్రమాలకు ఉపయోగించకూడదు.అన్నిపాఠశాలల్లో మౌలిక వసతులుకలిపించాలి. పాఠశాలల ముందు స్కూల్ జోన్ బోర్డు ఉండాలి.మాతృభాషలో విద్యాబోధన ద్వారా విద్యార్థులు పాఠాలు త్వరగా నేర్చుకోవడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది.

-పుట్లూరి రాం నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

# చదువుల విప్లవం డిజిటల్ టెక్నాలజీతో సాధ్యం!

డాక్టర్ మోటె చిరంజీవి

కాలం మారుతుంది. కాలానికి అనుకూలంగా విద్యలో కూడా అనేక మార్పులు వస్తున్నాయి.రోజురోజుకు విద్యార్థుల్లో కూడా కాంపిటీషన్ పెరుగుతుంది. దాన్ని అధిగమించడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు అధ్యాపకులు. ఇలా పట్టణప్రాంతాల్లో ఉన్నటువంటి పాఠశాలలు మొదలుకొని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి పాఠశాలలకు కూడా డిజిటల్ తరగతులతో బోధన చేపట్టి, విద్యార్థుల్లో నైపుణ్యాలను అలవరుస్తున్నారు. కరోనా సమయంలో కూడా ఈ డిజిటల్ తరగతులు కీలకంగా పని చేశాయి. గూగుల్, జూమ్ యాప్ ద్వారా ఇంటిదగ్గర ఉన్నటువంటి పిల్లలకు సైతం పాఠాలు బోధించారు.ఈ విధంగా ఆన్లైన్ క్లాసులకు ఆజ్యం పోయడం జరిగింది. ఇలా పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఇంట్లోనే పాటలు వినేటువంటి పరిస్థితి కలిగింది. ప్రైవేటు పాఠశాలలే కాకుండా ప్రభుత్వ, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో కూడా విద్యార్థులకు సులభతరంగా విద్యా బోధనలు అందించడానికి పలు రకాలుగా పాఠాలను బోధిస్తున్నారు. అందులో సులభతరంగా విద్యాబోధన చేయడానికి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డులు ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ పాఠశాల తరగతి గదుల్లో డిజిటల్ విప్లవం వచ్చింది అనడంలో అతిశయోక్తి లేదు. విద్యార్థులకు సులభతరంగా పాఠ్యాంశాలు బోధించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. విద్యలోసాంకేతిక పురోగతి కోసం పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఐక్యంగా నిలబడి,అధ్యాపకులు సైతం అండగా ఉన్నప్పుడుమాత్రమే ఇది సాధ్యమవుతుంది. అందుకోసం అధ్యాపకులకు నూతన టెక్నాలజీని కూడా బోధిస్తున్నారు.సాంకేతిక విప్లవం ఇంకా వెనుకబడి ఉన్న అనేక పాఠశాలలు,కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో ప్రధాన సవాళ్లు ఉన్నాయి.ఉపాధ్యాయులు తరగతి గదిలో ఆధునిక విద్యా సాధనాలను ఉపయోగించడానికి వెనుకాడతారు. అలా వెనకాడకుండా ఉండడానికి , సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించడానికి, వారికి సరైన శిక్షణ ఇస్తున్నారు.గతంలో వనరులు, మౌలిక సదుపాయాలు కనెక్టివిటీ లేకపోవడం వల్ల తరగతి గదులకు ఇంత సుసం పన్నమైన సాంకేతికత అందుబాటులో లేకుండా పోయింది. కానీ ప్రస్తుతం అలాంటి ఇబ్బంది ఏమీ లేదు. భారతదేశం డిజిటల్ మయమైంది. వేగవంతమైన సాంకేతిక పురోగతి యుగంలో మన పట్టణకేంద్రాలు అభివృద్ధి చెందుతున్నందున, మన నగరాలు, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న విస్తారమైన విద్యా అంతరాన్ని తగ్గించడంపై మనం దృష్టి పెట్టవలసిన సమయం ఆసన్నమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై ఎక్కువ నిధులు కేటాయిస్తూ, అందులో చదువుతున్నటువంటి విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ తరగతి గదుల పరిచయం ఆశాకిరణంగా ఉద్భవించింది. ఈ వినూత్న సెటప్‌లు మన



దేశంలోని మారుమూల ప్రాంతాలలోని విద్యార్థులకు సాధికారతను కల్పిస్తాయి. దృశ్య అభ్యాస అనుభవాలు ఇంటరాక్టివ్ వాతావరణాల ద్వారా మెరుగైన అవగాహనను అందిస్తాయి. గ్రామీణవిద్యలో సాంకేతికతను సమగ్రపరిచే మార్గంలో సవాళ్లులేకుండా లేవు. పరిమిత మౌలిక సదుపాయాలు, అనియత విద్యుత్ సరఫరా నుండి డిజిటల్ అక్షరాస్యతకు, అడ్డంకులు అనేకం ఉన్నాయి. అన్నింటిని అధిగమిస్తూ విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, బ్యాగులు ఇలా అన్ని సమకూర్చుతూ మరోపక్క బోధన పద్ధతుల్లోకూడా వినూత్న పద్ధతులు పాటించేలా అనేక విద్యాప్రమాణాలను పాటిస్తూ, గురుకులాలలో విద్యార్థుల సంఖ్యను పెంచుతుంది. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దడం జరిగింది. కంప్యూటర్ ల్యాబ్‌తోపాటు, ట్యాబు ద్వారా, బై జ్యూస్ కంటెంట్ విద్యార్థులకు బోధించేందుకు ప్రతి తరగతి గదిలో ఐ ఎఫ్ ప్యానల్, స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసి విద్యను అందిస్తున్నారు. ప్రొజెక్టర్ ద్వారా లైవ్ క్లాస్‌లను కూడా అందుబాటులోకి తేవడం జరిగింది. విద్యార్థికి ఏదైనా అర్థం కానప్పుడు అడిగే విధంగా కూడా ఉండి, వారికి వచ్చిన డౌటును క్లారిఫై చేసుకోవడం జరుగుతుంది. ఈవిధంగా పాఠశాల విద్యార్థుల్లో మెరుగైన ర్యాంకులురావడం, కళాశాల విద్యార్థులు నీట్, ఐఐటి వంటి పోటీ పరీక్షలలో మంచి ర్యాంకులు సాధించడం,డిగ్రీ, పిజి,పిహెచ్‌డి విద్యార్థులు సైతం వారికి తెలియని విషయాలను సైతం తెలుసుకుంటూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటున్నారు. ఈ విధంగా కరోనా సమయంలో ఇంట్లోనే ఉండి విద్యను నేర్చుకోవడం జరిగింది. ఇప్పుడు విశ్వవిద్యాలయాల్లో సైతం ఆన్లైన్ ఎడ్యుకేషన్ ద్వారా విద్యార్థులకు ఆన్లైన్ పాఠాలు బోధిస్తున్నారు. 20వ శతాబ్దపు 3వ పారిశ్రామిక విప్లవం ఇంటర్నెట్, ఆటోమేషన్ టెక్నాలజీలను తీసుకువచ్చింది. డిజిటల్ టెక్నాలజీల విస్తృత వినియోగం కారణంగా, దీనిని డిజిటల్ విప్లవం అని కూడా పిలుస్తారు. కొత్త డిజిటల్ టెక్నాలజీల సహాయంతో ప్రస్తుత వ్యాపార ప్రక్రియలను మెరుగుపరిచే ప్రక్రియను డిజిటలైజేషన్ అంటారు. 20వ శతాబ్దంలో కంప్యూటర్లు విస్తృతంగా వాడుకలోకి వచ్చిన తర్వాత ఇది ప్రారంభమైంది. ఇంతకుముందు భారత్‌లో ఎంతోమంది విద్యార్థులు పలు రకాల కారణాలతో అర్ధాంతరంగా చదువుకు దూరం అయ్యేవారు. వారికోసం వారు చదువు కొనసాగించడానికి విశ్వవిద్యాలయంలో ఈ డిజిటల్ ఆన్లైన్ తరగతులు ఎంతగానో తోడ్పడుతుంది. ఇవే కాకుండా సీట్లు పొందినటువంటి విద్యార్థులు డిజిటల్‌ద్వారా తమకు నచ్చిన విశ్వవిద్యాలయంలో గాని, విద్యాలయాలలో గాని, సంక్షేమ గురుకులాల్లో సీట్లు పొందుతున్నారు. ఈ విధంగా విద్యార్థులకు ఆన్లైన్‌కోర్సులు విస్తృతంగా అందుబాటులోకి రావడం, ఆన్లైన్ కోర్సులను అందించడానికి కేంద్రం ఆధ్వర్యంలో 2016లో మాసీవ్ ఓపెన్ ఆన్లైన్‌కోర్సెస్ వేదిక ఏర్పాటు చేశారు.రాబోయే రోజులలో అంతర్జాతీయ విద్యాసంస్థలతో డిజిటల్ పాఠాలను అందించినట్లయితే ఎంతగానో ఉపయోగపడుతుంది. ఏది ఏమైనప్పటికీ డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం ప్రతి ఒక్కరికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇలా ఇంటర్నెట్ సౌకర్యం కలిగి ఉండి, విద్యార్థులకు మెరుగైన సేవలు అందిస్తున్నటువంటి గురుకులాలు, పాఠశాలలు ఉన్నతప్రమాణాలు పాటించడమే కాకుండా వారిని సమాజంలో ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా తీర్చిదిద్దుతున్నారు అధ్యాపకులు. ఈ విధంగా విద్యార్థులు, అధ్యాపకులు, డిజిటల్ వ్యవస్థలను ఉపయోగించి,వాటితో బోధించి,ఎంతో మంది విద్యార్థులకు ఆదర్శప్రాయులుగా నిలుస్తున్నారు. ●

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఎన్నికల ప్రక్రియలో విదేశీ జోక్యమా?

## డోజ్ వ్యాఖ్యలపై మండిపడుతున్న వివిధ పార్టీలనేతలు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** అంతర్జాతీయ అభివృద్ధికి నిధులు అందచేసే యుఎస్ఎయిడ్ భారత్‌లో ఓటర్ టర్నౌట్ పెంచేందుకుగాను 21 మిలియన్ డాలర్ల నిధిని అందించిందని ఎలాన్‌మస్క్ చేసిన వ్యాఖ్యలు ఆపై వీటన్నింటిని రద్దుచేస్తున్నట్లు ప్రకటించిన వైనంపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. భారత అంతర్గత వ్యవహారాల్లో అమెరికా మితిమీరిన జోక్యం చేసుకుంటున్నదని దౌత్యవేత్తలు అభిప్రాయపడుతున్నారు. విదేశాంగశాఖ ఈ 21 మిలియన్ డాలర్ల ఇండియా ఫండ్‌పై స్పందించింది. కాంగ్రెస్ బిజెపిలమధ్య మాటలయుద్ధం పెరుగుతుండటంతో ఆయన స్పందించారు. భారత ఎన్నికల ప్రక్రియలో బయటిశక్తుల జోక్యం పెరుగుతోందని ఆందోళన వ్యక్తంచేసారు. అయితే అధికార బిజెపి 2012లో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యుపిఎ ప్రభుత్వం భారత్ కీలక సంస్థల్లోకి చొరబాట్లను సమ్మతించిందని, జాతిప్రయోజనాలను పణంగా పెట్టిందని ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్‌నేతలు కూడా ఘాటుగానే స్పందించారు. యుఎస్ ఎయిడ్ ద్వారా ఒక్క బిజెపి మాత్రమే లబ్దిపొందిందని అన్నారు. డోజ్ సంస్థ చీఫ్ టెస్లా వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ ఆధ్వర్యంలోని డోజ్ ఆడిట్‌లో అనేక ప్రభుత్వ ఏజెన్సీలకు వృధా నిధుల మంజూరును కోత విధించింది. సుమారు 486 మిలియన్ డాలర్లు ఎన్నికల కూటములు, ఎన్నికల ప్రక్రియను పటిష్టంచేసేందుకు వెచ్చించినట్లు చూపించడంతో వాటిని రద్దు చేసారు. మాల్డోవా లో సమ్మిళిత రాజకీయ ప్రక్రియలో భాగ స్వామ్యం కోసం 22 మిలియన్ డాలర్లు, 21 మిలియన్ డాలర్లు భారత్‌లో ఓటర్ల భాగస్వామ్యం పెంచే చైతన్యకార్యక్రమానికి వినియోగించినట్లు తేల్చింది. బిజెపికి చెందిన అమిత్ మాలవీయతోపాటు నలిన్‌కోహ్లీకూడా అమెరికా ఏజెన్సీ భారత్‌లో ఎన్నికల పనులకని 21 మిలియన్ డాలర్లు ఎందుకు ఇచ్చిందని ప్రశ్నించడంతోపాటు భారత ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవడమేనని అన్నారు. అయితే 2010 నుంచి 2012మధ్యకాలంలో పనిచేసిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎస్‌వై ఖురేషి ఈ క్లెయిమ్‌లను ఖండించారు. బిజెపి నేతల వ్యాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకించారు. అంతర్జాతీయ స్థాయిలో ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయడం, మరింత పటిష్టంచేయడం వంటి వాటితోపాటు ఐఎఫ్ఆఎస్ వంటి సంస్థలతో ఎంఒయులు జరిగాయని, అవి ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయని వనరులను శక్తివంతం చేయడంకోసం ఈ నిధులు వెచ్చిస్తాయన్నారు. యుఎస్ఎయిడ్ ఇచ్చిన నిధుల్లో ఎక్కువ శాతం రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలోని స్వచ్ఛంద సంస్థలు రాజీవ్‌గాంధీ ఫౌండేషన్‌కే వెళ్లాయని ఆరోపించారు.

డోజ్ సంస్థ బం గ్లాదేశ్‌కు కూడా 29 మిలియన్ డాలర్లు ఇచ్చినట్లు ప్రకటించింది. వీటిని కూడా రద్దుచేస్తామని ప్రక టించారు. తనను గద్దెనుంచి దించేందుకు విదేశీ శక్తుల హస్తం ఎంతో పని చేసిందని, ఒక ద్వీప్ కల్పం అప్పగించనందుకు అమెరికా తనను గద్దె నుంచి దించే కుట్రలు చేసిందని బంగ్లా మాజీ ప్రధాని హసీనా ఆరోపించిన సంగతి తెలిసిందే. ఇపుడు డోజ్ సంస్థ ప్రకటించిన నిధుల జాబితా తనను గద్దెదించేందుకు వినియోగించారని ఆమె ఆరోపించారు.



# మహాయుతిలో తారస్థాయికి చేరిన లుకలుకలు!



**ముంబయి, ఫిబ్రవరి 21:** మహాయుతికూటమిలో అంతర్గత విభేదాలు పెరిగి పోతున్నాయి. అందుకు అనుగుణంగానే జరుగుతున్న కొన్ని సంఘటనలు ఇందుకు ఊతం ఇస్తున్నాయి. ప్రత్యేకించి డిప్యూటి సిఎం ఏక్‌నాథ్‌షిండే, ముఖ్యమంత్రి దేవేంద్రఫడ్నవిస్‌లమధ్య దూరం పెరుగుతూ వస్తోంది. బిజెపి ఆధ్వర్యంలోని మహాయుతిలో బిజెపితోపాటు ఎన్సీపీ అజిత్ పవార్, ఏక్‌నాథ్‌షిండే శివసేనలు మిత్రులుగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. బిజెపి అద్వితీయ మెజార్టీతో గెలిచినప్పటికీ అజిత్, షిండేలకు డిప్యూటి సిఎంలు కేటాయించిన బిజెపి హైకమాండ్ వీరిమధ్య చోటుచేసుకుంటున్న విభేదాలను మాత్రం సర్దుబాటు చేయలేకపోతోంది. నాయకులను బుజ్జగించలేకపోతోంది. తాజాగా ప్రభుత్వపరంగా ఏర్పాటు అయిన మూడు అధికారిక కార్యక్రమాల్లో ఏక్‌నాథ్‌షిండే పాల్గొనడకపోవడం నేతలమధ్య పొరపొచ్చాలు మరింతపెరుగుతున్నట్లు సూచిస్తోంది. థాణెజిల్లా బద్లాపూర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహం ప్రారంభం కార్యక్రమంలో డిప్యూటిసిఎం ఏక్‌నాథ్‌షిండే పాల్గొనలేదు. మరాఠా కింగ్ జయంతి కార్యక్రమాల్లోను ఆయన పాల్గొనకపోవడం విభేదాలు మరింత పెరుగుతున్నాయి. అలాగే అంబేగాంవ్ బుద్రక్‌లో జరిగిన శివశృతి కార్యక్రమానికి కూడా రాలేదు. అలాగే ఆగ్రాఫోర్ట్‌లోజరిగిన చరిత్రాత్మక కార్యక్రమంలో కూడా షిండే పాల్గొనలేదు. ఈ మూడు కార్యక్రమాల్లోను ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ పాల్గొన్నారు. రానురాను ఈ విభేదాలు మరింత తారస్థాయికి చేరాయి. శివసేనకు చెందిన ఎమ్మెల్యేలకు వై కేటగిరీ సెక్యూరిటీ కవర్‌ను మహారాష్ట్రప్రభుత్వం ఉపసంహరించింది. హోంశాఖ ముఖ్యమంత్రి ఫడ్నవిస్ చేతుల్లోనే ఉండటం ఇందుకు మరింత కారణం అయింది. ఈ చర్యతో శివసేన షిండేవర్గం తీవ్రంగా కలతచెందింది. 44 మంది ఎమ్మెల్యేలు, 11 మంది లోక్‌సభ ఎంపిలకు 'వై'కేటగిరీ భద్రతను కల్పించారు. ఆనాడు షిండే వర్గీయులు కావడంతో వీరిపై దాడులుజరగవచ్చన్న భావనతో వారికి భద్రతపెంచడంతోపాటు కీలకమైనవారికి కేబినెట్ బర్త్‌లు కూడా ఇచ్చారు. ఆనాడు ముఖ్యమంత్రి హోదాలో ఎన్నికల్లో ప్రధానంగా లడ్కీబహిన్‌యోజన వివాదాలను పెంచింది. ఈ పథకానికి ముందు ముఖ్యమంత్రి అన్న పదాన్ని ఎన్సీపీ అజిత్‌వర్గం తన ప్రచార సామగ్రిలో తొగించింది. ఎన్సీపీ నేత అదితి తత్కారే, బిజెపి గిరీష్‌మహాజన్‌లను నాసిక్, రాయ్‌గడ్ ఇన్‌ఛార్జి మంత్రులుగా నియమించడం కూడా వివాదాన్ని మరింతపెంచింది. 2027 నాసిక్ కుంభమేళా సమీక్షాసమావేశానికి కూడా షిండే గైర్హాజరు అయ్యారు. సీనియర్ బిజెపి నాయకుడు ఆశీష్ షేలార్ మాట్లాడుతూ ఎలాంటి అసమ్మతి, అసంతృప్తిలేదని ప్రభుత్వం సజావుగా నడుస్తోందని, ఏకతాటిపై కూటమి పయనిస్తోందని ప్రకటించారు. షిండే కూడా పైపైకి ఎలాంటి కోల్డ్‌వార్ తమమధ్యలేదని చెప్పలేక చెపుతూ రావడంచూస్తుంటే మహాయుతిలో మహా లుకలుకలు బయలుదేరాయని స్పష్టం అవుతోంది.

# రాత్రికి రాత్రే బెంగళూరు నగరాన్ని మార్చేయలేం..

## కర్ణాటక డిప్యూటీ సిఎం వివాదాస్పద వ్యాఖ్యలు



**బెంగళూరు, ఫిబ్రవరి 21:** డిప్యూటి ముఖ్యమంత్రి డికెశివకుమార్ బెంగళూరును సాక్షాత్తూ దేవుడే దిగివచ్చినా బాగుచేయలేడని చేసిన వ్యాఖ్యలు ఇపుడు రాజకీయంగా పెద్ద దుమారం రేపాయి. ఇటు నగరవాసులు రాజకీయ పార్టీల నాయకులు ఆయనపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. బెంగళూరు నగరాన్ని రాత్రికి రాత్రే మార్చేయలేం. ఈ మహానగరం ఏ రెండేళ్లకో, మూడేళ్లకో మారదు. ఒకవేళ దేవుడే తలుచుకున్నా అది సాధ్యపడదు. నగరం బాగుచేయాలంటే ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో జరగాలి అని ఒక వర్క్‌షాపులో శివకుమార్ అన్నారు. సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా బెంగళూరులోట్రాఫిక్‌జామ్ వాహనదారులకు నిత్యం నరకం చూపిస్తుంటుంది. ఈ మధ్యకాలంలో అది మరీపెరిగిపోవడంతోపలువురు మేధావులుకూడా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో స్వయంగా డిప్యూటిసీఎం వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో ప్రజల్లో అసహనం పెరిగింది. ఆయన మంత్రి అయి రెండేళ్లు అవుతోందని బలమైన నేతగా మీకు ఆహ్వానం పలికాం కానీ మా బతుకులు బలహీనంగా మారుతున్నాయని ప్రముఖ ఆర్థికవేత్త ఆరిన్‌కేపిటల్ ఛైర్మన్ మోహన్ దాస్‌పాయ్ విమర్శించారు. ఫుట్‌పాత్‌ల పరిస్థితి సజావుగాలేదని, ఐదువేల కొత్త ఎలక్ట్రిక్ బస్సులు అవసరమని మెట్రోరైలు విస్తరించాలని మోహన్ దాస్ అన్నారు. బ్రాండ్ బెంగళూరు అంటూ నినాదం ఇచ్చిన వ్యక్తి ఈరోజు దేవుడుకూడా సరి చేయలేడంటూ వ్యాఖ్యానించడం దురదృష్ట కరమని బిజెపి వాదిస్తోంది. ప్రజలకు సేవచేసే అవకాశం దేవుడు ఇస్తే ఈప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందని బిజెపినేత మోహన్‌కృష్ణ విమర్శించారు. ఈ విమర్శలపై డికెఎస్ స్పందిస్తూ బెంగళూరు నగర సమస్యలను పరిష్కరించే బాధ్యతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇప్పటికే నగరంలో కొత్తరోడ్లనిర్మాణం, ట్రాఫిక్ సమస్యను తప్పించే ప్రణాళికతోకూడిన మినీ బుక్‌ను విడుదల చేసామని చెప్పారు.



## టెన్త్ విద్యార్థుల ఘర్షణ: కాల్పుల్లో ఒకరు మృతి

**పాట్నా, ఫిబ్రవరి 21:** పదో తరగతి పరీక్షల్లో చీటింగ్ జరిగిందంటూ వచ్చిన ఆరోపణలు విద్యార్థుల మధ్య తీవ్ర ఘర్షణకు దారి తీశాయి. దీంతో రెచ్చిపోయిన విద్యార్థులు ఏకంగా తుపాకులతో కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులకు గాయాలు కాగా అందులో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. బీహార్‌లోని రోహ్‌తాస్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. రోహ్‌తాస్‌లోని సాసారామ్ పట్టణంలో నిర్వహించిన పదోతరగతి పరీక్షల్లో చీటింగ్ జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. ఇందుకు సంబంధించి ఫిబ్రవరి 19న విద్యార్థుల మధ్యవివాదం చోటుచేసుకుంది. మరుసటిరోజు గ్రూపులుగా విడిపోయిన విద్యార్థులు భౌతిక దాడులకుపాల్పడ్డారు. ఈ క్రమంలో తుపాకులతో కాల్పులకు తెగబడ్డారు. న్యాయం చేయాలని డిమాండ్‌చేస్తూ బాధిత విద్యార్థి కుటుంబసభ్యులు, గ్రామస్థులు మృత దేహంతో జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. సాసారామ్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. దీంతో భారీ సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. అటు విద్యార్థులు చికిత్స పొందుతున్న స్థానిక మెడికల్ కాలుజీ ఆసుపత్రి వద్ద కూడా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఒక్కరోజు కాకుండానే మాపై విమర్శలా?

## మాజీ సిఎం విమర్శలు తిప్పికొట్టిన ఢిల్లీ సిఎం రేఖాగుప్తా



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** బిజెపి ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చలేదంటూ ఢిల్లీమాజీ సీఎం అతిశి చేసిన విమర్శలను కొత్త సీఎం రేఖాగుప్తా కొట్టిపారేసారు. కాంగ్రెస్ 15 ఏళ్లు, ఆప్ 13 ఏళ్లు ఢిల్లీని పాలించాయి. ఇన్నేళ్లపాటు మీరేం చేసారో చూసుకోకుండా అధికారంలోకి వచ్చి ఒక్కరోజుకూడా కాని మాపై విమర్శలు చేస్తున్నారేమిటి? మొదటిరోజే మేం కేబినెట్ సమావేశం నిర్వహించాం. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయుష్మాన్‌భారత్‌యోజనను అందుబాటులోకి తెచ్చాం. దాంతో ప్రజలకు రూ.10 లక్షల మేర వైద్యసహాయం అందనున్నది. ఈపథకాన్ని ఆప్ అమలుచేయలేదు. మమ్మల్ని ప్రశ్నించే హక్కు వారికిలేదు. ప్రధాని మోడీ నాయకత్వంలో ఢిల్లీ తన హక్కులన్నీ సాధిస్తుందని ముందు మీరు మీ పార్టీగురించి చూసుకోండి అని హితవు పలికారు. ఎంతో మంది మీ పార్టీని వీడాలని ఆసక్తితో ఉన్నారు. కాగ్ నివేదికను అసెంబ్లీలోపెడితే అందరి జాతకాలు బయటపడతాయని ఆందోళన చెందుతున్నారని రేఖ దుయ్యబట్టారు. మహిళలకు రూ.2500 నెలనెలా ఆర్థిక సాయం అందించేపథకం మొదటి కేబినెట్ సమావేశంలో ఆమోదిస్తామని బిజెపి హామీ ఇచ్చిందని కానీ మొదటిరోజే ఉల్లంఘించిందని అతిశి విమర్శించారు. అయితే రేఖాగుప్తామాత్రం మహిళా దినోత్సవం మార్చి 8 నాటికి అర్హులైన మహిళల బ్యాంకు ఖాతాల్లో నెలవారీ ఆర్థికసాయం రూ.2500 జమచేస్తామని తెలిపారు. ఢిల్లీ అభివృద్ధికోసం ఒక్కరోజును కూడా వృథా చేయనని ఆమె అన్నారు. పెండింగ్‌లో ఉన్న 14 కాగ్ నివేదికలను అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే ప్రవేశపెడతామని చెప్పారు.




## టారిఫ్‌ల దెబ్బకు బ్రిక్స్ మాటే వినిపించట్లేదు..

### కూటమిదేశాలపై ట్రంప్ వ్యంగ్యోక్తులు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 21:** బ్రిక్స్ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ కొంతకాలంగా గుర్రుగా ఉన్నారు. కూటమి దేశాలపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ప్రపంచ రిజర్వు కరెన్సీగా అమెరికన్ డాలర్‌స్థానంలో వేరే కరెన్సీ తెచ్చేందుకు ప్రయత్నిస్తే 150శాతం సుంకాలు విధిస్తామని పలుమార్లు తీవ్రంగా హెచ్చరించారు. తాజాగా బ్రిక్స్‌దేశాలపై మరోసారి ఆయన నోరుపారేసుకున్నారు. సుంకాలు విధిస్తామనగానే బ్రిక్స్ చెల్లాచెదురైపోయిందని వ్యంగ్యోక్తులు విసిరారు. బ్రిక్స్ దేశాలు డాలర్‌ను నాశనం చేయాలని చూస్తున్నాయని అందుకు ప్రయత్యామ్నాయంగా కొత్తకరెన్సీని సృష్టించాలనుకున్నాయని, డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని తీసుకొస్తే బ్రిక్స్‌పై 150శాతం సుంకాలు వేస్తామని తాను చెప్పగానే అందులోని దేశాలు పరస్పరం దూరం జరిగాయని తర్వాత ఆకూటమి మాటే వినిపించడంలేదని ట్రంప్ అన్నారు. ఇప్పటికే ట్రంప్ బ్రిక్స్ కూటమిపై ఘాటుగా స్పందించారు. బ్రిక్స్ ఒక చెడు ప్రతిపాదన తెచ్చిందని దీన్ని ఎవరూ అంగీకరించరని, డాలర్‌తో ఆటలాడితే 150శాతం సుంకాలు విధిస్తానని చేసిన హెచ్చరికతో ఆ ప్రతిపాదన గురించి మాట్లాడేందుకుసైతం భయపడుతున్నారన్నారు. తాను ఈ వ్యాఖ్యలుచేసిన వెంటనే బ్రిక్స్ అంతం అయిందన్నారు. అంతర్జాతీయ వాణిజ్యంలో కానీ మరేప్రాంతంలో అయినా కానీ అమెరికన్ డాలర్‌ను భర్తీచేసే అవకాశం బ్రిక్స్‌కు లేదని ఒకవేళ ఏదేశం అయినా ప్రయత్నిస్తే సుంకాలకు హాలోచెప్పి అమెరికాకు గుడ్‌బై చెప్పాల్సివస్తుందన్నారు. బ్రిక్స్‌కు ఉమ్మడి కరెన్సీ ఏదీ లేనప్పటికీ ఉక్రెయిన్‌తో ఉద్ధం అనంతరం అనేక పశ్చిమ దేశాలనుంచి రష్యా ఆంక్షలను ఎదుర్కొనడంతో ఈ అంశంపై చర్చలు భారీగా సాగాయి.



# కేంద్రం ఏ భాషను నిర్బంధం చేయలేదు..

## స్టాలిన్ లేఖపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** కేంద్ర ప్రభుత్వం ఏ భాషను బలవంతంగా రుద్దడం లేదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. విదేశీ భాషపై అతిగా ఆధారపడటం వల్ల విద్యార్థులు భాషాపరమైన మూలాలను తెలుసుకోకుండా పరిమితం చేసినట్లవుతుందన్నారు. జాతీయ విద్యా విధానం ద్వారా ఈ పరిస్థితిని సరిచేసే ప్రయత్నం జరుగుతోందని మంత్రి ఎక్స్ వేదికగా వెల్లడించారు. తమిళ భాష శాశ్వతమని గతంలో ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యను ప్రస్తావించిన మంత్రి తమిళ సంస్కృతి, భాషను విశ్వవ్యాప్తం చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యను రాజకీయం చేయవద్దని విజప్తి చేశారు. మోడీకి తమిళనాడు సిఎం లేఖ రాసిన నేపథ్యంలో మంత్రి నుంచి ఈ స్పందన వచ్చింది. సమగ్రశిక్షా పథకంకింద రాష్ట్రానికి రూ.2,152 కోట్ల నిధులను వెంటనే మంజూరు చేయాలని ప్రధాని మోడీ ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కోరారు. ప్రధానికి రాసిన లేఖలో జాతీయ విద్యావిధానం - 2020ని పూర్తిగా అమలుచేసి త్రిభాషా విధానాన్ని ఆమోదించే వరకు తమిళనాడుకు సమగ్ర శిక్షా పథకం కింద నిధులు మంజూరు చేయబోమని కేంద్ర విద్యాశాఖ మంత్రి ఇటీవల వెల్లడించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రాష్ట్రంలోని విద్యార్థులు, రాజకీయ పార్టీలు, ప్రజల మధ్య ఆవేదన, ఆక్రోశం కలిగించిందని తెలిపారు. సమగ్ర శిక్షా పథకం కింద నిధులు మంజూరు చేయకపోతే ఉపాధ్యాయులకు వేతనం, విద్యార్థులకు సంక్షేమ పథకాలను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలు దెబ్బతింటాయన్నారు. 2024,25వ ఏడాదికి రాష్ట్రానికి అందాల్సిన రూ.2.152 కోట్లను వెంటనే మంజూరు చేయడానికి చర్యలు చేపట్టాలని కోరారు.



# దేశాల మధ్య వివాదాలు విచ్ఛిన్నానికి దారితీయెుద్దు

జి-20 విదేశాంగమంత్రుల సమావేశంలో కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్

**ప్రిటోరియా, ఫిబ్రవరి 21:** ఏ కోణంలో చూసినా ప్రపంచ రాజకీయ పరిస్థితి సంక్లిష్టంగానే ఉందని విదేశాంగమంత్రి జైశంకర్ పేర్కొన్నారు. రాబోయే కాలంలో కృత్రిమమేధ, ఎలక్ట్రిక్ వాహనాలు, అంతరిక్షం, డ్రోన్లు, గ్రీన్ హైడ్రోజన్ వంటి అంశాల్లో భౌగోళిక రాజకీయ పరిస్థితుల ప్రభావం కచ్చితంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం సంఘర్షణ పరిస్థితులు, ఆర్థిక ఒత్తిళ్లు, ఆహార భద్రత, కొవిడ్ మహమ్మారి సవాళ్లు, వాతావరణ ఆందోళనలను ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్నాయన్నారు. జి-20 మన ఆసక్తులు, సంస్కృతులు, దృక్పథాల వైవిధ్యాన్ని సంగ్రహిస్తుందన్నారు. దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న విదేశాంగ మంత్రి జి-20 విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సమస్యలను ఎదుర్కోవడంలో, ప్రపంచ దేశాల ఎజెండాను ముందుకు తీసుకువెళ్లడంలో జి-20 కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ సమాఖ్యను కాపాడుకోవడం ప్రపంచ దేశాల తక్షణ కర్తవ్యమని అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు వివాదాలుగా మారి విచ్ఛిన్నానికి దారితీయకూడదని పేర్కొన్నారు.

**ఉగ్రవాదానికి భారత్ వ్యతిరేకం:** పశ్చిమాసియా ఘర్షణలు, సముద్ర భద్రత, ఉక్రెయిన్ వివాదం, ఇండో-పసిఫిక్, యుఎన్ సంస్కరణలపై భారతదేశ వైఖరిని జైశంకర్ తెలిపారు. గాజా కాల్పుల విరమణ, బందీల విడుదలను దేశం స్వాగతిస్తోందని అన్నారు. భారత్ ఎప్పుడూ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించదని, మానవతా సహాయానికి మద్దతు ఇస్తుందని పునరుద్ఘాటించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఘర్షణలు నెలకొంటున్న ఆయా ప్రాంతాల్లో శాంతి, సుస్థిరత నెలకొనడం ప్రపంచ దేశాలకు చాలా అవసరమని అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ప్రపంచదేశాలు ఒకదానికి ఒకటి సహాయ,సహకారాలు అందించుకోవాలని, అంతర్జాతీయ చట్టంప్రకారం కుదుర్చుకున్న ఒప్పందాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. రష్యా-ఉక్రెయిన్ వివాదంపై జైశంకర్ మాటాడుతూ యుద్ధం నివారించడానికి ఇరుదేశాల అధినేతలు చర్చల్లో పాల్గొనాలని భారత్ చాలాకాలంగా సూచిస్తోంద న్నారు. భారత్ యుద్ధాన్ని ప్రోత్సహించదని, దౌత్యాన్ని సమర్థిస్తుందని పేర్కొన్నారు. ఈ సమస్యకు త్వరలో ముగింపు పలకాలని కోరుతున్నట్లు తెలిపారు.

# ఎఫ్‌బిఐ కొత్త డైరెక్టర్‌గా కాశ్‌పటేల్




**వాషింగ్టన్, ఫిబ్రవరి 21:** అమెరికా దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) డైరెక్టర్‌గా భారతీయ అమెరికన్ కాశ్ పటేల్ నియామకాన్ని గురువారం సెనెట్ ఆమోదించింది. ఈ నేపథ్యంలో కాశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికన్లకు హాని చేయాలని చూస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. 'ఎఫ్‌బిఐ తొమ్మిదో డైరెక్టర్‌గా నన్ను నియమించడం ఎంతో గౌరవంగా ఉంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, అటార్నీ జనరల్ పామ్ బోండికి కృతజ్ఞతలు. ఎఫ్‌బిఐకి ఎంతో ఘనచరిత్ర ఉంది. దేశ ప్రజలకు పాదర్శకంగా, జవాబు దారీగా ఉండేందుకు బ్యూరో కట్టుబడి ఉంది. దేశం గర్వించేలా ఎఫ్‌బిఐని పునర్నిర్మిస్తాం. అమెరికన్లకు ఎవరైనా హాని చేయాలని చూస్తే.. వారి అంతు చూస్తాం' అని ఆయన రాసు కొచ్చారు. ఇదిలా ఉండగా ఎఫ్‌బిఐ డైరెక్టరుగా కాశ్ పేరును అలస్కాకు చెందిన రిపబ్లికన్ తోపాటు పలువురు డెమోక్రట్లు వ్యతిరేకించారు. అయితే 51-49ఓట్ల తేడాతో ఆయన నియా మకం జరిగింది. దీంతో ఈ పదవిని చేపట్టిన తొలి హిందూ, భారతీయ అమెరికన్‌గా ఆయన నిలిచారు. అధ్యక్షుడు ట్రంప్‌నకు వీరవిధేయుడిగా కాశ్‌కు పేరుంది. పటేల్ కుటుంబ మూలాలు గుజరాత్‌లో ఉన్నాయి. ఆయన తల్లిదండ్రులు తూర్పు ఆఫ్రికాలో పెరిగారు. ఉగాండా నియంత ఈదీ ఆమిన్ బెదరింపుల కారణంగా అతడి తండ్రి అమెరికాకు వలస వచ్చారు. 1980లో న్యూయార్క్‌లోని గార్డెన్‌సిటీలో పటేల్ జన్మించారు. యూనివర్శిటీ కాలేజ్ లండన్‌లో న్యాయవిద్యను పూర్తి చేశారు. ఆ తర్వాత ఒక లా సంస్థలో పని చేయాలనుకున్నా కొలువు లభించలేదు. దీంతో ఆయన మియామీ కోర్టుల్లో పబ్లిక్ డిఫెండర్‌గా పనిచేసి వివిధ హోదాల్లో సేవలందించారు.

## వారణాసి సమీపంలో రోడ్డు ప్రమాదం

# కర్ణాటక బీదర్ వాసులు దుర్మరణం



**వారణాసి, ఫిబ్రవరి 21:** మహాకుంభమేళాకు వెళుతూ ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. భక్తులుప్రయాణిస్తున్న క్రూయిజర్ వాహనం లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదంజరిగింద.ఇ ప్రమాదంలో మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారణాసి జిల్లాలోని మీర్జామురారా పోలీస్ స్టేషన్ పరిధిలో ఈఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన ప్రాంతానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం సమీప ఆసుపత్రులకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం బీదర్‌జిల్లాలోని లడగేరి ప్రాంతానికి చెందిన 14 మందిక్రూయిజర్ జీపులో మహాకుంభమేళాకు బయలుదేరారు. వారి వాహనాన్ని యుపిలోని వారణాసి జిల్లా మీర్జాము రారా పోలీస్ స్టేషన్‌పరిధిలో రూపా పూర్‌గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో క్రూయిజర్ జీపు లోని ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్ సహా మిగతా ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు.

## ట్రక్కును ఢీకొట్టిన బస్సు: నలుగురు మృతి, 30 మందికి గాయాలు



**కచ్(గుజరాత్), ఫిబ్రవరి 21:** కచ్‌జిల్లాలోని ముంద్రా ప్రాంతంలో ఒక ప్రయాణీకుల బస్సు, ట్రక్కు ఢీకొన్న సంఘటనలో నలుగురు మృతిచెందారు. మరో 30మందివరకూ తీవ్రగాయాలపాలయ్యారు. బస్సులో ప్రమాద సమయానికి 40 మందిప్రయాణిస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన వారందరినీ సమీపంలోని ఆసుపత్రికి తరలించామని కచ్ ఎస్‌పి తెలిపారు. గత వారంలో కూడా ఒక టూరిస్టు వ్యాన్ ప్రయాణీకులతో మహాకుంభ్‌నుంచి తిరిగివస్తుండగా ఒక స్టేషనరీతో వెళుతున్న ట్రక్కును హైవేపైనే ఢీకొట్టింది. దాహోద్‌జిల్లాలో ఈసంఘటన జరిగింది. ఆ ప్రమాదంలో కూడా నలుగురు చినపోగా ఆరుగురు తీవ్రగాయాల పాలయ్యారు. ప్రస్తుతం ముంద్రా ప్రమాదంలో గాయపడిన అందరినీ వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



- పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలు రీఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం
- ప్రజా సమస్యలు పరిష్కరించటం ఉద్యోగుల ముఖ్యమైన బాధ్యత
- రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీరాంప్రసాద్ సిసోడియా

**నెల్లూరు, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త** - కలెక్టరేట్ శుక్రవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో పిజిఆర్ఎస్ , రెవెన్యూ సదస్సులు, రీ సర్వే, భూ ఆక్రమణలు, భూ సంబంధిత కోర్టు కేసులు తదితర అంశాలపై జిల్లాలోని ఆర్డీవోలు, తాసిల్దార్లతో సమీక్ష చేశారు. ఈ సమీక్ష సమావేశంలో సిసోడియా మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలు రీ ఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా అర్జీలను పూర్తి స్థాయిలో విచారణ చేసిన తరువాత మాత్రమే డిస్పోస్ చేయాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చే అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అన్నారు. .సమస్యలతో వచ్చే అర్జీదారులను వెయిట్ చేయించకుండా వారి పట్ల గౌరవ మర్యాదలతో వ్యవహరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కరించటం ఉద్యోగుల ముఖ్యమైన బాధ్యతని ఆయన పేర్కొన్నారు. రీసర్వే చేసిన భూముల కొలతలతో చిన్న చిన్న తేడాలుంటే రైతులను పిలిపించి నచ్చజప్పి వీలు ఉన్నంతవరకు పరిష్కారం చేయాలని అధికారులకు సూచించారు. భూములు ఆక్రమణ గురైతే ఆక్రమణలు తొలగించి మరల ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టకుండా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు సకాలంలో అందించాలన్నారు.

చుక్కల భూముల విషయంలో ప్రత్యేక డ్రైవ్ పెట్టాలని సూచించారు. రెవెన్యూ రికార్డులన్నీ డిజిటలైజేషన్ చేయాలన్నారు.

కోర్టు కేసులను తేలికగా తీసుకోకుండా వాటికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి కౌంటర్ అఫిడవిట్లు ఫైల్ చేయాలన్నారు. నెల్లూరు జిల్లా తీర ప్రాంతంలో ఉంది కాబట్టి ప్రకృతి వైపరీత్యాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, కమ్యూనికేషన్ ప్లాన్ పక్కాగా రూపొందించుకోవాలని ఉన్నారు. జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ మాట్లాడుతూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాల ప్రకారం సమస్యలు పరిష్కారం నాణ్యతగా ఉండేటట్లు చూస్తామని ,అఫిడవిట్ల ఫైల్ చేయడంలో జాప్యం లేకుండా ఆర్డీవో తాసిల్దారులకు ఆదేశాలు ఇస్తామని లీగల్ సెల్ ఏర్పాటు చేసి కేసుల సత్వర పరిష్కారం చర్యలు తీసుకుంటామని ప్రధాన కార్యదర్శి జెసి వివరించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్, సూర్యతేజ, సబ్ కలెక్టర్ పూజ,డీఆర్ఓ జె.ఉదయ భాస్కర రావు, కావలి, ఆత్మకూరు ఆర్ డీ ఓ లు జిల్లా సర్వే అధికారి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# గజపతినగరంలో దొంగల హల్‌చల్

**గజపతినగరం (విజయనగరం జిల్లా) ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** విజయనగరం గజపతినగరం పట్టణంలో గురువారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఒకేసారి ఎనిమిది వేర్వేరు షాపుల్లో భారీ చోరీకి పాల్పడ్డారు. సుమారు రెండు లక్షల నగదు, ఎనిమిది లక్షల రూపాయల విలువ గల వస్తువులు దొంగలు అపహరించుకుపోయారు. దీంతో గజపతినగరం ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దొంగలు ఒకే రోజు ఈ తరహా దొంగతనానికి పాల్పడటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసు స్టేషన్‌కి కూత వేటు దూరంలో హైవేపై గల ఈ ఎనిమిది దుకాణాల్లో ఒకేసారి దొంగతనాలు జరగడం పోలీసుల వైఫల్యమేనని స్థానికులు విమర్శిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి ఒంటిగంట, మూడున్నర గంటల మధ్య దొంగలు ఈ చోరీకి పాల్పడినట్లు సిసి పుటేజీ ఆధారంగా తెలుస్తోంది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే 26వ నెంబర్ జాతీయ రహదారిపై గల సూపర్ ఎం మార్ట్, వెంకి మొబైల్స్, మినీ డిమార్ట్‌లతో పాటు మెంటాడ రోడ్డులో గల ఆర్కే ఫ్యామిలీ మార్ట్, హాసిని బట్టల దుకాణం, షూ మార్ట్‌తో పాటు మరో రెండు దుకాణాల్లో షట్టర్లు లేపి దొంగలు లోపలకు ప్రవేశించారు. దొరికినదంతా దోచుకుపోయారు. ప్రధానంగా వెంకి మొబైల్స్ దుకాణంలో లక్షా యాభై వేల నగదు, ఐదు లక్షల రూపాయల విలువ చేసి సెల్ ఫోన్లు, ఆర్కే ఫ్యామిలీ మార్ట్‌లో ఇరవై వేల రూపాయలు నగదు, కొంత సామాగ్రి దొంగిలించుకుపోయినట్లు ప్రాథమిక సమాచారం. ఈ వరుస దొంగతనాల నేపథ్యంలో వ్యాపారుల్లో సైతం అభద్రతా భావం, భయాందోళనలు నెలకొన్నాయి.



సంఘటన స్థలాలను పరిశీలిస్తున్న బొబ్బిలి డిఎస్పీ భవ్యరెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిపివి రమణ

శుక్రవారం ఉదయం స్థానికులు కొందరు దుకాణాల షట్టర్లు తెరిచి ఉండటం గమనించి సంబంధిత యజమానులకు సమాచారం అందజేయడంతో ఈ దొంగతనాల విషయం బయటకు వచ్చింది. ఆ తరువాత పోలీసులకు దుకాణాల యజమానులు సమాచారం అందజేయడంతో ఎస్.ఐ లక్ష్మణరావు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సహాయంతో దర్యాప్తు ప్రారంభించారు. ఆ తరువాత బొబ్బిలి డిఎస్పీ భవ్యరెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిపివి రమణ సంఘటన స్థలాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దుకాణ యజమానులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఫైబర్ నెట్ ఛైర్మన్ జీవీరెడ్డి ఆరోపణలపై వివరణ కోరిన మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఫైబర్ నెట్ ఛైర్మన్ జీవీరెడ్డి చేసిన ఆరోపణలపై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారుల నుంచి వివరణ కోరారు. ఆ సంస్థ ఎండీ దినేష్ కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ లతో ఆయన సచివాలయంలో సమావేశమై ఈ అంశాలపై ఆరా తీశారు. ఏపీ ఫైబర్‌నెట్ సంస్థను పూర్తిగా కనుమరుగు చేసేలా అధికారులు కుట్రలు పన్నుతున్నట్లు అనుమానం వ్యక్తమవుతోందని ఆ సంస్థ ఛైర్మన్ జీవీ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎండీ దినేష్ కుమార్ ఏపీ ఫైబర్‌నెట్ సంస్థను చంపేయాలనుకుంటున్నారని తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. ఫైబర్‌నెట్‌లో ఉన్నత ఉద్యోగులు రాజద్రోహానికి పాల్పడుతున్నారని జీవీ రెడ్డి ఆరోపించారు.

గత ప్రభుత్వానికి సహకరించే విధంగా వారి వ్యవహార శైలి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్క పైసా ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టకపోగా, సంస్థకు నష్టం కలిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నారని జీవీరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయన ముగ్గురు ఉన్నతాధికారులను తొలగిస్తున్నట్లు ప్రకటించారు. సంస్థ నష్టపోయిన ఆదాయాన్ని అధికారుల నుంచే రాబట్టేలా ప్రభుత్వాన్ని కోరతానన్నారు. ముఖ్యంగా ఏపీ ఫైబర్‌నెట్ ఎండీ దినేష్‌రెడ్డిపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఫైబర్‌నెట్ సంస్థలో జరుగుతున్న అవకతవకలు, ఉద్యోగుల పనితీరుపై ఆ సంస్థ ఛైర్మన్ జీవీ రెడ్డి చేసిన ఆరోపణలపై శనివారం సాయంత్రంలోగా రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఎండీ దినేష్‌కుమార్‌ను ఆదేశించారు. మరోవైపు ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సమర్పించాలని ఏపీఎఫ్ఎస్ఎల్ ఛైర్మన్ జీవీరెడ్డికి కూడా మంత్రి కార్యాలయం లేఖ రాసింది. అయితే రెండు రోజుల్లోగా మొత్తం ఆధారాలు సమర్పిస్తానని జీవీ రెడ్డి మంత్రికి తెలియజేశారు.

# ఉత్తమ పోలీసు అధికారులకు సిఎం చంద్రబాబు అభినందన



అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎపి పోలీసు అధికారులతో ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి**హ అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎపి పోలీసు అధికారులను ఎక్స్ వేదిక ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అభినందించారు. జార్ఖండ్ రాజధాని రాంచిలో ఆరు రోజుల పాటు 68వ అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్‌లో సత్తా చాటి నాలుగు స్వర్ణపతకాలు, ఒక రజత పతకం, రెండు కాంస్య పతకాలు సాధించడంతో పాటు టీం విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి పతకాల పట్టికలో ద్వితీయ స్థానంలో నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. వ్యక్తిగత విభాగంలో మూడు స్వర్ణ పతకాలసాధించిన రికార్డ్ సృష్టించిన ఎస్ఐ కె.కృష్ణమూర్తికి

ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఇక జాతీయ స్థాయిలో డ్యూటీ మీట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎపి పోలీసు అధికారులన డిజిపి హరీష్ కుమార్ గుప్తా అభినందించారు.

మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో వారందరిని డీజీపీ సముచిత రీతిన సత్కరించారు. కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలకు చెందిన 24 టీమ్‌లు పాల్గొనగా, డిఐజి కె.కె.ఎస్ అంబురాజన్ నేతృత్వంలోని అధికారులతో కూడిన బృందం పాల్గొందని తెలిపారు.

# శివరాత్రి బ్రహ్మోత్సవాలలో ఒక్కో రోజుకు ఒక్కో వాహనం

**(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)**

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలంటే ఎన్నో వింతలు,ప్రతి రోజు ఓ వాహన సేవను నిర్వహిస్తారు. అయితే ఈ వాహనాలనే ఎందుకు వాడుతున్నారన్నది దేవస్థానం నిర్వాహకులు వివరిస్తూ వాహన మండపం వద్ద సమాచారం అందిస్తే బాగుంటుంది. ప్రతి రోజూ ఏదో వాహనంపై స్వామి అమ్మవార్లు వస్తారు. దర్శించుకుంటున్నామనే భావనేతప్ప ఈ వాహనంపై స్వామి అమ్మవార్లు ఎందుకు వస్తున్నారనే విషయం పలువురికి తెలియదు. అయితే స్థానిక అర్చకుల కథనం మేరకు వాహనాలకు సంబంధించిన సమాచారం ఇలా ఉంది. దేవతల్ని త్రిపురాసురుడనే రాక్షసుడు ఇక్కట్లు పెడుతున్నట్లు చెబుతున్నారు. వారి తపస్సులకు భంగం కల్గిస్తూ ఆధ్మాతిక కార్యక్రమాలను జరగనివ్వకుండా ఇబ్బందులు పెడుతుంటే ఆతన్ని సంహరించే శక్తి ఒక్క శివునికే ఉందని భావించిన ఋషులు దేవ దేవుని వేడుకున్నట్లు స్థలపురాణంలో పేర్కొన్నారు. మహాశివరాత్రి పది రోజులు ఒక్కొక్కరోజుకు ఒక్కొక్క ప్రధాన్యత ఉంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మొదటి రాత్రిని దేవరాత్రి అంటారు. త్రిపురాసురుని సంహరించుటకు సముద్రంలో అమృతమథనం కోసం దేవతలందరూ సమావేశమై తమను త్రిపురాసురుని బాధ నుంచి కాపాడేది ఒక్క కైలాసనాథుడే అని చర్చించు కోవటాన్ని దేవరాత్రి అంటారు. హాలాహాలాన్ని ముక్కంటీశుడు భక్షించి దేవతలకు అమృతం పంచిన రాత్రి అనికూడా అంటారు.దేవతలందరూ సమావేశమై నిర్ణయించు కోవటానికి దేవరాత్రి అంటారు. అంటే శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు ధ్వజారోహణం సందర్భంగా స్వామిని దేవతలు వేడుకోవటాన్ని వివరిస్తారు. ఆ రోజు స్వామి వారు వెండిపల్లకిలో దర్శన మిస్తారు. త్రిపురాసురుడు ఒక్క దేవతల్నే కాకుండా అన్ని వర్గాల వారిని వేధిస్తూ అల్లకల్లోలం సృష్టించటంతో ప్రకృతి ఆతని బారి నుంచి ఎలా



ఉత్సవాలకు సిద్ధమైన బంగారు వాహనాలు

బయటపడాలనే యోచన చేస్తున్నట్లు చెబుతారు. రెండవ రాత్రిని భూత రాత్రి అంటారు. భూతాలందరూ సమావేశమై తమ ఆరాధ్యదైవంమైన ముక్కంటీశుని ప్రార్థించటాని న్న భూత రాత్రి అంటారు. భోళాశంకరుడు భూతనాదుడంటారు. కాబట్టి తమ నాధుని వేడుకునే రాత్రిని భూత రాత్రి అంటారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు భూత నాధుడు 'భూతకీ వాహనం'పై దర్శన మిస్తాడు శివునికోసం ఘోర తపమాచరించి వరాలు పొందిన రావణాసురుడు సామవేదానికి అధిపతి అంటారు.గంధర్వులందరూ సమావేశమై తమను త్రిపురాసురుని బారి నుంచి రక్షించాలని వేడుకునేందుకు తీర్మానించినట్లు చెబుతారు. ఈ సందర్భంగా రావణాసురుని దౌత్యంతో మూగజీవాలకు మోక్షమిచ్చిన ముక్కంటీశుని వేడుకోవటం అని అర్థం.ఈ రాత్రి ని గాంధర్వ రాత్రి అంటారు. అందుకు ఆ రోజు స్వామి 'రావణాసుర వాహనం'పై దర్శన మిస్తాడు. నాల్గవ రాత్రిని నాగరాత్రి అంటారు. నాగలోకంలోని నాగదేవతలందరూ సమావేశమై తమను త్రిపురాసురుడనే రాక్షసుని బారి నుంచి తప్పించాలంటూ తీర్మానం చేయటాన్ని నాగరాత్రి అంటారు. పాములను హారాలుగా ధరించిన పరమేశ్వరుని వేడుకునేందుకు సమావేశం కావటాన్ని నాట్యాలకు ప్రతీతిగా చెబుతారు. ఆ రోజు రాత్రి అర్థనారీశ్వరుడు 'శేషవాహనంపై' దర్శనమిస్తాడు. అన్ని వర్గాలు, సంస్థల అభ్యర్థన మేరకు సాగరమథనంలో మొదట వచ్చిన హాలా హాలాన్ని తాను మింగి పార్వతి దేవి ఒడిలో రెప్పకాలం పాటు విశ్రయించి నిద్రలేచిన సందర్భంగా శివయ్య మరణాన్ని జయించాడంటూ అన్ని వర్గాలు ఆనందో త్సాహాలతో సంబరాలు జరుపుకుంటారు.ధర్మస్వరూపుడు నంది.కాబట్టి నంది వాహనంపై కైలాసనాధుడు దర్శనమిస్తాడు.'నంది సేవ' అంటారు.

# రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షల హాల్‌టికెట్లు విడుదల

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ లో ఇంటర్మీడియట్ పరీక్షల హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. మార్చి 1, 3వ తేదీల నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్మీడియట్ పరీక్షల హాల్‌టికెట్లను వాట్సప్ గవర్నెన్స్ లో అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అదే విధంగా ఇంటర్మీడియట్ బోర్డు అఫీషియల్ వెబ్‌సైట్ నుంచి సైతం డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇటీవల ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను వాట్సప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయం కల్పించారు.ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. ఏపీలో ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1 నుంచి జరుగుతాయి. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మార్చి 1 నుంచి 19 వరకు, రెండవ సంవత్సరం పరీక్షలు మార్చి 3 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షల హాల్‌టికెట్లను వాట్సప్ గవర్నెన్స్‌లో అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులు వాట్సప్ ద్వారా నేటి నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించింది. ఫీజులు చెల్లించలేదని ప్రైవేటు కాలేజీలు హాల్‌టికెట్లు ఆపేయడం వంటి ఘటనలు జరగకుండా ఈ నిర్ణయం తీసుకుంది ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ కలిపి దాదాపు 10 లక్షలకు పైగా విద్యార్థులు ఉన్నారు. ఫీజులు చెల్లించలేదని ప్రైవేటు కాలేజీలు హాల్‌టికెట్లు ఆపేయడం వంటి ఘటనలు జరగకుండా వాట్సప్ లోనే హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకునేలా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పలు సేవలను ప్రభుత్వం అందిస్తోంది. వాట్సప్ నంబరు 9552300009 ద్వారా ఎంతో సింపుల్‌గా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పదో తరగతి విద్యార్థులు సైతం వాట్సప్ లోనే హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించాలని విద్యాశాఖ భావిస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన 9552300009 నెంబర్ కి మీ ఫోన్‌లో హాయ్ (హై) అనే వాట్సప్ లో మెసేజ్ చేయండి. సేవను ఎంచుకోండి అంటూ ఒక లింక్ వస్తుంది. ఆ లింక్ పై క్లిక్ చేస్తే అక్కడ కొన్ని సేవలు కనిపిస్తాయి. అందులో విద్య సేవలు అనే ఆప్షన్ ను సెలక్ట్ చేసుకోండి. అనంతరం ఇంటర్ ఫస్ట్ ఇయర్ లేదా సెకండ్ ఇయర్ హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకోండి అనే ఆప్షన్ ఉంటుంది.

ఇంటర్ ఫస్ట్ ఇయర్ స్టూడెంట్ అయితే పదో తరగతి హాల్‌టికెట్ నెంబర్ లేదా ఆధార్ నంబర్, పుట్టిన తేదీని ఎంటర్ చేసి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మీరు ఇంటర్ సెకండ్ ఇయర్ స్టూడెంట్ అయితే ఫస్ట్ ఇయర్ హాల్‌టికెట్ నంబర్ లేదా ఆధార్ నంబర్, పుట్టిన తేదీ ఎంటర్ చేయాలి.

కొద్ది నిమిషాల్లోనే మీ హాల్‌టికెట్ వాట్సప్ కే వచ్చేస్తుంది. దానిని డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్ తీసుకోవడమే. అంతే ఇలా ఎంతో సింపుల్ గా మీ ఫోన్ లోనే హాల్ టికెట్ ని డౌన్ లోడ్ చేసుకోవచ్చు.



# 2027 నాటికి దగదర్తి ఎయిర్‌పోర్ట్ పూర్తి

- అథారిటీ అధికారులతో కలిసి భూములను పరిశీలించిన ఎంపీ వేమిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కలెక్టర్ ఆనంద్

**దగదర్తి, (నెల్లూరు,) ఫిబ్రవరి 21, ప్రభాతవార్త** 2027 నాటికి దగదర్తి ఎయిర్‌ఫోర్ట్ పూర్తవుతుందని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం ఎయిర్‌ఫోర్ట్ అథారిటీ అధికారులతో ఎంపీ వేమిరెడ్డి, రాజ్యసభ్యులు బీద, ఎమ్మెల్యే దగుమాటిలు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిర్‌ఫోర్ట్ నిర్మాణంలో భూములు కోల్పోతునన్న రైతులకు, యువతకు ఉపాధి అవకాశం కలుగుతుందని అన్నారు. కృష్ణపట్నం పోర్టు, రామాయపట్నం పోర్టు అనుసంధానం చేస్తూ నెల్లూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌ఫోర్ట్ నిర్మాణంతో పెగనుందన్నారు. 2019లో దగదర్తి విమానాశ్రయం ఏర్పాటుకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు భూమి పూజ చేస్తే వైసీపీ పాలనలో అడుగు ముందు పడని పరిస్థితి నెలకొందన్నారు. 1379 ఎకరాల్లో ఎయిర్‌ఫోర్ట్ నిర్మాణానికి ప్లాన్ చేశారని, 700 ఎకరాల భూసేకరణ పూర్తయిందన్నారు. మిగిలిన భూసేకరణ కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఎయిర్ ఇండియా అధికారులు టెండర్లు డీపీఆర్ మొదలైన పక్రియలను పూర్తి చేయాలని కోరారు. అన్ని పనులు పూర్తయితే త్వరలో కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్‌మోహన్‌నాయుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పనుల శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావుల సహకారంతో త్వరలో కావలి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ రామ్‌మోహన్‌నాయుడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, తెలుగు వాడు కావడం ఎయిర్‌ఫోర్ట్ పనులు వేగవంతమయ్యాయి. ఒక్క రోజు వ్యవధిలో అధికారులను ఢిల్లీ నుంచి ఇక్కడికి పంపడం రామ్‌మోహన్‌నాయుడు చొరువ, ఇండోసెల్, బీపీసీఎల్ సహా అనేక కంపెనీలు నెల్లూరు వైపు అడుగులు వేస్తున్నాయి. గ్రామస్తులు ఇబ్బంది పడకుండా పరిశ్రమలు తీసుకురావడమే మా లక్ష్యం, ఎయిర్‌ఫోర్ట్ నిర్మాణం నెల్లూరు జిల్లా వాసుల చిరకాల కల అని టీడీపీ ఎన్డీఏలో భాగస్వామ్యం కావడం రాష్ట్ర అభివృద్ధికి బలంగా దోహదపడుతుందని, భూములు కోల్పోతున్న ఈ ప్రాంత అభివృద్ధికి రైతులు ఎంతగానో సహకరిస్తున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ ప్రస్తుతం మన దగ్గర ఉన్న భూములతో ఎయిర్‌ఫోర్టు పనులు ప్రారంభించవచ్చని, ఎయిర్‌ఫోర్ట్ భూముల సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని అన్నారు. వీరితో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



హైదారాబాద్‌లో చేతి ఉత్పత్తులు విక్రయిస్తున్న శ్రీకాకుళం వాసి, ఇన్‌సెట్‌లో చంద్రబాబు

# అతడి కథ ఒక స్ఫూర్తి దాయక జీవిత పాఠం: సిఎం చంద్రబాబు

- హ్యూమన్స్ ఆఫ్ హైదరాబాద్ పోస్టును షేర్ చేసిన సిఎం

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియా(ఎక్స్)లో ఆసక్తికర పోస్టును పంచుకున్నారు. ఓ వ్యక్తి శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్నో ఏళ్ల కిందట హైదరాబాద్ కు వలసవెళ్లి అక్కడే వెదురు బుట్టలు, విసనకర్రలు, కొబ్బరి ఆకులతో పలు ఉత్పత్తులు తయారు చేస్తూ జీవిస్తున్న వైనాన్ని హ్యూమన్స్ ఆఫ్ హైదరాబాద్ అనే సోషల్ మీడియా హ్యాండిల్ పోస్టు చేసింది. ఈ పోస్టును షేర్ చేసిన ఏపీ సీఎం చంద్రబాబు... ఇది ఒక స్ఫూర్తిదాయక జీవితపాఠం అని కొనియాడారు. అతడి కథను పరిశీలిస్తే కష్టించి పనిచేసే స్వభావం, ఏపీ వాణిజ్య స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని తెలిపారు. కానీ, అతడు సొంతగడ్డను వదిలి అవకాశాలను వెతుక్కుంటూ వేరే ప్రాంతానికి వెళ్లడం తనను విచారానికి గురిచేసిందని చంద్రబాబు పేర్కొన్నారు.ఏదేమైనా ఆ వ్యక్తి పనితనం, ఆశావహ దృక్పథం బాగా నచ్చాయని. తన కలలను, కళను కలగలిపి వస్తువులుగా మలిచి జీవనం సాగిస్తుండడాన్ని ప్రగాఢంగా అభిమాని స్తున్నానని వివరించారు. "ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని పునర్ నిర్మించడానికి, అవకాశాలను సృష్టించడానికి కృషి చేస్తోంది. ఆ వ్యక్తిలా నైపుణ్యం ఉన్న వారు స్వస్థలంలోనే ఉంటే ఎదిగేందుకు తోడ్పాటు అందిస్తామన్నారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించండి - డిఆర్ఎంను కలిసిన ప్రజా ప్రతినిధులు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త** గుంతకల్లు పట్టణంలో సుదీర్ఘకాలం అపరిష్కృతంగా ఉన్న పలు రైల్వే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీ నారాయణ,స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం,గుంతకల్లు మున్సిపల్ కమీషనర్ మొహమ్మద్ నయీమ్ అహ్మద్‌లు డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాను కోరారు. శుక్రవారం డిఆర్ఎం గుప్తాను కలిసిన వారు గుంతకల్లు పట్టణంలోని పలు రైల్వే బ్రిడ్జిల నిర్మాణం గురించి చర్చించారు. ఈ సందర్భంగా గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ పట్టణంలో ప్రధానంగా ధర్మవరం గేట్ ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని గత పాలకులు కేవలం రాజకీయ లబ్ది కోసం ప్రజలను మభ్యపెట్టి ఓట్లు సంపాదించుకునేందుకు టెంకాయలు కొట్టి ధర్మవరం గేట్‌ను అభివృద్ధి పనులు మొదలు పెట్టామని చెప్పుకున్నారని కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8నెలల్లోనే పట్టణంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుల సహకారంతో అభివృద్ధి పనులను మొదలు పెట్టామని తెలిపారు. అలాగే కసాపురం రోడ్డులోని రైల్వే బ్రిడ్జి ఎత్తును (హైట్) 5ఇంచులు పెంచి తొందరలోనే పనులు ప్రారంభించే కార్యక్రమం చేవట్టామని, హనుమాన్ సర్కిల్‌లో కూడా ఫ్లైఓవర్‌కి ప్రతిపాదనలు పంపామని ఖచ్చితంగా వీటన్నింటిని అభివృద్ధి చేసే బాధ్యత తాను,ఎంపి అంబికా లక్ష్మినారాయణ తీసుకుంటామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలిపారు. మున్సిపాలిటీకి రైల్వే శాఖ చెల్లించవలసిన బకాయిల గురించి వారు డిఆర్ఎం దృష్టికి తీసుకెళ్లారు. వీలైనంత మేరకు భూసేకరణకు సంబంధించిన రూ.1.85కోట్లను చెల్లించేందుకు డిఆర్ఎం సూచన ప్రాయంగా అంగీకరించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో తెదేపా నాయకులు నారాయణ స్వామి,మష్టారు భాస్కర్,క్రిష్ణారెడ్డి,మున్సిపల్,రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలపై డిఆర్ఎంను కలిసిన ఎంపి అంబిక,ఎంఎల్ఏ జయరాం

# కెసిఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై హైకోర్టులో పిల్ దాఖలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 21:** విపక్ష నేత, బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై హైకోర్టులో పిటిషన్ దాఖ లైంది. ఫార్మర్స్ ఫెడరేషన్‌కు చెందిన విజయ్‌పాల్‌రెడ్డి పిల్ దాఖలు చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకుంటే స్పీకర్ చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. కేటీఆర్ దీనిపై స్పందించి కేసీఆర్ బదులు వేరేవాళ్లను అక్కడ పోటీ చేయించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీలో ప్రజల కోసం పోరాటం చేయాలని కానీ అసెంబ్లీకే రాకుంటే అన ర్హుడిగా ప్రకటించాలని పిటిషన్‌లో తెలిపారు. 2023 డిసెంబరు 16న ప్రతిపక్ష నేతగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టారని, ఆయన ఇప్పటివరకు అసెం బ్లీకి రాకున్నా స్పీకర్ కానీ, ఆయన కార్యాలయం కానీ ఎలాంటి ప్రొసీడింగ్స్ చేపట్టలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రజల గొంతుకను అసెంబ్లీలో వినిపించేందుకు ఎమ్మెల్యేల జీతాలు కూడా పెంచారని, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ బాధ్యతలను నిర్వహించలేకపోతే ఆయనను ఆ బాధ్యతల నుంచి తొలగిం చాలని కోర్టును కోరారు. శాసన వ్యవస్థ, అధికారులు తీసుకునే రాజకీయ, ఆర్థిక నిర్ణయాలను సమీక్షించే అధికారం న్యాయ వ్యవస్థకు ఉందని చెప్పారు. ప్రతివాదులుగా కేసీఆర్, కేటీఆర్‌లతో పాటు స్పీకర్, స్పీకర్ కార్యాలయాన్ని చేర్చారు. ప్రస్తుతం ఈ పిటిషన్ రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది.

# రాజధాని అమరావతిలోని ఎన్ఆర్టీ సొసైటీ ఐకానిక్ టవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం కమిటీ

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలోని ఎన్ఆర్టీ సొసైటీ ఐకానిక్ టవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సారధ్యంలో తొమ్మిది మంది అధికారులతో ప్రాజెక్ట్ కమిటీ ఏర్పాటైంది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసే బాధ్యతలను కమిటీ అప్పగిస్తూ సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసారు. పెట్టుబడిదారులు,టెండర్లు,పెండింగ్ కేసుల పరిష్కారం తదితరంశాలను కమిటీ పర్యవేక్షిస్తుంది.

# ఇంజినీరింగ్‌లో పారిశ్రామిక ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి

**నాలుగేళ్లల్లో 160 క్రెడిట్‌లు.. అదనంగా మైనర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లకు 20 క్రెడిట్‌లు**

**ఇంజినీరింగ్ సిలబస్ సవరణల కమిటీ సిఫారసులు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలన్నింట్లోనూ ఒకే విధమైన క్రెడిట్ సిస్టమ్‌ను అమలు చేయనున్నారు. ప్రతి సెమిస్టర్‌కి 20 క్రెడిట్స్ ప్రకారం.. మొత్తం 160 క్రెడిట్స్ ఉండేలాగా సిలబస్‌ను రూపొందించనున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్ సిలబస్ సవరణ కోసం తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఏర్పాటు చేసిన కోర్ కమిటీ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగింది. సమావేశంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్ట రెడ్డి, వైస్ చైర్మన్1 ప్రొఫెసర్ ఈ పురుషోత్తం, వైస్ చైర్మన్2 ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్‌తోపాటు కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఇంజినీరింగ్‌లో ఉపాధి నైపుణ్యాలను పెంపొందించడానికి సిలబస్‌ను నవీకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించిన నేపథ్యంలో సమావేశం జరిగింది. పరిశ్రమ మరియు ప్రపంచ అవసరాల నేపథ్యంలో సిలబస్ సవరణ అవసరాన్ని ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి వివరించారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలు ఏకరీతి నిర్మాణం, క్రెడిట్ ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించాలని.. ప్రతి సెమిస్టర్‌లో నాలుగు సంవత్సరాల పాటు 20 క్రెడిట్‌లతో మొత్తం 160 క్రెడిట్‌లు ఉండాలని.. అదనంగా మైనర్, హానర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లకు 20 క్రెడిట్‌లు కేటాయించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), డేటా సైన్స్ (డీఎస్), సైబర్ సెక్యూరిటీ (సీఎస్) వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికత కోర్సులతో కలపడం ద్వారా కోర్ శాఖలను బలోపేతం చేయాలని.. అన్ని యూనివర్సిటీలు/కాలేజీలు మైనర్/హానర్ డిగ్రీ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. పారిశ్రామిక ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టితో రెండవ, మూడవ సంవత్సరాల చివరిలో రెండు తప్పనిసరి క్రెడిట్ ఆధారిత పారిశ్రామిక ఇంటర్న్‌షిప్‌లుండాలని సూచించారు. ఇంజినీరింగ్‌లో వేగంగా నేర్చుకునేవారికి క్రెడిట్‌లను సంపాదించడంలో సౌలభ్యంగా ఉంటుందని.. విద్యార్థి 6వ లేదా 7వ సెమిస్టర్ చివరి నాటికి 160 క్రెడిట్‌లను పూర్తి చేయవచ్చని.. తద్వారా మిగిలిన సెమిస్టర్(ల)ను పారిశ్రామిక ఇంటర్న్‌షిప్/ప్రాజెక్ట్ కోసం పూర్తి సమయం కేటాయించవచ్చని సూచించారు. ఇంజినీరింగ్ కోర్సుల్లో కనీసం నాలుగు పారిశ్రామిక/క్షేత్ర సందర్శనలు చేయాలని సూచించారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను బోధించడానికి ప్రొఫెసర్ ప్రాక్టీస్ సహకారం తీసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ అవగాహన ఒప్పందాల ప్రకారం అధ్యాపకులు మరియు విద్యార్థుల మార్పిడిని ప్రోత్సహించాలని సిఫారసుల్లో పేర్కొన్నారు.



అమ్మవారికి ప్రత్యేకపూజలు చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు

## పోలేపల్లి ఎల్లమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**దుద్యాల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గం దుద్యాల్ మండలంలోని పోలేపల్లిలో జరిగే ఎల్లమ్మ బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. సిఎంకు దేవాదాయ కమిషనర్ శ్రీధర్ పుష్పగుచ్ఛం అంద జేసి, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రేణుక ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారికి సిఎం పట్టువస్త్రాలు సమర్పించి, దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. వేద పండితులచే ఆశీర్వచనం అందుకున్నారు. ముఖ్యమంత్రితోపాటు మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణ రావు, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, శాసనసభ్యులు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణ రెడ్డి, దేవాలయ చైర్మన్ జయరాములు, ఇ. రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి, జయకృష్ణ, నర్సింలుగౌడ్, మేర్గు వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, యుగంధర్‌రెడ్డి, పులిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ కాలేదంటూ గాంధీభవన్ వద్ద రైతుధర్నా

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** తుంగతుర్తి నియోజకవర్గం శాలిగౌరం మండలం అంబారిపేట్ గ్రామానికి చెందిన చెందిన తోట యాదగిరి అనే వృద్ధ రైతు శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు చేరుకుని రుణమాఫీ తనకు వేయలేదని ధర్నా చేపట్టారు.తనకు రుణమాఫీ చేసే వరకు ఇక్కడ్నుంచి కదిలేది లేదని ఆ రైతు తేల్చిచెప్పాడు. తనకు మూడు లక్షలకు పైగా పంట రుణాలు ఉన్నాయని రెండులక్షలు మాఫీచేస్తే నేను ఒక లక్షరూపాయలు కట్టుకొనేటోడినని అన్నారు. 55 క్వింటాళ్ల 80 కిలోల ధాన్యాన్ని విక్రయం చాను. కానీ ఇప్పటి వరకు బోనస్ రాలేదని ఆవేదన చెందారు. రైతుభరోసా మాప్రభుత్వం రాగానే పెంచిన మొత్తం ఇస్తదని చెప్పి ఇప్పుడు ఇంకా వేయడంలేదని ఇటు పెన్షన్ కూడా రావడంలేదని ఆయన గాంధీభవన్ మెట్లపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి 2 లక్షల రుణమాఫీ చేయాలి. ప్రభుత్వం దిగి వచ్చే వరకు నేను ఇక్కడ్నుంచి కదలను అంటూ భీష్మించుకొని కూర్చొన్నారు.. నేను అబద్ద మాడితే జైలుకు వెళ్లేందుకైనా సిద్ధమే అని రైతు తోట యాదగిరి తేల్చి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీని నిల బెట్టు కొన్నప్పటికీ కొంతమంది ప్రతిపక్షాల తప్పుడు ప్రచారంతో ప్రేరేపించబడి అడపాదడపా రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ హామీలు నీటి మీద రాతలుగానే మిగిలిపోయాయనే తప్పుడు ప్రచారం అక్షరాలుగా చాలా మంది రైతులకు రుణమాఫీ కాకలేదని భావించుకొని రేవంత్ సర్కార్‌పై ఆగ్ర హంతో ఉన్నారు. అవకాశం ఉన్నచోట ప్రతిపక్షాల బోధనలకు ప్రేరేపితులైన రైతులు నిరసన తెలుపుతున్నారు.

## తెలంగాణకు కేంద్రం అన్యాయం

**ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్**




శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 21:** తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాను ఇవ్వకుండా కేంద్రం మోసం చేసిందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మండిపడ్డారు. కృష్ణా జలాలపై తెలంగాణ ఏపీ మధ్య జరుగుతున్న చర్చలు.. దానిపై కేంద్రం స్పందనపై ఎమ్మెల్సీ కోదండరాం స్పందించారు. శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. తెలంగాణ ఉద్యమానికి మూల కారణాలైన వాటిలో నీళ్ళ పంపకం ఒకటి అన్నారు. కృష్ణా జలాల నీటి వివాదంపై గత పదేళ్ళు అధికారంలో ఉండి కూడా మాట మాట్లాడకుండా ఉన్న బీఆర్ఎస్ నేతలు.. ఇపుడు ప్రతిపక్షంలోకి వచ్చేసరికి తాము పోరాటం చేస్తామని ముందుకు రావడం హాస్యాస్పదమన్నారు. గత పదేళ్లలో మీరు మౌనం వహించడం వల్లే.. ఈరోజు ఈ పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎనికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, టీజేఎస్ తరపున గట్టిగానే నిలదీస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ టీజేఎస్ మద్ధతు కోరిందని కోదండరాం మీడియాకు తెలియజేశారు.

## మార్చి 4, 5 తేదీల్లో డిపార్ట్‌మెంటల్ పరీక్షల ఉత్తీర్ణులకు వైవా

**షెడ్యూల్‌ను విడుదల చేసిన టిజిపిఎస్‌సి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్‌సీ) నవంబర్-2024లో నిర్వహించిన డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు వైవాను నిర్వహించనుంది. నవంబర్‌లో లాంగ్వేజెస్ పరీక్షలకు హాజరై అర్హత సాధించిన వారికి మార్చి 4, 5 తేదీల్లో వైవా నిర్వహించాలని టీజీపీఎస్‌సీ నిర్ణయించింది. సంబంధిత షెడ్యూల్‌ను కమిషన్ శుక్రవారం జారీచేసింది. వైవాకి అర్హత సాధించిన వారి జాబితాను కమి షన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు ప్రకటించింది. అర్హులైన అభ్యర్థులు మార్చి 4, 5 తేదీల్లో కమిషన్ కార్యాలయంలో వైవాకి గంట ముందుగా వివరాలను నమోదు చేసుకొని బయోమెట్రిక్‌ను పూర్తి చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు చేతులకు మెహందీ వేసుకోవడం గానీ, తాత్కాలిక టాటూస్ వేసుకోవడం చేయవద్దని కమిషన్ సూచించింది.

## పిసిసి విస్తృతస్థాయి కార్యవర్గం సమావేశం వాయిదా

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం గాంధీభవన్‌లో జరగాల్సి ఉండగా దానిని వాయిదా వేశారు. శాసనమండలి ఎన్నికలు ఈ నెల 27న ఉండటంతో సమా వేశం వాయిదాను నిరవధికంగా వాయిదా వేశారు. విస్తృతస్థాయి సమావేశంలో చర్చించాల్సిన ఎమ్మెల్సీ ఎన్నికల అంశంపై ఒకరోజు ముందే పిసిసి చీఫ్ మహేష్ కుమార్ అధ్యతన జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ ప్రాదేశిక నియోజకవర్గం పరిదిలోని 42 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహించే ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు పాల్గొని ఎన్నికల గెలుపు కోసం వ్యూహరచనకు దశదిశను నిర్దేశించారు. ఈ నెల 23న జరగాల్సిన పిసిసి కార్యవర్గ సమావేశం తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా మీనాక్షి నటరాజన్ నియ మితులయ్యాక ఏర్పాటు చేసిన తొలి సమావేశం కావడంతో అత్యంత ప్రాధాన్యత ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ ఎన్నికల బిజీ కారణంగా వాయిదా వేశారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య. చిత్రంలో ఎన్.మారేష్, జబ్బుల శ్రీనివాస్, సి.రాజేందర్, భూపేష్‌సాగర్ తదితరులు

## 12, 13 తేదీల్లో ఢిల్లీలో 'జాతీయస్థాయి మేధావుల సదస్సు'

**యావత్ బిసిలు పాల్గొనాలి: ఎంపి ఆర్.కృష్ణయ్య**

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ 'చలో ఢిల్లీ' పేరిట మార్చి 12, 12 తేదీల్లో ఢిల్లీలోని ఎపి భవన్‌లో 'జాతీయస్థాయి మేధావుల సదస్సు' నిర్వహిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం, ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం, దక్షిణాది రాష్ట్రాల ఒబిసి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో కేంద్రమంత్రులు, ఎంపిలు, ఎపి, తెలంగాణ, దక్షిణాది రాష్ట్రాలకు చెందిన 100 బిసి సంఘాల ప్రముఖులు పాల్గొంటారని, బిసిలు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చలో ఢిల్లీకి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా కులగణన జరగవలపిన చారిత్రాత్మక అవశ్యకత ఎంతైనా ఉందని, ప్రధాని నరేంద్రమోడీ వెంటనే చోరవ తీసుకుని బిసి బిల్లు, ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల ఒబిసి సంఘం అధ్యక్షుడు జబ్బుల శ్రీనివాస్, బిసి నేతలు సి.రాజేందర్, పీతాను ప్రసాద్, నడిపిన శ్రీనివాస్‌రావు, నీలం వెంకటేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలో టాప్10 బ్యాంకుల్లో స్థానం సంపాదించాలి

**ఎస్‌బిఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** ప్రపంచంలోని టాప్ 10 బ్యాంకుల్లో స్థానం సంపాదించే విధంగా ఎస్‌బిఐ సిబ్బంది పని చేయాలని, ఇందుకు ఖాతాదారులు సహకారం కూడా ఎంతో అవసరం అని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) చైర్మన్ చల్లా శెట్టి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన రాష్ట్రంలోని (హైదరాబాద్) సర్కిల్లో 10 కొత్త (1. అలంపూర్ల్ రోడ్ 2. చిన్నం బావి 3. రాఘవేంద్ర కాలనీ (కొండాపూర్) 4. నియోపోలిస్ 5. కిష్టారెడ్డిపేట్ (పటాన్‌చెరు) 6. ఖాజాగూడ 7. ఉస్మాన్ నగర్ 8. కంగ్టి (నారాయణఖేడ్) 9. సుచిత్ర సర్కిల్ (కుత్బుల్లాపూర్) 10. నందిపేట్) శాఖలను వర్చువల్‌గా ప్రారంభించారు. చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ శ్రీ చల్లా శ్రీనివాసులు శెట్టి ఈరోజు తెలంగాణ రాష్ట్రంలో (హైదరాబాద్ సర్కిల్) పది కొత్త శాఖలను చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీ రాజేష్ కుమార్ సమక్షంలో వర్చువల్‌గా ప్రారంభించారు. ఆ శాఖలు 2024లో దేశంలోని అత్యుత్తమ బ్యాంకుల జాబితాలో 4వ స్థానంలో ఉందని దీన్ని మరింత ముందుకు తీసుకెళ్ళ బాధ్యత సిబ్బందిపై ఎంతగానో ఉందన్నారు. ఈ నూతన బ్యాంకుల ఏర్పాటుతో రాష్ట్రంలో ఎస్‌బిఐ బ్రాంచ్‌ల సంఖ్య 1206కు చేరుకున్నట్లు తెలిపారు. బ్యాంకులు లేని ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను సులభంగా పొందేలా చేయడం, అభివృద్ధి చెందుతున్న పట్టణ కేంద్రాల్లోని ప్రజల పెరుగుతున్న బ్యాంకింగ్ అవసరాలను తీర్చడం వంటి చర్యలు బ్యాంకుల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడ తాయన్నారు. కస్టమర్ మన విశ్వానికి కేంద్రమని, కస్టమర్ కేంద్రీకృతి, వ్యాపార వృద్ధి, స్థిరమైన వృద్ధి, ఉద్యోగుల కేంద్రీకృతి అనే నాలుగు ప్రాథమిక సూత్రాలపై దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు.దేశ ఆర్థిక భవిష్యత్తును రూపొందించడంలో బ్యాంకు కీలక పాత్ర పోషిస్తుంది. దీనిని సాధించేందుకు ఉద్యోగులు ఉత్తమ బ్యాంకుగా, అత్యంత విలువైన బ్యాంకుగా ఉండేలా చూసుకోవడంపై దృష్టి పెట్టాలన్నారు. మరింత మంది ఖాతాదారులను చేర్చుకోవడం, అత్యున్నత స్థాయి బ్యాంకింగ్ సేవలను అందించడం వంటి కార్యక్రమాలపై సిబ్బంది దృష్టి సారించాలన్నారు.




## కృష్ణా జలాల వాటాలో తెలంగాణకు అన్యాయం చేసిన బిఆర్ఎస్

**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలను తాకట్టుపెట్టి లక్షా81వేల కోట్లు అప్పు తీసుకొచ్చినా కృష్ణాజలాల వాటా విషయంలో తెలంగాణకు బిఆర్ఎస్ అన్యాయం చేసిందని నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. బిఆర్ఎస్ నాయకులకు మంత్రులకు కృష్ణా ప్రాజెక్టులపై మాట్లాడే నైతికత లేదని అన్నారు. గత పదిసంవత్సరాలు బిఆర్ఎస్ నిర్లక్ష్యం చేశారని ఉత్తమ్ పేర్కొన్నారు. దక్షిణ తెలంగాణలో 100 టిఎంసిల నీటిని నిల్వ చేసుకొనే సామర్థ్యం కలిగిన ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేయ లేదని ఆయన అరోపించారు. ఎస్ఎల్‌బిసి, డిండి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులకు నిధు లు కేటాయించకుండా నిర్లక్ష్యం చేశారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఈ ప్రాజె క్టులు పూర్తి చేసుకొంటామని ఆయన తెలిపారు.

## యాదగిరిగుట్ట కుంభాభిషేకం సంప్రోక్షణ మహోత్సవ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**భువనగిరి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లాలో యాదగిరి గుట్ట శ్రీలక్ష్మినంసింహ స్వామివారి బంగారు విమాన గోపురం మహా కుంభా భిషేకం సంప్రోక్షణ మహోత్సవ కార్యక్రమానికి ఈ నెల 23న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్న సందర్భంగా అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ ఏర్పా ట్లను పకడ్బందీగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాలులో ముఖ్య మంత్రి పర్యటన సందర్భంగా జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్, రెవెన్యూ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, దేవాదయ శాఖ, అర్ అండ్ బి, ట్రాన్స్ పోర్ట్, ఎలక్ట్రిసిటీ, ఫైర్, పంచాయితీ, ఎక్సైజ్, మత్స్య శాఖ, వైద్య శాఖ, మిషన్ భగీరథ, ట్రాన్స్ కో, డిపిఆర్ఓ,సివిల్ సప్లై, వ్యవసాయ శాఖ, ట్రాఫిక్ తదితర శాఖల ఏర్పాట్ల పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలు అధికారులు సంపూర్ణ సమన్వయంతో ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. భద్రత ఏర్పాట్లు, శాంతి భద్రతలు, పూర్తి స్థాయిలో పోలీస్ బందోబస్తును పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ అధికారులను, అగ్నిమాపక పరికరాలను, సేవలను అందుబాటులో ఉంచాలని అగ్నిమాపక శాఖను, అవసరమైన వైద్య ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య శాఖను, రోడ్ల మరమ్మత్తుల పనులను అర్.అండ్.బి, అధికారులు, శానిటేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పంచాయితీ శాఖ, ఈ ఏర్పాట్లన్నీ ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఆర్డీఓ కృష్ణ రెడ్డి,సీఈఓ శోభారాణి, ట్రాఫిక్ ఎసిపి ప్రభాకర్ రెడ్డి, డిఆర్డిఏ నాగిరెడ్డి, ఏ.ఓ జగన్మోహన్ ప్రసాద్ ,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




ఇండిగో విమాన సేవలు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

## హైదరాబాద్ విమానాశ్రయం నుంచి మదీనాకు ఇండిగో కొత్త విమానసేవలు ప్రారంభం

**హైదరాబాద్ (శంషాబాద్). ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** జీఎంఆర్ హైదరాబాదు అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఇండిగో ఎయిర్‌లైన్స్‌తో కలిసి హైదరాబాద్ మదీనాకు కొత్త విమాన సేవలను శుక్రవారం ప్రారంభించింది. తొలి విమానం ఆనందోత్సాహం మధ్య సీనియర్ అధికారుల సమక్షంలో శుక్రవారం బయలుదేరింది. ఈ సేవ ప్రతివారం మూడు రోజులుపాటు ఉం టాయని తెలిపారు. ఈ విమానసర్వీసులు సోమ, గురు, శనివారం అందుబాటులో ఉంటాయి. గమ్యస్థానం చేరడానికి 5 గంటలు 47 నిమిషాలు. పడుతుందని వివరించారు. ఈ కొత్త సేవతో అంతర్జాతీయ కనెక్టివిటీ మరింత మెరుగవుతుందని స్పష్టంచేశారు. హైదరాబాదు అంత ర్జాతీయ విమానాశ్రయం సీఈఓ ప్రదీప్‌పనికర్ మాట్లాడుతూ, 'మదీనాకు ఇండిగో తొలి విమానాన్ని స్వాగతించడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ కొత్తమార్గం మా అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను విస్తరించడమే కాకుండా, హైదరాబాదును ప్రపంచంలోని అత్యంత ప్రముఖమైన ఆధ్యాత్మిక నగరాలలో ఒకటైన మదీనాతో అనుసంధానించే ప్రత్యేక ప్రయాణ అనుభవాన్ని ప్రయాణికులకు అందిస్తుందని తెలిపారు. అంతర్జాతీయ కనెక్టివిటీని మెరుగుపరచడం, ఎయిర్‌లైన్స్ కార్యకలాపాల విస్తరణకు మద్దతు ఇవ్వడం ప్రయాణికులకు సులభమైన సేవలు అందించ డానికి కట్టు బడి ఉంటామని అన్నారు. దక్షిణాసియా ఆగ్నేయాసియాలోని ప్రయా ణికులకు ఇప్పుడు హైదరాబాదులో అభివృద్ధి చెందుతున్న గ్లోబల్‌హబ్ ద్వారా మరిన్ని ప్రయాణ ఎంపికలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## టెన్త్ విద్యార్థులను చితకబాదిన ఇంటర్ స్టూడెంట్లు

**రుక్మాపూర్ సైనిక్ స్కూల్లో ఘటన**

**పట్టించుకోని డైరెక్టర్, ప్రిన్సిపాల్**

**గతంలోనూ ఘటన.. తల్లిదండ్రుల ఆందోళన**

**విద్యార్థులను గోప్యంగా ఆస్పత్రికి తరలించిన స్కూల్ సిబ్బంది**



**చొప్పదండి, ప్రభాతవార్త:** కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల సైనిక్ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు పదో తరగతి చదువుతున్న విద్యార్థులను చితకబాదిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది ఈ విషయాన్ని సైనిక్ స్కూల్ ప్రిన్సిపల్ డైరెక్టర్ గోప్యంగా ఉంచి విద్యార్థులకు వైద్య సేవలు అందించినట్లు సమాచారం వివరాల్లోకి వెళితే ఈనెల 20న సాయంత్రం ఇంటర్మీడియట్ విద్యార్థులు 10 మంది కలిసి పదో తరగతి చదువుతున్న 8 మంది విద్యార్థులపై భౌతికంగా దాడి చేశారు ఈ దాడిలో కొందరికి గాయాలు కాగా రాత్రి కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు విశ్వాసనీయ సమాచారం ప్రిన్సిపల్ సైనిక్ స్కూల్ డైరెక్టర్ నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని తల్లి దండ్రులు ఆరోపిస్తున్నారు విషయం తెలిసిన తల్లిదండ్రులు శుక్రవారం మధ్యాహ్నం సైనిక్ పాఠశాల కు చేరుకొని ఆందోళన నిర్వహించారు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని ఆందోళన నిర్వహించారు సంఘటన స్థలానికి ఎస్సై గొల్లపల్లి అనూష చేరుకొని విద్యార్థుల తల్లిదండ్రులతో విద్యార్థులతో మాట్లాడారు గతంలో కూడా పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 8వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులను దాడి చేసిన సంఘటన కూడా చోటుచేసుకుంది మళ్లీ ఇలాంటి సంఘటనలు పునారవృతం అవుతున్నాయి ఇదిలా ఉండగా విద్యార్థులు కొందరు మత్తుపదార్థాలకు బానిస అవుతున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి సైనిక్ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి మద్యం సేవిస్తున్నారని సంఘటనలు కూడా జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి ప్రిన్సిపల్ డైరెక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులను పట్టించుకోవడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు పిల్లలను విద్యాబుద్ధులు నేర్చుకోవడానికి పంపిస్తే క్రమశిక్షణ లేకుండా చేస్తున్నారని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్రిన్సిపాల్ ను డైరెక్టర్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## దోచి, దాచిపెట్టిన అధికారులపై వేగంగా విచారణ చేపట్టాలి

**ఆ అధికారుల వల్లే ప్రభుత్వానికి చెడ్డపేరు**

**చర్యలు తీసుకొనే సమయం ఆసన్నమైంది**

**పిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** తెలంగాణలోని అధికారుల తీరువల్లే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ఆవేదన చెందారు. శుక్రవారం ప్రసారమాధ్యమ ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ దోచిపెట్టిన దాచిపెట్టి అధికారులపై వేగంగా విచారణ జరుగాలని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వంలో పెత్తనం చేసిన అధికారులు ఇప్పుడూ ఉండటంతో ప్రతిపక్ష పార్టీతో కుమ్మక్కై ప్రభుత్వ సమాచారాన్ని బట్టబయలు చేస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ పాలనలో పదేళ్లు కీలకంగా వ్యవహరించిన అధికారులను పక్కన పెట్టాలని ప్రభుత్వ పెద్దలకు ఆయన సలహా ఇచ్చారు. ప్రస్తుతం తెలంగాణలో ఇంటెలిజెన్స్ పూర్తిగా విఫలమైందని చాలాచోట్ల ఇది కనపడుతోందని ఆయన అన్నారు. పోలీసుల వైఫల్యం కారణంగానే భూపాలపల్లిలో రాజలింగమూర్తి హత్య జరిగిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు అవినీతి అధికారుల జబితా చేరిందని ఇక వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉందని ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సోమేష్‌కుమార్ బాగోతం ఇంకా బయట పడటంలేదని ఆయన అండతోనే జిఎస్‌టి కుంభ కోణం జరిగిందిన ఆయన వివరించారు. అమయ్ కుమార్ లాంటి వారిపై చర్యలు అవసరం అని ఆయన అభిప్రాయపడ్డారు. విచారణలో వేగం తగ్గడంతో 'రాజీ'పడ్డామనే ఆరోపణలు కాంగ్రెస్‌పై వస్తున్నాయని అన్నారు. సంధికాలం ముగిసింది ఇక అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన సమయం కూడా ఆసన్నమైందని అన్నారు. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించినవారిని పక్కనపెట్టాల్సిన అవసరం ఉంది. అవినీతిపై విచారణ చేయాల్సిన అధికారులు కూడా దోషులు కావడంతో విచారణ ముందుకు సాగడంలేదు. సింగరేణిలో కల్వకుంట్ల కవితకు అన్ని రకాలుగా సహకరించిన అధికారి మా ప్రభుత్వంలో ఉన్నత స్థానంలోప ఉన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులు అందజేస్తున్న దరఖాస్తుదారులు

## ప్రజావాణిలో అందిన దరఖాస్తులు 1,244

**హైదరాబాద్ (బేగంపేట), ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 1,244 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 76 దరఖాస్తులు, విద్యుత్‌శాఖకు సంబంధించి 61 దరఖా స్తులు, రెవెన్యూ సమస్యలకు సంబంధించి 36 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం 1,007 దరఖాస్తులు అందాయి. ఇతర శాఖలకు సంబంధించి 237 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ఇన్‌చార్జి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించారు.

# 'ఓ భామ అయ్యో రామ' హరీష్ శంకర్ గెస్ట్ రోల్

వైవిధ్యమైన చిత్రాలలో ప్రేక్షకులను అలరిస్తున్న యువ కథానాయకుడు సుహాస్, మరో అందమైన ప్రేమకథా చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నాడు. ఈ చిత్రంలో ప్రతి ఫ్రేమ్‌లో ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తూ అందరిని అలరించడానికి సిద్ధమయ్యాడు హీరో సుహాస్. ఓ భామ అయ్యో రామ అనే ఈ ప్రేమకథలో మలయాళ నటి మాళవిక మనోజ్ కథానాయికగా పరిచయమవుతోంది. ఈ సినిమాను



రామ్‌గోధల తన తొలి ప్రయత్నంగా దర్శకత్వం చేస్తున్నారు. వి ఆర్ట్స్ పతాకంపై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ కథానాయకుడు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. కాగా ఈ చిత్రంలో ప్రముఖ మాస్ దర్శకుడు హరీష్ శంకర్ ఓ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడు. సినిమాలో ఆయన గెస్ట్ రోల్ అందరిని సర్‌ప్రైజ్ చేస్తుంది. ఈ పాత్ర ఆయన చేస్తేనే బాగుంటుందని భావించిన మేకర్స్ హరీష్ శంకర్‌ను ఒప్పించి ఆయన పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను ఇటీవల పూర్తిచేశారు. నిర్మాత మాట్లాడుతూ, సుహాస్ కెరీర్‌కు మైలురాయిగా నిలిచే చిత్రంగా ఇది ఉంటుంది. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఓ బెస్ట్ క్వాలిటీ సినిమాను అందించబోతున్నాం. ఈ చిత్రంలో సున్నితమైన ప్రేమ భావోద్వేగాలతో పాటు అంతకు మించిన ఫన్ ఉంటుంది. ఈ చిత్రంలోని వినోదం ఆడియన్స్‌ను ఎంతో ఎంటర్‌టైన్ చేస్తుందనే నమ్మకం వుంది. హరీష్ శంకర్ గారు అడ్గగానే మా చిత్రంలో అతిథి పాత్రను చేసినందుకు ఆయన కృతజ్ఞతలు. ఈ వేసవిలో ఓ భామ అయ్యో రామ బెస్ట్ ఎంటర్ టైనర్ చిత్రంగా నిలుస్తుందనే నమ్మకం ఉందిఖీ అన్నారు.

అంతేకాకుండా, కథలో మరిన్ని అంశాలను అందించేందుకు సీనియర్ నటి అనితా హసనందిని మరియు ప్రముఖ నటుడు అలి కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి అత్యుత్తమ సాంకేతిక బృందం పనిచేస్తోంది – మనికందన్ సినిమాటోగ్రఫీ చేయగా, రధన్ సంగీతాన్ని అందిస్తున్నారు. భవిన్ షా ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టగా, బ్రహ్మ కదలి ప్రొడక్షన్ డిజైన్‌ను సమకూరుస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం 2025 వేసవి లో ప్రేక్షకుల ముందుకు రానుంది. నటీనటులు: సుహాస్, మాళవిక మనోజ్, అనితా హసనందిని, అలి, బబ్లూ పృథ్వీ రాజ్, రవీందర్ విజయ్, మొయిన్, సాంకేతిక నిపుణులు: రచయిత, దర్శకుడు: రామ్ గోధల, నిర్మాత: హరీష్ నల్ల బ్యానర్: వి ఆర్ట్స్, సంగీతం: రధన్ సినిమాటోగ్రఫీ: మనికందన్ ఎస్ ఎడిటింగ్: భవిన్ షా ప్రొడక్షన్ డిజైన్: బ్రహ్మ కదలి కాస్ట్యూమ్స్: అశ్వంత్ అండ్ ప్రతిభ పిఆర్ఓ: ఏలూరు శ్రీను మదూరి మధు

# 'నాగబంధం' కోసం డ్యాన్స్ సాంగ్ షూట్

విరాట్ కర్ణ హీరోగా, అభిషేక్ నామా దర్శకత్వంలో, కిషోర్ అన్నపురెడ్డి నిర్మాతగా ఎన్ఐకె స్టూడియోస్, ఇన్ అసోసియేషన్ విత్ అభిషేక్ పిక్చర్స్ పాన్ ఇండియా ఫిల్మ్ 'నాగబంధం' సినిమా నిర్మాణం భారీ సెట్‌లో హీరో విరాట్ కర్ణ, హీరోయిన్స్ నభా నటేష్, ఐశ్వర్యమీనన్‌పై గణేష్ ఆచార్య మాస్టర్ కొరియోగ్రఫీలో అదిరిపోయే డ్యాన్స్ సాంగ్ షూటింగ్ జరుగుతోంది.యంగ్ హీరో విరాట్ కర్ణ హైలీ యాంటిసిపేటెడ్ పాన్‌ఇండియా మూవీ 'నాగబంధం'. ప్యాషనేట్ ఫిల్మ్ మేకర్ అభిషేక్ నామా దర్శకత్వం వహి స్తున్న ఈ చిత్రం గ్రాండ్ స్కేల్‌లో రూపొందుతోంది. ఇప్పటికే రిలీజైన ఫస్ట్ లుక్ మంచి బజ్ క్రియేట్ చేసింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ నానక్ రామ్ గూడ రామానాయుడు స్టూడియోలో జరుగుతోంది. హీరో విరాట్ కర్ణ, హీరోయిన్స్ నభా నటేష్, ఐశ్వర్య మీనన్‌పై ఓ గ్రాండ్ సాంగ్‌ని షూట్ చేస్తున్నారు. ఈ సాంగ్ కోసం ఓ భారీ సెట్ నిర్మించారు. మ్యూజిక్ డైరెక్టర్ అభే ఓ బ్లాక్ బస్టర్ నెంబర్‌ను కంపోజ్ చేశారు. కాలభైరవ, అనురాగ్ కులకర్ణి, మంగ్లీ తమ ఎనర్జిటిక్ వోకల్స్ ఆలపించిన ఈ సాంగ్‌కి కాసర్ల శ్యామ్ అద్భుతమైన లిరిక్స్‌ని రాశారు. కొరియోగ్రాఫర్ గణేశ్ ఆచార్య మాస్టర్ డ్యాన్స్ మూమెంట్స్ ఇందులో స్పెషల్ ఎట్రాక్షన్‌గా వుండబోతున్నాయి. మెస్మరైజింగ్ డ్యాన్స్ మూమెంట్స్‌తో ఈ సాంగ్ అలరించబోతోంది. 'ది సీక్రెట్ ట్రెజర్' అనే ట్యాగ్‌లైన్‌తో 'నాగబంధం' ఒక ఎపిక్ అడ్వెంచర్‌గా రూపుదిద్దుకుంటోంది. అభిషేక్ నామా కథ, స్క్రీన్‌ప్లే రెండింటికీ తనదైన విజన్‌ను తీసుకు వస్తున్నారు. ఎన్ఐకె స్టూడియోస్ ఆధ్వర్యంలో కిషోర్ అన్నపురెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా గర్వంగా సమర్పిస్తున్నారు. ఈ చిత్రంలో విరాట్ కర్ణ హీరో, నభా నటేష్, ఐశ్వర్య మీనన్ హీరోయిన్స్, జగపతి బాబు, రిషబ్ సహానీ, జయప్రకాష్, జాన్ విజయ్, మురళీ శర్మ, అనసూయ, శరణ్య, ఈశ్వరిరావు, జాన్ కొక్కెన్, అంకిత్ కొయ్య, సోనియా సింగ్, మాథ్యూ వర్గీస్, జాసన్ షా, బి.ఎస్.అవినాష్, బేబి కియరా కీలక పాత్రల్లో నటించారు. పాన్ ఇండియన్ ఫిల్మ్ నాగబంధం ఒక పురాణ ఇతిహాసాల నుంచి తీసుకున్న కథాంశాన్ని మిళితం చేస్తూ పద్మనాభస్వామి, పూరీ జగన్నాథ దేవాలయాల వద్ద ఇటీవల కనుగొనబడిన గుప్త నిధుల నుంచి ప్రేరణ పొంది, ఆధ్యాత్మిక సాహసోపేతమైన ఇతివృత్తాలతో వుంటుంది. ఈ పవిత్ర స్థలాలను రక్షించే నాగబంధం పురాతన ఆచారాలపై దృష్టి సారించి, భారతదేశంలోని విష్ణు దేవాలయల చుట్టూ ఉన్న రహస్యాన్ని నాగబంధంలో అద్భుతంగా ప్రజెంట్ చేస్తున్నారు. ఈ చిత్రం అసాధారణమైన నిర్మాణ విలువలు, అత్యాధునిక విఎఫ్ఎక్స్ హై – ఆక్టేన్ అడ్వెంచర్‌కి ప్రామిస్ చేస్తోంది. ఈ చిత్రానికి సౌందర్ రాజన్ ఎస్ డీవోపీగా పనిచేస్తున్నారు. అభే సంగీత దర్శకుడు. కళ్యాణ్ చక్రవర్తి డైలాగ్స్ రాయగా, ఆర్‌సీ ప్రణవ్ ఎడిటర్, అశోక్ కుమార్ ప్రొడక్షన్ డిజైనర్, స్క్రిప్ట్ డెవలప్‌మెంట్ శ్రా1, రాజీవ్ ఎన్ కృష్ణ.



నాగబంధం 2025లో తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో ఏకకాలంలో పాన్ ఇండియా లెవల్‌లో విడుదల కానుంది. తారాగణం: విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతి బాబు, రిషభ్ సహానీ, జయప్రకాష్, జాన్ విజయ్, మురళీ శర్మ, అనసూయ, శరణ్య, ఈశ్వరిరావు, జాన్ కొక్కెన్, అంకిత్ కొయ్య, సోనియా సింగ్, మాథ్యూ వర్గీస్, జాసన్ షా, బి.ఎస్.అవినాష్, బేబి కియరా, కళ్యాణి, కేశవ్ దీపక్ తదితరులు. సాంకేతిక సిబ్బంది: బ్యానర్: ఎన్ఐకె స్టూడియోస్ అండ్ అభిషేక్ పిక్చర్స్, సమర్పణ: లక్ష్మి ఐరా అండ్ దేవాన్ష్ కథ, స్క్రీన్‌ప్లే అండ్ దర్శకత్వం: అభిషేక్ నామా, నిర్మాత: కిషోర్ అన్నపురెడ్డి డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ: సౌందర్ రాజన్ ఎస్ సంగీతం: అభే, సీఈవో: వాసు పోతిని ప్రొడక్షన్ డిజైనర్: అశోక్ కుమార్.

# 24న 'హిట్: ది థర్డ్ కేస్' టీజర్ రిలీజ్

నేచురల్ స్టార్ నాని హైలీ యాంటిసిపేటెడ్ క్రైమ్ థ్రిల్లర్ హిట్: ది థర్డ్ కేస్ ట్యాలెంటెడ్ డైరెక్టర్ శైలేష్ కొలను దర్శకత్వంలో హిట్ సిరీస్‌లో మూడవ భాగంగా రాబోతున్న ఈ చిత్రం ఇప్పటికే గ్లింప్స్, పోస్టర్‌లకు అద్భుతమైన స్పందనతో భారీ అంచనాలను నెలకొల్పింది. వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై ప్రశాంతి తిపిర్నేని, నాని యూనిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి నిర్మించిన ఈ చిత్రం షూటింగ్ వేగంగా జరుగుతోంది. ఈ చిత్ర టీజర్‌కు సంబంధించిన అప్‌డేట్‌తో మేకర్స్ వచ్చారు. ఈ చిత్రం ఇంటెన్స్ టీజర్‌ను ఫిబ్రవరి 24న నాని పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయనున్నారు. ఈ చిత్ర ప్రధాన కథాంశం, నాని పోషిస్తున్న ఫెరోషియస్ అర్జున్ సర్కార్ క్యారెక్టర్ తో పాటు మిగతా పాత్రల గురించి కీలక వివరాలను ఆవిష్కరించడానికి టీం సిద్ధంగా ఉంది. టీజర్ పోస్టర్‌లో నాని చేతిలో గొడ్డలి పట్టుకొని, తన పాదాల దగ్గర పడిపోయిన మనుషులతో కమాండింగ్ పోజిషన్ లో కనిపిస్తున్నారు. ఈ బోల్డ్ ఇమేజ్ అతని పాత్ర యొక్క ఫెరోషియస్ అండ్ ఇంటెన్స్ నేచర్‌ని తెలియజేస్తోంది. ఈ చిత్రంలో నానికి జోడిడా శ్రీనిధి శెట్టి కథానాయిక పాత్రలో నటించింది. ఈ మూవీకి ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం వర్క్ చేస్తున్నారు. సాను జాన్ వర్గీస్ డీవోపీ, మిక్కీ జె. మేయర్ సంగీతం అందిస్తున్నారు, కార్తీక శ్రీనివాస్ ఆర్ ఎడిటర్, శ్రీ నాగేంద్ర తంగల ప్రొడక్షన్ డిజైనర్. హిట్ 3 మే 1, 2025న థియేటర్లలోకి రానుంది.



తారాగణం: నాని, శ్రీనిధి శెట్టి, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: డా. శైలేష్ కొలను, నిర్మాత: ప్రశాంతి తిపిర్నేని బ్యానర్లు: వాల్ పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్ డీవోపీ: సాను జాన్ వర్గీస్ సంగీతం: మిక్కీ జె మేయర్, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్ ఆర్, ప్రొడక్షన్ డిజైనర్: శ్రీ నాగేంద్ర తంగాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ వెంకటరత్నం (వెంకట్) సౌండ్ మిక్స్: సురేన్ జి, లైన్ ప్రొడ్యూసర్: అభిలాష్ మాంధదపు, చీఫ్ కోడైరెక్టర్: వెంకట్ మద్దిరాల, కాస్ట్యూమ్ డిజైనర్: నాని కమరుసు, ఎస్ఎఫ్ఎక్స్: సింక్ సినిమా, విఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్: విఎఫ్ఎక్స్ డిటిఎం, డిఐ: బి2హెచ్ స్టూడియోస్, కలరిస్ట్: ఎస్. రఘునాథ్ వర్మ, పీఆర్వో: వంశీ శేఖర్, మార్కెటింగ్: ఫస్ట్ షో.

# అందరికి నచ్చే మూవీ 'బాపు'

వెర్సటైల్ యాక్టర్ బ్రహ్మాజీ లీడ్ రోల్‌లో ఒకరిగా ఆమని, బలగం సుధాకర్ రెడ్డి, ధన్య బాలకృష్ణ, మణి ఏగుర్ల, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్న డార్క్ కామెడీడ్రామా బాపు. ఈ చిత్రానికి దయా దర్శకత్వం వహిస్తున్నారు. కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అథీరా ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై రాజు, సిహెచ్ భాను ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా ఫెబ్రవరి 21న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా బ్రహ్మాజీ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

**బాపు జర్నీ ఎలా స్టార్ట్ అయ్యింది?** డైరెక్టర్ దయ రెండేళ్ళ క్రితం కథ చెప్పారు. పాయింట్ చాలా కొత్తగా వుంది. క్యారెక్టర్ కూడా డిఫరెంట్‌గా వుంది. ఒరిజినల్‌గా కనిపించే అవకాశం ఇచ్చే స్క్రిప్ట్. అయితే దీనికి బడ్జెట్ లేదు. ఎలా చేద్దామని అనే చర్చ జరుగుతున్నప్పుడు నాకు రెమ్యునరేషన్ వద్దు. లాభాలు వస్తే కొంత మనీ ఇమ్మని చెప్పి అలా స్టార్ట్ చేశాం. తర్వాత అందరూ తగ్గించి చేయడం, లొకేషన్‌లో కార్వాన్ లేకుండా అదే ఊర్లో ఉంటూ అక్కడే సర్దుకుపోవడంతో ఇది చేయగలిగాం. కథపై ఇష్టం నమ్మకంతోనే ఇది సాధ్యపడింది.

**కథలో నచ్చిన ఎలిమెంట్ ఏమిటి?** చాలా యూనిక్ కాన్సెప్ట్. రైతులు ఆత్మ హత్య చేసుకుంటే ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుంది. అలా నా క్యారెక్టర్ సూసైడ్ కి ట్రై చేసినప్పుడు ఏమోతుందనేది సినిమాలో చూడాలి.

**ఆమని క్యారెక్టర్ గురించి?** ఆమని చాలా నేచురల్ యాక్టర్. చాలా మంచి సినిమాలు చేసిన మంచి ఆర్టిస్ట్. ఆమెతో కలసి వర్క్ చేయడం మంచి ఎక్స్‌పీరియన్స్. ఇందులో ఆమని క్యారెక్టర్ స్ట్రాంగ్‌గా వుంటుంది.

**ఫైనల్ కాపీ చుసినప్పుడు ఏమనిపించింది?** సినిమా చాలా బావుంది. ఇప్పుడు చిన్న సినిమాలకి ఓటీటీ అవ్వడం లేదు. మా అదృష్టం. ఈ సినిమాని హాట్ స్టార్ వాళ్ళు తీసుకున్నారు. థియేటర్ ఆడియన్స్ ఖచ్చితంగా కనెక్ట్ అవుతారు.



బ్రహ్మాజీ

**బలగం సుధాకర్ రెడ్డి క్యారెక్టర్ గురించి?** ఆయనదే టైటిల్ రోల్. కథలో ఆయనే మెయిన్. ఆ క్యారెక్టర్‌తో ఆడియన్స్ చాలా కనెక్ట్ అవుతారు.

**ఈ సినిమాకి అవార్డులు ఆశిస్తున్నారా?** అవార్డులు గురించి ఆలోచన లేదు. మంచి సినిమా చేయాలనేది మా ప్రయత్నం. అవార్డ్స్ వస్తే హ్యాపీ.

**సినిమాకి ఇండస్ట్రీ నుంచి ఎలాంటి సపోర్ట్ వుంది?** ఈ సినిమాకి ఇండస్ట్రీలో వున్నవారంతా హెల్ప్ చేశారు. రానా ఫస్ట్ లుక్ రిలీజ్. ట్రైలర్ లాంచ్‌కి అప్పటికప్పుడు పిలిచినా వచ్చారు. ఆయన ఇలాంటి చిన్న సినిమాలకి చాలా సపోర్ట్ ఇస్తారు. రస్మిక టీజర్ రిలీజ్ చేసింది. మొన్న ఈవెంట్‌కి అందరూ పిలవగానే వచ్చారు. అందరి సహకరంతో ఈ సినిమా జనాల్లోకి వెళ్ళగలుగుతుంది.

**బాపు మ్యూజిక్ గురించి?** ఈ సినిమాకి సాంగ్స్ చాలా హెల్ప్ అయ్యాయి. రెండు పాటలు బాగా పాపులర్ అయ్యాయి. చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది.

**డైరెక్టర్ దయ గరించి?** దయ చాలా మొండి డైరెక్టర్. విన్నట్లు నటిస్తాడు కానీ వినడు. ఆయనకి అనిపించింది చేస్తాడు.(నవ్వుతూ) తనలో చాలా క్లారిటీ వుంది. డైరెక్షన్ మీద పట్టుంది. చాలా నాలెడ్జ్ వున్న పర్సన్.


**బాపు సినిమాకి వచ్చిన బెస్ట్ కాంప్లిమెంట్?** ఇప్పటివరకూ సినిమా చూసి ప్రతిఒక్కరూ చాలా బావుందని ఫోన్ లు చేస్తున్నారు. జనరల్ ఆడియన్స్ చాలా బాగా కనెక్ట్ అవుతున్నారు. డైరెక్టర్ చంద్రశేఖర్ యేలేటికి సినిమా చూపించాను. ఆయనకి చాలా నచ్చింది.

**ఈ సినిమాని చాలా మంది బలగంతో పోల్చుతున్నారు?** అది మంచిదే కదా. అందులోనూ బలగం సుధాకర్ గారు వుండటంతో ఆ పోలిక మరింతగా వస్తోంది. అయితే బలగం సినిమాకి దీనికి ఏ మాత్రం పోలిక లేదు. ఆ కథ వేరు.. ఈ కథ వేరు.

**మీకు డ్రీమ్ రోల్ ఉందా?** సూపర్ డీలక్స్‌లో విజయ్ సేతుపతి చేసిన క్యారెక్టర్ చాలా ఇష్టం. ఆలాంటి క్యారెక్టర్స్ వస్తే చేయాలని వుంది. మీ సినిమాల ఎంపిక ఎలా వుంటుంది కథ బావుండాలి. అందులో నా పాత్ర బావుండాలి. ప్రతి సినిమాతో ఏదో కొత్తదనం వుండాలి.

# 28న 'బంధీ'

వాతావరణ పరిరక్షణపై సామాజిక సందేశాన్ని ఇస్తూ ఆదిత్య ఓం చేసిన చిత్రం 'బంది'. రఘు తిరుమల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పలు అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శించారు. ప్రతిష్టాత్మక చలన చిత్రోత్సవాలలో బంధీ చిత్రానికి అనేక ప్రశంసలు దక్కాయి. భారత దేశపు మొట్టమొదటి పర్యావరణ నేపథ్యంతో కూడిన థ్రిల్లర్‌గా బందీ రికార్డు క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో ఆదిత్య ఓం పాత్ర ఎదుర్కొనే పరిస్థితులు, వాతావరణ సమస్యలపై పోరాడే తీరు ఇతర విదేశాల్లోని అనేక అటవీ ప్రాంతంలో రియల్ లోకేషన్స్ మధ్య బందీ చిత్రాన్ని తెరకెక్కించారు. అద్భుతమైన విజువల్స్‌ను ఈ చిత్రంలో చూడబోతున్నాం. పర్యావరణ ప్రేమికులందరినీ కదిలించేలా ఈ చిత్రం ఉండనుంది. ఎంతో డెడికేటెడ్ యాక్టర్ అయిన ఆదిత్య ఓం బందీ చిత్రంలో ఎన్నో రియల్ స్టంట్స్ చేశారు. అటవీ ప్రాంతంలో అనేక ఛాలెంజ్‌లు ఎదుర్కొంటూ అద్భుతంగా నటించారు. ఫిబ్రవరి 28న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయబోతోన్నట్లుగా ప్రకటించారు. ఈ మూవీ టీజర్, విడుదలపై మరింత ఉత్కంఠ నెలకొంది. బంది చిత్రాన్ని ఫిబ్రవరి 28న గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు మేకర్లు సిద్ధంగా ఉన్నారు. కోసం మేకర్లు ఓ వ్యూహాన్ని రచించారు. ముందుగా ఈ చిత్రాన్ని కొన్ని పరిమిత స్క్రీన్లలో రిలీజ్ చేయాలని అనుకుంటున్నారు.



నిర్మాతలు వెంకటేశ్వర్ రావు దగ్గు, రఘు తిరుమల ఈ చిత్ర ప్రమోషన్స్ కోసం ఎన్‌జిఒలు, సామాజిక సంస్థలతో కలిసి ప్రమోషన్స్ చేస్తున్నారు.

# ఏప్రిల్‌లో 'ఎర్రచీర- ది బిగినింగ్'

బేబి డమరి సమర్పణలో శ్రీ పద్మాయల ఎంటర్టైన్మెంట్స్ శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం "ఎర్రచీర ది బిగినింగ్". ఈ సినిమాలో నటుడు రాజేంద్రప్రసాద్ ముద్దుల మనవరాలు బేబీ సాయి తేజస్విని నటిస్తోంది. "ఎర్రచీర ది బిగినింగ్" మూవీకి సుమన్ బాబు స్వీయ దర్శకత్వం వహిస్తూ ఒక ముఖ్య పాత్ర పోషించారు. మదర్ సెంటిమెంట్, హార్రర్, యాక్షన్ కథతో ఈ సినిమా తెరకెక్కింది. శివరాత్రి కానుకగా "ఎర్రచీర ది బిగినింగ్" గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కావలసి ఉంది. అయితే టెక్నికల్ కారణాలతో సినిమా రిలీజ్ వాయిదా వేశారు. వేసవి కానుకగా ఈ సినిమాని ఏప్రిల్ నెలలో ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు సుమన్ బాబు మాట్లాడుతూ సినిమా చూసిన వారందరూ అద్భుతంగా ఉందని కొనియాడారని అన్నారు. సినిమా ఆలస్యం కావచ్చు కానీ కంటెంట్ మాత్రం కంటెంట్ ఖతర్నాక్‌గా ఉందని చూసినవారు అందరూ అంటున్నారు అని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. నటీనటులు.. బేబి సాయి తేజస్విని, సుమన్ బాబు, శ్రీరామ్, కమల్ కామరాజు, కారుణ్య చౌదరి, అయ్యప్ప పి శర్మ, సురేష్ కొండేటి, రఘుబాబు, తదితరులు.



# 'రారాజు' నుంచి రిలీజ్ డేట్ పోస్టర్

శ్రీమతి పద్మ సమర్పణలో శ్రీ పద్మిణి సినిమాస్ బ్యానర్ మీద బి.శివ ప్రసాద్ తెరకెక్కించిన చిత్రం 'రా రాజా'. ఆర్టిస్టుల్ని చూపించకుండా కేవలం కథ, కథనాల మీదే నడిచే సినిమా ఇది. అసలు మొహాలు చూపించకుండా సినిమాను తీయడం అనేది మామూలు సాహసం కాదు. ఇలాంటి అద్భుతమైన ప్రయోగం చేసి మెప్పించేందుకు రెడీ అయింది 'రా రాజా' టీం. ఈ చిత్రానికి బూర్లే హరి ప్రసాద్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, కిట్టు లైన్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా రిలీజ్ చేసిన ఈ ట్రైలర్‌ను తమ్మారెడ్డి భరద్వాజ్ వీక్షించి అభినందించారు. అనంతరం రిలీజ్ డేట్ పోస్టర్‌ను కూడా రిలీజ్ చేశారు. తమ్మారెడ్డి భరద్వాజ్ మాట్లాడుతూ, 'రా రాజా మూవీ టైటిల్‌ను గమనిస్తే ఏదో ప్రేమ కథలా అనిపిస్తుంది. కానీ ఈ చిత్రంలో ఓ మొహం కూడా కనిపించదు. అసలు మొహాలు చూపించకుండా సినిమా తీసి దర్శకుడు శివ ప్రసాద్ ధైర్యం చేశాడు. డ్యూయెల్ అని స్పీల్ బర్గ్ తీసిన చిత్రంలోనూ మొహం కనిపించదు. అలానే ఈ చిత్రంలోనూ మొహాలు కనిపించవని అంటున్నారు. ఇది చాలా పెద్ద ప్రయోగం. ఇది కనుక సక్సెస్ అయితే ఇండస్ట్రీ మొత్తం మారిపోతుంది. అసలు హీరోలు, స్టార్లతో పని లేకుండా అద్భుతమైన చిత్రాలు, ప్రయోగాలు చేయొచ్చని అంతా ముందుకు వస్తారు. హీరో హీరోయిన్ల కోసం సినిమాలకు వస్తుంటారు. కానీ ఇందులో మొహాలు కూడా కనిపించవు. కథే ముందుకు వెళ్తుంటుంది. ఇది అద్భుతమైన ఐడియా. ట్రైలర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. శేఖర్ చంద్ర మ్యూజిక్ బాగుంది. మార్చి 7న ఈ చిత్రం రాబోతోంది. ఈ మూవీని అందరూ చూసి సపోర్ట్ చేయండ'ని అన్నారు. దర్శకుడు శివ ప్రసాద్ మాట్లాడుతూ, 'మా ట్రైలర్‌ను చూసి, రిలీజ్ డేట్ పోస్టర్‌ను రిలీజ్ చేసి, అభినందించిన తమ్మారెడ్డి భరద్వాజ్ గారికి థాంక్స్. మా చిత్రంలో ఆర్టిసుల మొహాలు కనిపించవు. కథ, కథనమే ముఖ్యం అని మేం ఈ మూవీని తీశాం.





# లక్ష్యమే ఆలంబనగా..



పేదవాళ్లకు పెద్ద కలలు ఎందుకు... అని నిన్నటితరం అనుకుంటే... ఉన్నది ఒక్కటే జీవితం ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అంటోంది నేటితరం. లక్ష్యం దిశగా కష్టపడితే ప్రోత్సాహం, సహకారం తప్పక దొరుకు తాయనీ నమ్ము తోంది. నమ్మకంలేదా... అయితే పైలట్ వేల్పుల నవ్య కథ తెలుసుకోవాల్సిందే!

తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు విమానం గురించి వినడమే కానీ వాళ్లు ప్రత్యక్షంగా దగ్గర నుంచి చూసింది. వాళ్ల కూతురేమో ఏకంగా పైలట్ అవ్వాలనుకుంది. చివరకు ఆర్థిక అడ్డంకులను అధిగమించి లక్ష్యాన్ని నెరవేర్చుకుంది.

కరీంనగర్ జిల్లా, గంగాధర మండలం గర్శకుర్తికి చెందిన పద్మ, రవి దంపతులకు... నవ్య, లక్ష్మి ముగ్గురు సంతానం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివింది నవ్య జగిత్యాల సాంఘిక సంక్షేమ శాఖ కళాశాలలో బీఎస్సీ, హైదరాబాద్ ప్రభుత్వ సిటీ కళాశాలలో ఎంఏ ఆంగ్లం పూర్తిచేసింది. డిగ్రీలో ఉండగానే విమాన పైలట్ కావాలనుకుంది. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా మొదట్లో వెనకడుగు వేసింది. ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందన్న అప్పటి తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్కుమార్ సలహా మేరకు పట్టు విడవకుండా ప్రయత్నించింది. సొంతంగానే సన్నద్ధమై అర్హత పరీక్షలో విజయం సాధించింది.

**ఆర్థిక పరిస్థితులు వెనక్కి లాగినా....** ఉపకార వేతనం కోసం రాష్ట్రవ్యాప్తంగా 400 మంది విద్యార్థులు పరీక్ష రాయగా... ఎంపికైన నలుగురిలో నవ్య ఒకరు. అలా టీఎస్ ఏవియేషన్ అకాడమీలో కమర్షియల్ పైలట్ శిక్షణకు అర్హత సాధించారు. ఫ్లయింగ్ శిక్షణకు రూ.36 లక్షలకుగాను ప్రభుత్వం బ్యాంకు ద్వారా మొదటి విడతలో రూ.18 లక్షలు అందించింది. గ్రౌండ్ శిక్షణకు అదనంగా రూ.3 లక్షలు అవసరం. అప్పటికే బ్యాంకులో రుణం లేదు. తమవల్ల కాదని తల్లిదండ్రులు చెప్పడంతో నిరాశకు గురైంది నవ్య. 2023లో ఆమె పరిస్థితిని వివరిస్తూ ఈనాడులో కథనం ప్రచురిత మవ్వగా, అప్పటి చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మరికొందరు దాతలు ఆర్థిక చేయూతనిచ్చారు. దీంతో టీఎస్ఏ బేగంపేటలో అడ్మిషన్ వచ్చింది. నేవిగేషన్, రెగ్యులేషన్, టెక్నికల్ జనరల్... ఇతర పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి నవంబరులో మొదటిసారి శిక్షణలో భాగంగా పైలట్ సీట్లలో కూర్చొని నవ్వుతుంది. 200 గంటలు విమానం నడపాల్సి ఉండగా ఇప్పటివరకు 30 గంటలు నడిపింది. మరో తొమ్మిది నెలల్లో శిక్షణ పూర్తి కానుంది. విమానం నడిపిన మొదటిరోజు భయమేసింది... కెప్టెన్ పరీక్షి త్రెడ్డి ప్రోత్సాహంతో ఆ భయం మర్నాడే పోయింది తల్లిదండ్రులను విమానంలో ఎక్కించుకుని తిప్పాలనేది నా కోరిక శక్తిమేరకు ప్రయత్నం చేస్తే ఎవరైనా లక్ష్యం సాధించవచ్చు అని నవ్వుతోంది. □

# కుంకుమపువ్వు విదేశీ ఛాయ



సుగంధద్రవ్యాల్లో అత్యంత విలువైంది కుంకుమ పువ్వు ఈ పంటకు కావాల్సిన వాతావరణ పరిస్థితు లను కల్పించ డంతోపాటు ఆధునిక పద్ధతుల్లో పండించింది. అస్తిక నరులా, ఆ పంటను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయి కలిగింది. ఢిల్లీ యూనివర్శిటీ నుంచి పట్టా పుచ్చుకుని వచ్చింది ఇలాంటి అనవసర ప్రయోగాలు 'చేయడానికేనా' అంటూ ఆస్తికను విమర్శించాడుతా, కుంకుమపువ్వు పంటపై పరిశోధర చేస్తున్నప్పుడు ఎదురైన ఈ విమర్శలను పట్టించు కోలేదుమె లుధియానాలో ఓ రైతు కుటుంబంలో పుట్టింది ఆస్తిక ఉద్యోగంలో రోజూ 8-10 గంటలపాటు పనిచేయడం ఆస్తికు నచ్చలేదు. సొంతంగా, వ్యవసాయానికి అను బంధంగా ఉండేది ఏదైనా చేయాలనుకుంది. ఇంట్లో మద్దతు ఇవ్వడంతో ఢిల్లీ నుంచి సొంతూరుకొచ్చింది.

**నూతన విధానాలతో....** మార్కెట్లో డిమాండ్ ఉన్న ఉత్పత్తిని పండించాలనుకుందీమె. దీనికోసం ఇంట్లో వెతికేటప్పుడు. కుంకుమపువ్వు ఖరీదు, దేశవ్యాప్తంగా అక్కడక్కడ మాత్రమే దీన్ని పండిస్తున్నట్లు తెలుసు కుంది.. "దాన్ని పండిస్తే ఎలా ఉంటుందని ఆలోచించింది. ఆపై ఏడాదిన్నరపాటు అధ్యయనం చేపట్టింది. ఆయా ప్రాంతాల కెళ్లి పరిశీలించింది. రైతులను కలిసి వాళ్లు పాటిస్తున్న విధానాలను తెలుసుకుంది.. ఆ తర్వాత అందరూ అనుసరించే పద్ధతిని కాకుండా నూతన సాంకేతికతతో అడుగు ముందుకు వేయాలనుకుంది. 2010-11లో కశ్మీరు నుంచి మార్కెట్ కొచ్చే కుంకుమపువ్వు ఎనిమిది టన్నులు కాగా, ప్రభుత్వగణాంకాల మేరకు గతేడాదికి ఈ పువ్వు దిగుమతి 28 టన్నులకు తగ్గింది. పంపిణీ అవుతున్నదాంట్లో నాణ్యతలేక 67 శాతం తిరస్కరణకు గురవుతోంది. ఈ కారణంగానే గదుల్లోనూ పలువురు దీన్ని పండించడం మొదలుపెట్టారు. నేను కూడా ఇదే పద్ధతిని ఎంచుకున్నా. 600 చదరపుటడుగులున్న ఓ గదిలో మొదట పంటకు కావాల్సిన వాతావరణ పరిస్థితులను ఏర్పాటు చేశాం. ఈ పంటకు ముఖ్యంగా ఉష్ణోగ్రత, తేమ, కార్బన్‌డయాక్సైడ్, కాంతి అవసరమవుతాయి. పగలంతా తగినంత వేడిల్లో మంచు కురుస్తున్నట్లుగా వాతావరణం పరిస్థితులను ఏర్పాటుచేశాం. ఈ పంటకు ముఖ్యంగా ఉష్ణోగ్రత, తేమ, కాంతి అవసరమవుతాయి. పగలంతా తగినంత వేడి, రాత్రివేళల్లో మంచు కురుస్తున్నట్లుగా వాతావరణం ఉండాలి. ఉష్ణోగ్రత స్థాయుల నిర్వహణకు చిల్లర్స్, వెలుతురుకు గ్రోలైట్స్, లెడ్‌లైట్స్ ఏర్పాటు చేశాం. అలాగే తేమ స్థాయిని నియంత్రించ దానికి హ్యూమిడ ఫైయర్ ఉండాలి. అలా రూ.50 లక్షల పెట్టుబడితో పని మొదలు పెట్టాం. కుంకుమ పువ్వు విత్తనాలను కొనుగోలు చేసి ట్రేలలో నాటాం' అనే ఆస్తికకు తమ్ముడి సాయం కూడా అందింది.





**లాభదాయకంగా...** రెండువారాలు పూర్తయ్యేసరికి విత్తనాలు మొలకెత్తడం, ఏడు వారాల్లో పూలు పూయడం వరకు గది వాతావరణాన్ని పంటకు తగ్గట్లుగా మారుస్తూ వచ్చింది. దిగుబడి బాగా వచ్చింది. దాంతో రెండోసారి కాస్త పెద్ద స్థాయిలో నాటారు. పండిన కుంకుమ పువ్వును ఆన్‌లైన్‌లో విక్రయించడం కూడా ప్రారంభించింది ఆస్తిక, అలా చిన్నగదిలో మొదలు పెట్టిన పంటను అభివృద్ధి చేస్తూ ప్రస్తుతం ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాలకు కేజీ రూ.8లక్షల చొప్పున ఎగుమతి చేస్తోంది. కుంకుమ పువ్వుతోపాటు, ఆ రేకలను ఫుడ్ కలర్, పెర్ఫ్యూమ్, సౌందర్యోత్పత్తుల తయారీ సంస్థలకూ విక్రయించడంతో లాభాలను పొందగలిగా, నచ్చింది చేస్తేనే విజయాన్ని ఆస్వాదించొచ్చు అంటోన్న ఆమె తనలాంటివారికి మార్గదర్శకురాలిగానూ నిలిచింది. □

# అలనాటి ఫ్యాషన్ నేటి తరం



ఫ్యాషన్ ఫ్యాషన్

రెట్రో ఫ్యాషన్... కాలేజీ, ఆఫీసు, తాజాగా ఇంటి వేడుకల్లోనూ దీనికి చోటివ్వడం చూస్తున్నాం. అంతా కలిసి దశాబ్దాల క్రితం నాటి ఫ్యాషన్లలో మెరిసిపోతుంటే చూడటానికి ముచ్చటగానూ ఉంటుంది. ఇదంతా సరదా సంగతి. కానీ తన జీవితంలో ముఖ్య ఘట్టమైన పెళ్లిళ్లకే నవవధువులు అమ్మమ్మలు, బామ్మల ఫ్యాషన్ వైపే చూస్తున్నారు. అలనాటి ఫొటోలు ఎప్పుడైనా చూశారా? బ్లాక్ అండ్ వైట్‌లో ఉన్నా వాటి అందమే వేరు. బ్లవుజు వెనక మెడ కాస్త పైకి... ముందేమో 'యు' లేదా 'వీ' నెక్. ఇక చేతులేమో పట్టు అంచుతో మోచేతులకు కాస్త పైకి ఉంటాయంతే. సాదా అయినా కుచ్చులతో బుట్ట చేతులే పెట్టినా చీర అందాన్నంతా బ్లవుజే నిర్ణయిస్తున్నట్లు ఉంటుంది. చిన్న చిన్న బుటీలతో వచ్చే ఆకర్షణ మరింత ప్రత్యేకం. ఆ బ్లవుజు, దానికి తగ్గ పట్టు చీర కట్టిన యువతి చూసిన వారెవరైనా బుట్ట బొమ్మలా ఉంది అనాల్సిందే! మరి ఇంతటి వైభవాన్ని కోరుకోని అమ్మాయి. ఉంటుందా? అందుకే లక్షల ఖర్చు చేసే భారీ వర్క్ ను కాదంటున్నారు. చేయించినా మెడకే పరిమితం చేస్తున్నారు. ఇక బ్లవుజంతా బుటీలే! అలాంటి కొన్ని డిజైన్లే ఇవి. అచ్చమైన భారతీయ అందం ఉట్టిపడుతున్నట్టు లేదూ?









# తాంబూలం ఇలా..

నోములు, పెళ్లి వేడుకల్లో ముత్తైదువులకు తాంబూలం, వాయనం ఇచ్చి పంపడం మన అనవాయితీ. 'మా ఆహ్వానాన్ని మన్నించి, మీరు మా ఇంటికి వచ్చారు. వచ్చి మమ్మల్ని అనుగ్రహించినందుకు కృతజ్ఞతలు' అన్నదానికి ప్రతీకగా ఈ తాంబూలం ఇస్తాం. దానిలో తమలపాకులు, పండ్లు, వక్క ప్రధానం. తరచుగా దక్షిణని పెడుతుంటారు కొందరు పసుపు కుంకుమలు, పూలు, గాజులు, జాకెట్ ముక్క వంటివాటితోపాటు గిఫ్ట్ జోడిస్తుంటారు. తాహతు, ఇంటి సంప్రదాయం బట్టి, ఒక్కొక్కరూ ఒక్కోలా ఇస్తుంటారు. ఈమధ్య వాటినీ అందంగా ఇవ్వడం సాధారణం అయిపోయింది. ఈ



విధంగా పసుపు ప్లాస్టిక్ తమలపాకులతోపాటు కాస్త, కుంకుమల్ని విభిన్న ఆకారాల్లో చేసిన బొమ్మల్లో ఇస్తున్నారు. చూడటానికి ఆకట్టుకునేలా ఉంటాయన్నది వాస్తవమే వాటిని ఎదుటివారు ఉపయోగించుకోగలుగుతున్నారా అన్నదీ గమనించుకోవాలి. వాటిని ఉపయోగించుకోనూలేరు వెంటనే పారేయనూలేరు. కొన్నాళ్లకైనా అవి చేరేది చెత్తలోకే! అంటే డబ్బూ వృథా పర్యావరణానికి హాని కలిగిస్తున్నాం. మనం ఇచ్చిన తాంబూలంలోనివన్నీ అవతలివారు ఉపయోగించుకుంటేనే దానికి సార్థకత. కాబట్టి, కొనేముందు వినియోగించుకునేలా ఉన్నాయా అని గమనించుకోండి. ఆ తరవాతే ఇవ్వండి. □

# క్షయ వ్యాధి - ఆహారం -2

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

టీలో పాలీఫెనోలిక్ సమ్మేళనాలుండడం వల్ల ఆరోగ్యం కోసం బ్లాక్ టీ గ్రీన్ టీ తీసుకోవాలి. **సెలీనియం**, జింక్ ఉన్న పొద్దుతిరుగుడు విత్తనాలు, పుట్ట గొడుగులు, బీన్స్, చియా గింజలు, గుమ్మడి కాయగింజలు, నువ్వులు, అవిసె, చికెన్, చేపలు, నత్తలు, చిలగడ దుంపలు తీసుకోవాలి. **ఆపిల్** జ్యూస్‌లో రోగనిరోధక శక్తిని పెంచే ఆంటిఆక్సిడెంట్స్ ఉండడం వల్ల ఆరోగ్యానికి మంచిది. **ఒమేగా-3** ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల రక్త ప్రసరణ మరియు గుండె ఆరోగ్యానికి మద్దతునిస్తుంది. **జాగ్రత్తలు ....** క్షయరోగులు పసుపు పాలు తీసుకోవడం మంచిది. పెరుగు-ప్రోబయోటిక్స్ ఉన్న పెరుగుని తీసుకోవడం వల్ల జీర్ణక్రియకు తోడ్పడి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. **ఖిచిడీ** - మాంసకృతులు మరియు అవసరమైన పోషకాల్ని అందిస్తుంది. బచ్చలికూర - ఇందులో ఐరన్,విటమిన్స్ ఎక్కువగా ఉండి హీమోగ్లోబిన్ స్థాయిల్ని పెంచి అలసటని తగ్గిస్తాయి. **బాదం :** ఇవి ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, శక్తి కోసం విటమిన్ ఇ ఉన్న బాదం ముఖ్యం రోజూ 4-5 బాదంని తీసుకోవాలి. **ఉసిరి...** దీనిలోని విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. **వెల్లుల్లి :** దీనిలోని ఆంటీ బాక్టీరియల్ గునాలు ఇన్ఫెక్షన్లతో పోరాడడంలో సహాయపడుతుంది. అంతేగాకుండా వ్యర్థ పదార్థాల్ని తగ్గించి లింఫాటిక్ (శోషరస) వ్యవస్థని మెరుగుపరుస్తుంది., ఇది శక్తివంతంగా ఉంటుంది. రోజూ 3-6 గ్రాములు తీసుకోవచ్చు. **బెల్లం :** ఇది శరీరానికి ఇనుమును అందిస్తుంది. శరీరానికి శక్తి స్థాయుల్ని అందిస్తుంది. **నిమ్మరసం :** దీనిలోని విటమిన్‌సి రోగ నిరోధకశక్తిని పెంచుతుంది. **తాజాపండ్లు :** ఆంటీ ఆక్సిడెంట్ల కోసం నారింజ జామ, బొఇప్పాయి, అరటి, ఆరెంజెస్ పండ్లను తీసుకోవచ్చు. ఇవేగాకుండా వెజటబుల్ ఉప్మా, కొత్తిమీర, మొల కెత్తిన గింజల ఛాట్ రాజ్మీ, జీరారైస్, కరివేపాకు, ఆవాలు, నానపెట్టిన అత్తిపండ్లు, కర్జూరాలు, తులసీ, పుదీనా వంటి ఆహారపదార్థాల్ని కూడా ఆహారంలో భాగంగా తీసుకోవచ్చు. వీటిని మితంగా కొద్దికొద్దిగా తీసుకోవాలి. కడుపుతిప్పి, వాంతులు, విరేచనాలు వంటివి ఉండడం వల్ల జీర్ణకాని ఆహారాన్ని తీసుకోరాదు. శరీరం హైడ్రేట్‌గా ఉండడానికి నీరు, కొబ్బరినీరు, మజ్జిగ, నిమ్మరసం, పండ్లరసాలు కొద్ది కొద్దిగా ఎక్కువసార్లు తీసుకోవచ్చు. మసాలా, జిడ్డుగల ఆహారం, ప్రాసెస్ట్‌ఫుడ్, క్రొవ్వు ఎక్కువగా ఉన్న పదార్థాలు కుకీస్, కేక్‌లు, పాస్ట్రీలు, స్నాక్స్, జంక్‌ఫుడ్ తీసుకోరాదు. తీసుకుంటే గట్‌హెల్త్ దెబ్బతింటుంది. ప్రోటీన్, ఐరన్ లోపం లేకుండా కాలీఫ్లవర్, బ్రకోలీ, క్యారట్, సోయాబీన్, రాజ్మా, పన్నీర్ తీసుకోవాలి. తగినంత నిద్ర, క్రమమైన వ్యాయామం, చేస్తూ ఒత్తిడికి దూరంగా ఉండాలి. సోయాబీన్ టి.బి. బాక్టీరియాతో పోరాడుతుంది. పనీర్ కండరాల్ని నిర్మించి బలాన్ని అందిస్తుంది. ఆల్కహాల్, పొగాకు మానివేయాలి. కెఫిన్, శుద్ధిచేసిన చక్కెర, పిండి, సాస్‌లకి దూరంగా ఉండాలి. పేస్ట్రీలు, కేకులు, పిజ్జా, బర్గర్లు, వైట్‌బ్రెడ్, వైట్‌రైస్, వెన్న వంటి వాటికి దూరంగా ఉండాలి. క్రొవ్వు,కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్న రెడ్‌మీట్‌కు దూరంగా ఉండాలి. చిరుతిండ్లు మానివేయాలి. నూనె వస్తువులు ప్రాసెస్ చేసిన ఆహారాలు తీసుకోరాదు.

రోజూ 1-2 లవంగాలు తీసుకోవడం మంచిది. బీట్‌రూట్‌రసం ఫ్రూట్ మిల్క్‌షేక్ రుచికరంగా ఉండా పోషకశక్తిని పెంచుతాయి. పాలు, సూప్‌లు ఉడికించిన ఆహారాల్ని ఎక్కువగా తీసుకోవచ్చు. క్షయరోగి తన ఇష్టానుసారం ఎటువంటి ఆహారమైనా తీసుకోవచ్చు. ప్రత్యేకమైన ఆహార పథ్యాలు అంటూ ఏమీ లేవు. శరీర తత్వానికి సరిపోనీ ఆహారం తీసుకోకుండా వుంటే సరిపోతుంది. పౌష్టికా హారం తీసుకుంటే కొంతవ్యాధినిరోధకశక్తి పెరుగుతుంది. తద్వారా ఆరోగ్యం చేకూరుతుంది. □

# ఆదర్శ మార్గాలు

ఆధ్యాత్మికం



ఆదర్శ మార్గాలు కాలాన్ని దైవంగా భావిస్తూ సాగడానికి, కుటుంబ వ్యవస్థ సవ్యంగా నడపటానికి రామాయణ, భారత, భాగవతాది ఇతిహాస పురాణాల్లో ఎన్నో ఉదాహరణలు కనిపిస్తాయి. రాముడు సోదరులతో సఖ్యంగా ఉన్న తీరు, తమ్ములు అన్నను గౌరవించిన తీరు. ఇవన్నీ ప్రతి తరంలోనూ పెద్దలు ముందు తాము తెలుసుకుని, అనుసరించి చిన్నలకు చెబుతుండాలి. యాగరక్షణకు శ్రీరాముణ్ణి మాత్రమే పంపమని విశ్వామిత్రుడు దశరథుణ్ణి కోరితే.. లక్ష్మణుడు స్వచ్ఛందంగా అన్న సేవకోసం అడవులకు బయల్దేరాడు. కైకేయి ఆదేశం మేరకు శ్రీరాముడు అరణ్యాలకు వెళ్తుంటే.. సొంత సుఖాలను వదులుకొని లక్ష్మణుడు పద్నాలుగేళ్లు అన్నను వెన్నంటే ఉన్నాడు. మహా భారతంలో యక్ష ప్రశ్నల సందర్భం కూడా సోదర బంధాన్ని ప్రతిబింబిస్తుంది. యక్షమాయ వల్ల భీమార్జున నకుల సహదేవులు మరణించినప్పుడు ధర్మరాజు యక్షప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పాడు. దానికి మెచ్చిన యక్షుడు మరణించిన వారిలో ఒక్కరిని మాత్రమే బతికిస్తానన్నాడు. ధర్మరాజు నకులుణ్ణి కోరుకున్నాడు. అంతులేనిబలపరాక్రమవంతులైన భీమార్జునులను కాదని,నకులుణ్ణే ఎందుకు కోరావని-యక్షుడు అడిగాడు. కుంతికి జన్మించిన వారిలో తాను బతికే ఉన్నానని, సవతి తల్లి మాద్రి కొడుకుని కూడా బతికించడం తన బాధ్యత కనుక అలా కోరానన్నాడు ధర్మరాజు. ఆయన మాటల్లో ధర్మం కుటుంబానికి ఇచ్చిన ప్రాధాన్యత, సోదరబంధ సౌందర్యం కనిపించడంతో.. యక్షుడు సంతోషించాడు, అందరినీ బతికించాడు. ఇవి కొన్ని ఉదాహరణలే ఇలా కుటుంబసభ్యులందరూ ఒకరి కష్టంలో ఒకరు పాలు పంచుకోవటం, సుఖసంతోషాల్లో కలిసి ఆనందించటం అనే తత్త్వం ప్రపంచవ్యాప్తంగా పెరగాలి. కాలం విలువను తెలుసుకుని జీవితాన్ని సార్థకం చేసుకోవాలననదే ఆధ్యాత్మిక వేత్తల లక్ష్యం. ఈ లక్ష్య సాధనలోనే అనంతమైన ఆనందం,విశ్వశాంతి ఇమిడి ఉన్నాయి. □

# సలాడ్ డిటాక్స్

శరీరంలో పెరిగిన కొవ్వు, పిండి పదార్థాలు లేదా చక్కెరను తగ్గించకపోతే పలు అనారోగ్యసమస్యలు దరిచేరతాయి. అలాగే శరీరంలో పేరుకున్న మలినాలను బయటకు పంపితేనే ఆరోగ్యంగా ఉంటాం. ఇందుకోసం 'సలాడ్ డిటాక్స్' మంత్రం పాటిద్దామా !



సలాడ్స్ అంటేనే... పోషకాల పవరస్లు తక్కువ క్యాలరీలున్న వీటితో ఎక్కువ శక్తినీ పొందొచ్చు. రుచిగానూ చేసుకోవచ్చు. శరీరంలోని మలినాలను తేలికగా బయటకు పంపే బచ్చలి, పాలకూర తదితర ఆకుకూరలు, క్యారెట్, క్యాబేజీ, బ్రాకలీ వంటివి సలాడ్స్కు మంచిది. వీటిలో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగానూ ఉం టాయి. వీటిలోని పీచు జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. సలాడ్స్ గుమ్మడి, పొద్దు తిరుగుడు గింజలతోపాటు మొలకెత్తిన విత్తనాలను కలిపితే విటమిన్లు, ఖనిజలవణాలను పొందొచ్చు. ఇవి కాలేయ సామర్థ్యాన్ని పెంచుతాయి. రక్తంలో చక్కెర స్థాయులను స్థిరీకరించడానికి సాయపడతాయి, ఆవిరిపై ఉడికించిన చికెన్, గుడ్లు, శనగలు వంటి లీన్ ప్రొటీన్లను సలాడ్కు ఉపయోగిస్తే మరిన్ని పోషకాలను పొందొచ్చు. అవకాడో, దానిమ్మ గింజలు, నారింజ ముక్కలు, వాల్నట్స్ తోపాటు రెండుమూడు చుక్కల అలివనూనె కలిపితే చాలు. ఆరోగ్యకరమైన కొవ్వులు అంది హృద్రోగసమస్య ఉండదు. ఆకు కూరలు, టొమాటోలు, కీర కలిపిన సలాడ్లోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. ఒమేగా 3 కోసం గింజధాన్యాలను సలాడ్లో చేర్చుకుంటే మంచిది, కొత్తిమీర, తులసి వంటివి మంచి ఫ్లేవర్ నిస్తాయి. ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయి. డ్రైఫ్రూట్స్ ముక్కలతో యాంటీ ఆక్సిడెంట్లు అందుతాయి. కీరదోస, క్యారెట్, బెల్ పెపర్లోని పీచు మెరుగైన జీర్ణశక్తినిస్తుంది. అందంలో.. తగినంత నీరు అంది చర్మం పొడిబారదు. విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని మెరిసేలా వేస్తాయి. చర్మకణాల పునరుత్పత్తికి ఆకుకూరల్లోని విటమిన్‌ఏ తోడ్పడితే, నిమ్మ రసంలోని సీవిటమిన్ కొల్లజెన్ ఉత్పత్తికి సాయపడుతుంది. ముందస్తు వృద్ధాప్య ఛాయలను తగ్గిస్తుంది. జట్టు ఆరోగ్యానికి కావాల్సిన ఇనుము, బయోటిన్ సహా అవసరమైన విటమిన్లు, ఖనిజాలను సలాడ్స్ నుంచి పొందొచ్చు. వారంలో కనీసం ఒక రోజు పూర్తిగా సలాడ్స్ తీసు కుంటే డిటాక్స్‌తో అధిక బరువు సమస్యను దూరం చేసుకోవచ్చు. అందంగానూ మెరిసిపోవచ్చు. □

# కొల్హాపురి మసాలా



ఏ కూరలోనైనా ఉల్లి తరుగు, టొమాటో గుజ్జు వేసినంతలో సరిపోదు. పల్లీపొడి, కొబ్బరికోరు, లవంగాలు, దాల్చినచెక్క స్థిర జోడిస్తేనే అవి మరింత రుచిగా ఉంటాయి. కూరల్లో కాస్తంత కొల్హాపురి మసాలా గనుక దట్టించామంటే ఘుమఘుమలాడుతూ ఎప్పుడెప్పుడు తిందామా అనిపిస్తుంది. ఈ మసాలా ఇంట్లోనే చేయొచ్చు. దీనికి ఏమేం దినుసులు కావాలంటే ధనియాలు, ఎండుకొబ్బరి ముక్కలు రెండు టేబుల్‌స్పూన్ల చొప్పున, గసగసాలు, జీలకర్ర, నువ్వులు టేబుల ్స్పూన్ చొప్పున, మెంతులు అర చెంచా, మిరియాలు చెంచా, దాల్చినచెక్క అంగుళం ముక్క లవంగాలు ఆరేడు, యాలకులు, నల్ల బిర్యానీపువ్వులక్ తీసుకోవాలి.ఎలా చేయాలంటే పైన చెప్పిన అ ఒప్పందం ప్యాన్‌లో వేసి మీడియం ఫ్లెమ్ మీద రెండు నిమిషాలు వేయించాలి. చల్లారిన తర్వాత జార్లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి, అంతే.. కొల్హాపురి మసాలా సిద్ధం. దీన్ని తడి లేని, గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకోవాలి. ఈ పాళ్లను అనుసరించి ఇంకొంచెం ఎక్కువ పరిమాణంలోనూ చేయొచ్చు. □



# ఛాంపియన్స్ ట్రోఫీలో.. ఎవరి బలం ఎంత?




## వీటి మధ్యే హోరాహోరీ

**న్యూఢిల్లీ:** మినీ వరల్డ్ కప్‌గా భావించే ఛాంపియన్స్ ట్రోఫీ-2025 ఎడిషన్‌కు సంబంధించిన సమరం నాలుగో రోజులోకి ప్రవేశించింది. ఈ టోర్నీలో 8 జట్లు పాల్గొంటున్నాయి. వీటిలో ప్రధాన జట్ల మధ్యే హోరాహోరీ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో ఏజట్టు బలం ఎంతెంత అనేదానిపై తర్జన భర్జనలు జరుగుతున్నాయి. అయితే ఇది వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్ 8 టీమ్స్ పాల్గొనే టోర్నీ, కాబట్టి ఏ జట్టునూ తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదు. ఇప్పటికే న్యూజిలాండ్ చేతిలో ఆతిథ్య పాకిస్తాన్, టీమిండియా చేతిలో బంగ్లాదేశ్ ఓటమి చవిచూసింది. ఇక ఎప్పటిలాగే టీమ్‌ఇండియా టైటిల్ ఫేవరెట్లలో ఒకటి అనడంలో ఎలాంటి సందేహం లేదు. స్వదేశంలో రీసెంట్‌గా ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన టీమ్‌ఇండియా ఊపు మీదుంది. ఈ సిరీస్ తోనే సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఫామ్ అందుకోవడంతో రెట్టించిన ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. గిల్, అయ్యర్, రాహుల్ నిలకడైన ప్రదర్శన కలిసొచ్చే అంశం. అయితే బుమ్రా లేడనే ఆందోళన తప్పా, టమిండియా అన్ని రంగాల్లో బలంగానే కనిపిస్తోంది. ఇక 2023లో వన్డే వరల్డ్ కప్ చేజారడంతో ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీనైనా దక్కించుకోవాలని రోహిత్ సేన ఉవ్విళ్లూరుతోంది. ఇప్పటికే బంగ్లాదేశ్‌తో జరిగిన తన తొలి మ్యాచ్‌లో భారత్ విజయంతో బోణీ కొట్టింది.

ఇక ఉప ఖండేతర జట్లలో భారీ అంచనాలున్నది న్యూజిలాండ్ జట్టుపైనే. ఐసిసి టోర్నీల్లో కివీస్ ఎప్పుడూ నిలకడగా ఆడుతుంది. ఇటీవల ఆతిథ్య పాకిస్థాన్‌ను రెండుసార్లు ఓడించి ట్రై సిరీస్ గెలవడం ఆ జట్టు విశ్వాసాన్ని పెంచేదే. బ్యాటింగ్‌లో విలియమ్సన్, కాన్వే, ఫిలిప్స్, మిచెల్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్‌లో శాంట్నర్, బ్రాస్‌వెల్, హెన్రీ, ఒరూర్క్ నిలకడగా రాణిస్తున్నారు. ఇప్పుడున్నఊపులో ఫైనల్‌చేరగలదనే ధీమ కివీస్‌లో కన్పిస్తోంది. అలాగే ఆస్ట్రేలియా ఎల్లప్పుడూ ఐసిసి టోర్నీల్లో ఫేవరెట్ల లిస్ట్‌లో కచ్చితంగా ఉంటుంది. కానీ, ఈసారి మాత్రం కంగారూలపై పెద్దగా అంచనాలు లేవు. కెప్టెన్ కమిన్స్‌తో పాటు హేజిల్‌వుడ్, మిచెల్ మార్ష్, స్టార్క్, స్టొయినిస్ అందుబాటులో లేక ఆసీస్ బలహీన పడింది. తాత్కాలిక కెప్టెన్ స్టీవ్ స్మిత్‌కు తోడు లబుషేన్, మ్యాక్స్‌వెల్, షార్ట్, ఇంగ్లిస్, అబాట్, స్పెన్సర్ జాన్సన్, ఎలిస్ లాంటి ప్రతిభావంతులతో కూడిన కంగారూ జట్టు టోర్నీలో ఎక్కడిదాకా వెళ్తుందో చూడాలి. అలాగే ఫార్మాట్ ఏదైనా ఇంగ్లాండ్ ప్రస్తుతం ప్రపంచ మేటి జట్లలో ఒకటి. అయితే భారత పర్యటనలో టీ20, వన్డే సిరీస్‌లు కోల్పోవడం ఇంగ్లాండ్ ఆత్మవిశ్వాసాన్ని కొంత దెబ్బ తీసేదే. అయినా సరే, సాల్ట్, డకెట్, బట్లర్, బ్రూక్, రూట్, లివింగ్‌స్టన్‌తో ఇంగ్లాండ్ బ్యాటింగ్ పటిష్ఠంగా కనిపిస్తుంది. రషీద్ రూపంలో మేటి స్పిన్నర్ అందుబాటులో ఉన్నా అతడికి సహకరించే స్పిన్నర్లు లేరు.

ఆర్చర్, సకిబ్ మహమూద్, వుడ్‌లతో కూడిన పేస్ విభాగం కూడా సరైన ఫామ్‌లో లేదు. ఇక దురదృష్టాన్ని వెంటబెట్టుకుని ఐసిసి టోర్నీలకు వస్తుందని పేరున్న సౌతాఫ్రికా ఈసారి కథ మార్చాలనుకుంటోంది. ఇటీవలే అరంగేట్రం చేసిన బ్రీట్జ్‌కే ఫామ్‌లో ఉన్నాడు. మార్‌క్రమ్, వాండర్ డసెన్, క్లాసెన్, మిల్లర్ లాంటి సీనియర్లు బ్యాటింగ్‌లో ఆ జట్టుకు పెద్ద అండ. పేస్‌లో రబాడ మీదే జట్టు ఎక్కువ ఆశలు పెట్టుకుంది. ఎంగిడి ఫామ్‌లో లేడు. స్పిన్నర్లు కేశవ్ మహారాజ్, షంసి రాణించడం ఎంతో కీలకం.




## పింక్ లేడీస్ కప్‌లో.. భారత్ మహిళల జట్టు శుభారంభం

### జోర్డాన్‌పై 2-0తో విజయం

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక పింక్ లేడీస్ కప్-2025లో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు శుభారంభం చేసింది. షార్జాలో జరిగిన తమ తొలి పోరులో స్వీటీ దేవీ సారథ్యంలోని భారత జట్టు 2-0 గోల్స్ తేడాతో జోర్డాన్స్‌పై విజయం సాధించింది. భారత్ తరఫున ప్రియాంక దేవి (23వ నిమిషంలో), మనీషా (54వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. మ్యాచ్ ఆరంభం నుంచే భారత మహిళల జట్టు దూకుడు కనబర్చింది. తొలి అర్ధభాగంలో వచ్చిన అవకాశాన్ని ప్రియాంక దేవి సద్వినియోగ పర్చుకుంటూ జోర్డాన్ గోల్ కీపర్‌ను బోల్తా కొట్టించి భారత్ ఖాతా తెరిచింది. కాసేపటికే స్కోరు పెంచే అవకాశం వచ్చినా దాన్ని మనీషా సరిగ్గా వినియోగించుకోలేక పోయింది. ద్వితీయార్థంలో ఎలాంటి పొరపాటుకు తావివ్వకుండా మనీషా గోల్ కొట్టి జట్టుకు విజయం ఖాయం చేసింది. క్రిస్పిన్ ఛెత్రి భారత మహిళల కోచ్ ఎంపికైన అనంతరం భారత్ జట్టుకు ఇదే తొలివిజయం కావడంవిశేషం.

జోర్డాన్ పదేపదే ప్రతి దాడులకు ప్రయత్నించినా, స్వీటీ దేవి, పుర్ణిమ కస్తూరితో కూడిన రక్షణ శ్రేణి వాటిని సమర్థవంతంగా అడ్డుకుంది. తెలంగాణ అమ్మాయి గుగులోతు సౌమ్య ఆకట్టుకుంది. ఈ మ్యాచ్ ద్వారా భారత యంగ్ ప్లేయర్ లిషమ్ బబీనాదేవి అంతర్జాతీయ అరంగేట్రంచేసింది. తదుపరిపోరులో ఈనెల 23న రష్యాతో భారత్ తలపడుతుంది.



## ఖతర్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో.. సెమీస్‌కు భారత్ స్టార్ బాంబ్రీ జంట

**న్యూఢిల్లీ:** ఖతర్ ఓపెన్ ఎటిపి-500 టెన్నిస్ టోర్నీలో భారత డబుల్స్ స్టార్స్ యూకీ బాంబ్రీ, రోహన్ బోపన్నలకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. దోహాలో జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) జోడీ ఏకంగా ప్రపంచ నంబర్‌వన్, టాప్‌సీడ్ జంటను బోల్తా కొట్టించి సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లగా, రోహన్ బోపన్న (భారత్)- నునో బోరెజెస్ (పోర్చుగల్) ద్వయం క్వార్టర్ ఫైనల్లో ఇంటిదారి పట్టింది. ప్రపంచ నంబర్వన్ జంట మార్సెలో అరెవాలో (ఎల్ సాల్వడార్)-మాట్ పావిక్ (క్రొయేషియా)లతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో యూకీ-డోడిగ్ 2-6, 6-3, 10-8తో విజయం సాధించింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ-డోడిగ్ ఆరు డబుల్ ఫాల్టు చేసింది.అయితే సూపర్ టైబ్రేక్‌లో యూకీ-డోడిగ్ ద్వయం పైచేయి సాధించింది. జూలియన్ క్యాష్-లాయిడ్ గ్లాస్పూల్ (బ్రిటన్)లతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో బోపన్న-బోర్జెస్ 4-6, 7-6 (7/5), 7-10తో సూపర్ టైబ్రేక్స్‌లో ఓటమి పాలయ్యారు.

## రంజీ ట్రోఫీలో.. ప్రతీకారం తీర్చుకున్న విదర్భ



### ముంబైపై గెలిచి ఫైనల్లోకి ఎంట్రీ

**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీ-2024-25 చివరి అంకానికి చేరింది. ఈ సీజన్లో తొలి ఫైనల్ బెర్త్ అధికారికంగా ఖరారైంది. రెండో సెమీ ఫైనల్లో ముంబైని ఓడించి విదర్భ వరుసగా రెండో సీజన్‌లో ఫైనల్‌కు చేరింది. గత సీజన్ ఫైనల్లో ముంబై చేతిలో ఎదురైన పరాభవానికి విదర్భ ఈ సీజన్ సెమీస్‌లో ప్రతీప్రకారం తీర్చుకుంది. నాగపూర్‌లోని క్రికెట్ మైదానంలో జరిగిన సెమీ ఫైనల్లో ముంబైపై విదర్భ 80 పరుగుల తేడాతో గెలుపొందింది. విదర్భ నిర్దేశించిన 406 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ముంబై 325 పరుగులకు ఆలౌటైంది. హర్ష్ దూబే5, యశ్ ఠాకూర్, పార్థ్ రేఖడే తలో 2 వికెట్లు తీసి ముంబైని దెబ్బకొట్టారు. ముంబై ఇన్నింగ్స్‌లో ఎవ్వరూ భారీస్కోర్లు చేయలేదు. ముంబై ఓటమి ఖరారైన తర్వాత శార్దూల్ ఠాకూర్ (66) అర్ధ సెంచరీ సాధించాడు. షమ్స్ ములానీ (46)సాయంతో శార్దూల్ ముంబైని గట్టెక్కించే ప్రయత్నం చేశాడు. స్టార్ బ్యాటర్లు అజింక్య రహానే (12), శివమ్ దూబే (12), సూర్య కుమార్ యాదవ్ (23) తక్కువ స్కోర్లకే ఔటయ్యారు. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో ఆకాశ్ ఆనంద్ ఈ సారి 39 పరుగులకు ఔటయ్యాడు. యువ ఆటగాళ్లు ఆయుశ్ మాత్రే (18), సిద్ధేశ్లాడ్ (2) నిరాశపరిచారు. ఆఖర్లో తనుశ్ కోటియన్ (26), మోహిత్ అవస్తి (26), రాయ్‌స్టన్ డయాస్ (23) కంటితడుపు చర్చగా బ్యాట్స్ ఝులిపించారు. అక్షయ్ వాద్కర్ (34) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. అథర్వ తైడే 4, పార్థ్ రేఖడే 23, హర్ష్ దూబే 18, భూటే 11, యశ్ ఠాకూర్ 3 పరుగులు చేసిఔట్ కాగా, దర్శన్ నల్కండే 12 పరుగులతో అజేయంగా నిలిచాడు. ముంబై బౌలర్లలో శివమ్ దూబే 5 వికెట్లతో రాణించగా, షమ్స్ ములానీ, రాయ్‌స్టన్ డయాస్ తలో 2, శార్దూల్ ఠాకూర్ ఓ వికెట్ తీశారు. అనంతరం బరిలోకి దిగిన ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 270 పరుగులకే ఆలౌటైంది. స్టార్ బ్యాటర్లు, టీమిండియా ప్లేయర్లు అజింక్య రహానే (18), సూర్యకుమార్ యాదవ్ (0), శివమ్ దూబే (0) దారుణంగా విఫలమయ్యారు. ఆకాశ్ ఆనంద్ (106) అద్భుతమైన పోరాటపటిమ కనబర్చి సూపర్ సెంచరీతో ముంబైపరువు కాపాడాడు.విదర్భ బౌలర్లలో పార్థ్ రేఖడే4, యశ్ ఠాకూర్, హర్ష్ దూబేతలో 2, దర్శన్ నల్కండే, భూటేచెరో వికెట్ పడగొట్టారు.

## అంగరంగ వైభవంగా ఫార్ములావన్

### మార్చి 16 నుండి మెల్‌బోర్న్‌లో కార్ల రేసింగ్



**న్యూఢిల్లీ:** ఫార్ములావన్ 75వ వార్షికోత్సవ సీజన్ ఆరంభ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. నలుపు రోడ్డుపై వాయువేగంతో కార్లు నడుపుతూ అభిమానులను అలరించే రేసర్లు ఈ ఈవెంట్లో రెడ్ కార్పెట్‌పై అభిమానులకు చేతులూపుతూ దర్శనమిచ్చారు. 24రేసులతో కూడిన 2025 ఫార్ములావన్ సీజన్ మార్చి 16న మెల్‌బోర్న్‌లో జరిగే ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రితో మొదలవుతుంది. ఈ సందర్భంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ ఆరంభ కార్యక్రమంలో 2025 సీజన్లో పోటీపడే 20 మంది డ్రైవర్లు తమ కార్లతో పాటు పాల్గొన్నారు. ఏడుసార్లు ప్రపంచ ఛాంపియన్ లూయిస్ హామిల్టన్ స్టేజి మీదకు వచ్చిన సమయంలో ప్రేక్షకుల హర్షధ్వానాలతో ఆడిటోరియం మార్మోగిపోయింది. సుదీర్ఘ ఎఫ్1 చరిత్రలో ఇలాంటి వేడుక జరగడం ఇదేతొలిసారి కాగా, ఇందులో భాగంగా బ్రిటన్ సింగర్ కేన్ బ్రౌన్ మ్యూజిక్ షో ఆహుతులను కట్టిపడేసింది. కనీవినీ ఎరగని రీతిలో కళ్లు మిరుమిట్లు గొలిపేలా సాగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ కళాకారులు పాల్గొన్నారు. ఫార్ములావన్ మరింత విస్తరించడంలో భాగంగానే హాలీవుడ్ సినిమా స్థాయిలో ఈ వేడుకు నిర్వహించారు. దీనిపై హామిల్టన్ స్పందిస్తూ 'చాలా ఉత్సాహంగా ఉంది. కొత్త సీజన్లో మరింత వేగంగా దూసుకెళ్లాలని చూస్తున్నా. అందుకు కావాల్సిన శక్తి ఉంది. కొత్త జట్టులో భాగం కావడం ఆనందంగా ఉంది. ఇదే ఉత్తేజంతో ముందుకు సాగుతా' అని అన్నాడు.

---

# ఫోన్‌పే ఐపిఒకు సెబి గ్రీన్ సిగ్నల్


**ముంబై, ఫిబ్రవరి 21:** గడచిన కొన్ని రోజులుగా దేశీయంగా స్టాక్ మార్కెట్లలోకి వస్తున్న క్రేజీ ఐపీవోల సంఖ్య భారీగా తగ్గిపోయింది. ఈ క్రమంలో మార్కెట్లు ఒడిదొడుకుల్లో ఉండటం కూడా రిటైల్ పెట్టుబడిదారులను మార్కెట్లకు కొంత దూరంగా ఉండేలా చేస్తోంది. ఈ క్రమంలోనే కొత్త కంపెనీలు తమ ఐపీవో ఫ్లోటింగ్ ప్లాన్స్ రివీల్ చేస్తున్నాయి. అమెరికా రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ యాజమాన్యంలో పనిచేస్తున్న 'ఫోన్‌పే' సంస్థ చాలా కాలంగా తన ఐపీవోను తీసుకురావటం కోసం అవసరమైన సన్నాహాలను చేస్తున్న సంగతి తెలిసిందే. చివరిగా 2023లో ఇన్వెస్టర్ల నుంచి ఫండింగ్ అందుకున్న కంపెనీ విలువ అప్పట్లో 10 బిలియన్ డాలర్లుగా అంచనా వేయబడింది. అయితే ప్రస్తుతం డిజిటల్ చెల్లింపులు విస్తరించటంతో ఈ విలువ మరింతగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం కంపెనీ మార్కెట్లో పేటీఎం, నావీ, గూగుల్ పే వంటి ఇతర పోటీదారులను కలిగి ఉంది.

వాస్తవానికి సింగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న సంస్థ 2022 డిసెంబరులో తన బిజినెస్ ఆపరేషన్స్ ఇండియాకు మార్చేసింది. దీని కారణంగా కంపెనీ దాదాపు 8000 కోట్ల మేర భారీ పన్ను చెల్లింపులను చేపట్టాల్సి వచ్చింది. దీని కారణంగా నాన్ పేమెంట్ సేవలను కంపెనీ పూర్తిగా స్వాధీనంలోకి తెచ్చుకుంది. అయితే ప్రస్తుతం దేశీయ స్టాక్ మార్కెట్లో ఐపీవో ఫ్లోట్ చేయటానికి అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో కంపెనీ తన ప్లాన్ ముందుకు తీసుకెళ్లాలని చూస్తోంది. కంపెనీ తన ।శివీకి సంబంధించి సన్నాహక చర్యలను ప్రారంభించినట్లు ఫోన్‌పే ఒక ప్రకటనలో తెలిపింది.

దీని ద్వారా కంపెనీ తన వ్యాపారాన్ని భారతీయ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేయాలని యోచిస్తోంది. ఈ ఏడాది కంపెనీ తన వ్యాపార ప్రయాణాన్ని ప్రారంభించి 10వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ ఐపీవో ప్లాన్ మంచి మైలురాయిగా నిలుస్తుందని తెలుస్తోంది. కంపెనీ తన డిజిటల్ సేవల ద్వారా ప్రస్తుతం దేశంలో కోట్ల మంది ప్రజలకు సేవలను అందిస్తూ దగ్గరైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆర్థిక ఫలితాలు ప్రస్తుతం కంపెనీ దేశీయ స్టాక్ మార్కెట్లోకి ప్రవేశించటానికి అనుకూలంగా ఉన్నట్లు యాజమాన్యం భావిస్తోంది. 2024 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 73 శాతం వృద్ధిని నమోదు చేసింది. దీంతో కంపెనీ మొత్తం ఆదాయం రూ.5064 కోట్లుగా నమోదైందని బెంగళూరు టెక్ కంపెనీ వెల్లడించింది. ఈ క్రమంలో కంపెనీ తన నికర ఆదాయం రూ.197 కోట్లుగా నమోదు చేసి నష్టాల నుంచి బయటకు వచ్చింది.

## చాట్‌జిపిటి యాక్టివ్ యూజర్లు 400 మిలియన్లు

**ముంబై, ఫిబ్రవరి 21:** ఓపెన్‌ఎఐకి చెందిన ఎఐ చాట్‌బాట్ చాట్‌జిపిటి వినియోగించే వారి సంఖ్య రోజురోజులూ పెరుగుతోంది. ఈ విభాగంలో పోటీ ఇచ్చేందుకు ఇప్పటికే పలు సంస్థలు ముందుకొస్తున్నా చాట్‌జిపిటికి ఉన్న క్రేజ్ ఏమాత్రం తగ్గడం లేదు. గతేడాది డిసెంబరుతో పోలిస్తే ప్రస్తుతం ఉన్న యూజర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ విషయాన్ని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బ్రాడ్ లైట్‌క్యాప్ వెల్లడించారు. తమ సేవలు చాలా మందికి చేరువైనట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఓపెన్‌ఎఐ చాట్‌బాట్‌కు వారానికి 400 మిలియన్ల మంది యాక్టివ్ యూజర్లు ఉన్నారు. డిసెంబరులో ఈ సంఖ్య 300 మిలియన్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్యలో చాలా పెరుగుదల నమోదైంది. చాట్‌జిపిటిని కేవలం వ్యక్తులు మాత్రమే కాదు, కంపెనీలు కూడా వినియోగిస్తున్నాయి. వీటి సంఖ్య దాదాపు 2 మిలియన్ల వరకు ఉంది. సెప్టెంబరుతో పోలిస్తే ఈ సంఖ్య రెట్టింపైంది. ఉబెర్, మోర్గాన్ స్టాన్లీ, టి-మొబైల్స్ వంటి పెద్ద పెద్ద కంపెనీలు ఓపెన్ ఎఐని వినియోగిస్తున్న సంస్థల జాబితాలో ఉన్నాయి. చాలా మంది డెవలపర్లు ఓపెన్‌ఎఐకి చెందిన ఎఐ మోడళ్లను వారి సొంత యాప్‌లలో వినియోగిస్తున్నారు. దీంతో ఈసేవల్ని వినియోగించే డెవలపర్ల సంఖ్య ఆరు నెలల్లో రెట్టింపైంది. అదే సమయంలో ఓపెన్‌ఎఐ అడ్వాన్స్‌డ్ రీజనింగ్ మోడల్ వినియోగం ఏకంగా ఐదు రెట్లు పెరిగిందని కంపెనీ తెలిపింది. ఇదిలా ఉండగా, కృత్రిమ మేధ విభాగంలో ఇప్పటికే పోటీ నెలకొంది. చైనాకు చెందిన ఎఐ కంపెనీ డీప్‌సీక్‌ను ఒక్కసారిగా మార్కెట్‌లోకి దూసుకొచ్చి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. మరోవైపు ఎలాన్ మస్క్‌కు చెందిన గ్రోక్ కూడా తన ఎఐ సేవల్ని మెరుగుపరుస్తూ వస్తోంది. అయినప్పటికీ, చాట్‌జిపిటికి మాత్రం తన యూజర్ల సంఖ్యను ఏ మాత్రం కోల్పోకుండా పెంచుకుంటుండడం విశేషం.




## కియా '1380 ఇవి6' కార్ల రీకాల్

**ముంబై, ఫిబ్రవరి 21:** ప్రముఖ వాహన తయారీ సంస్థ కియా మోటార్స్ తన 'ఇవి6' కోసం స్వచ్ఛందంగా రీకాల్ ప్రకటించింది. 2022 మార్చి 3 నుంచి 2023 ఏప్రిల్ 24 మధ్య తయారైన మొత్తం 1,380 యూనిట్లలో సమస్య ఉన్నట్లు గుర్తించి ఈ రీకాల్ ప్రకటించడం జరిగింది. కియా 'ఇవి6' ఎలక్ట్రిక్ కార్లలో ఇంటిగ్రేటెడ్ ఛార్జింగ్ కంట్రోల్ యూనిట్‌లో 12వి బ్యాటరీ పనితీరును ప్రభావితం చేసే లోపం కారణంగా రీకాల్ ప్రకటించింది. ఈ సమస్య కారణంగా 2024లో కూడా కంపెనీ 1138 యూనిట్లకు రీకాల్ ప్రకటించింది. ఇప్పుడు మరోమారు రీకాల్ జారీచేసింది. ఇంటిగ్రేటెడ్ ఛార్జింగ్ కంట్రోల్ యూనిట్‌లోని సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ 12వి బ్యాటరీ ఛార్జింగ్, పనితీరును మెరుగుపరుస్తుంది. ఇది కారులోని లైట్స్, వైపర్లు, మ్యూజిక్ సిస్టమ్ వంటి వాటికి శక్తిని ఇస్తుంది. కార్లలో ఈ లోపాన్ని కంపెనీ ఉచితంగానే పరిష్కరిస్తుంది. అయితే సంబంధిత వాహనాల యజమానులను నేరుగాసంప్రదించి వాటిని అప్‌డేట్ చేస్తామని కంపెనీ పేర్కొంది. ప్రభావిత వాహనాల కస్టమర్లు అపాయింట్‌మెంట్ షెడ్యూల్ చేసుకోవడానికి, సంబంధిత కియా డీలర్‌షిప్‌లను సంప్రదించవచ్చు. ఇతర వివరాల కోసం టోల్‌ఫ్రీ నంబర్‌కి కాల్ చేయవచ్చు.



# ట్రంప్‌తో ఆపిల్ సిఇఒ భేటీ

## వాణిజ్యం

**వాషింగ్టన్, ఫిబ్రవరి 21:** అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆపిల్ సిఇఒ టిమ్‌కుక్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో వైట్‌హౌజ్‌లో సమావేశమయ్యాయి. చైనాలో ఆపిల్ తన తయారీ ప్లాంట్ నుంచి భారీగానే వివిధ దేశాలకు ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. అందులో కొంతభాగం అమెరికాకూ ఎగుమతి అవుతోంది. అయితే ఇటీవల అమెరికా-చైనాల మధ్య సుంకాల విషయంలో తీవ్ర చర్చ సాగుతున్న నేపథ్యంలో టిమ్ కుక్ ట్రంప్‌తో భేటీ అవ్వడం చర్చనీయాంశం అయింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్ని చైనా దిగుమతులపై 10శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇది చైనాలో ఉత్పత్తి అవుతూ అమెరికాలోకి వస్తున్న ఆపిల్ ఉత్పత్తులను నేరుగా ప్రభావితం చేస్తుంది. ఇది కంపెనీ ఉత్పత్తుల ధరల పెరుగుదలకు దారితీస్తుంది. ఈ సుంకాల నుంచి ఆపిల్ ఉత్పత్తులను రక్షించడం తన ప్రాథమిక లక్ష్యంగా కుక్ భావించారు. దాంతో ట్రంప్‌ను ప్రత్యక్షంగా కలిసి టారిఫ్ మినహాయింపులు కోరినట్లు తెలిసింది. అయితే గతంలో మాదిరి కాకుండా ఈ సారి ఆపిల్‌కు ఎలాంటి మినహాయింపులు ఉండవని ట్రంప్ సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. వాణిజ్య సమస్యలతో పాటు ఆపిల్ గోప్యతా విధానాలపై ట్రంప్, టిమ్‌కుక్‌ల మధ్య చర్చ జరిగింది. సమర్థంగా చట్టాలను అమలు చేసేందుకు న్యాయబద్ధమైన సంస్థల కోసం కొన్ని ఐఫోన్లను అన్‌లాక్ చేయాలని ప్రభుత్వం ఎప్పటి నుంచో వాదిస్తోంది. ట్రంప్ ఈ అంశాన్ని లేవనెత్తడంతో కుక్ వినియోగదారుల గోప్యతకు కట్టుబడి కన్నట్లు తెలియ చేశారని తెలిసింది.



## సెన్సెక్స్, నిఫ్టీలకు నాలుగో రోజూ నష్టాలే..

**ముంబై, ఫిబ్రవరి 21:** దేశీయ స్టాక్ మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. ముఖ్యంగా ఆటో స్టాక్స్‌లో విక్రయాల కారణంగా సూచీలపై ఒత్తిడి పెరిగింది. మహీంద్రాఅండ్ మహీంద్రా 6శాతం టాటా మోటార్స్ షేర్లు 2.46 శాతం చొప్పున నష్ట పోయాయి. ఈ క్రమంలో స్టాక్ మార్కెట్ బెంచ్ మార్క్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా నాలుగో రోజూ నష్టాల్లో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 75,612.61 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 75,112.41 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరిన సూచి, చివరికి 424.90 పాయింట్ల నష్టంతో 75,311.06 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 117.25 పాయింట్ల నష్టంతో 22,795.90 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలోరూపాయి విలువ 7 పైసలు నష్టపోయి రూ.86.71 వద్ద నిలిచింది.మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా మోటార్స్, సన్‌ఫార్మా, పవర్ గ్రిడ్ కార్పొరే షన్ వంటి షేర్లు నష్టపోయాయి. టాటా స్టీల్, లార్సెన్ అండ్ టూబ్రో, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, ఏసియన్ పెయింట్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు వంటి షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 75.90 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 2944 డాలర్ల వద్ద ట్రేడయింది.




## కొత్త 'ఇవి' పాలసీ వదంతులు ..టాటా, మహీంద్రా షేర్లు డౌన్

**ముంబై, ఫిబ్రవరి 21:** ప్రముఖ కార్ల తయారీ సంస్థలైన టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. విదేశీ కార్ల తయారీ కంపెనీలకు ఆహ్వానం పలికేందుకు కేంద్రం కొత్త 'ఇవి' పాలసీని తీసుకురాబోతోందన్న వార్తల నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆయా కంపెనీల షేర్లు ఆరు శాతం వరకు నష్టపోయాయి. దేశంలోకి అమెరికా కార్ల తయారీ సంస్థ టెస్లా ఎంట్రీ దాదాపు ఖరారైంది. అయితే సుంకాలు మరింత తగ్గించాలని ఆ కంపెనీ కోరుతోంది. ఈ నేపథ్యంలో టెస్లా కోసం ప్రభుత్వం కొత్త 'ఇవి' పాలసీని మరింత సులభతరం చేస్తూ తీసుకురాబోతోందంటూ వార్తలు వస్తున్నాయి. దిగుమతి సుంకాన్ని తగ్గిస్తే విదేశీ కార్లు దేశీయ మార్కెట్లో ప్రవేశించేందుకు వీలు పడుతుంది. అప్పుడు దేశీయ కార్ల తయారీ కంపెనీలకు గట్టి పోటీ ఏర్పడుతుంది. ఈ భయాల నేపథ్యంలో ఆటో స్టాక్స్ అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో నిఫ్టీ ఆటో సూచి 2శాతం మేర నష్టపోయింది. మహీంద్రా అండ్ మహీంద్రా 6శాతం, టాటా మోటార్స్ 2 శాతానికిపైగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ప్రస్తుతం 'ఇవి' కార్ల మార్కెట్లో ఈ రెండూ మెజారిటీ వాటా కలిగి ఉన్నాయి.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.